42/43

మార్చి / ఏప్రిల్

సృజన

ఆధునిక సాహిత్య వేదిక



నిర్వహణ
'సాహితీ మిత్రులు'

1 రు.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

42/43

మార్చ్ / ఏప్రిల్ 1973

నిర్వహణ
"సాహితీ మిత్రులు"

80 పేజీలు 1 రూపాయి

ముఖచిత్రం : భగత్‌సింగ్
సందర్భం : 43వ వీరమరణ దినం - 23 మార్చి '73

విడిప్రతి: ఒక రూపాయి
అర్ధసంవత్సర చందా: ఆరు రూపాయలు
సంవత్సర చందా: పది రూపాయలు

ప్రతులకు, వివరాలకు :
సృజన
హనుమకొండ
వరంగల్ - 506001

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal-506002 (A.P.)

సృజన

అభ్యుదయ సాహిత్య వేదిక

1973 మార్చి / ఏప్రిల్ — మాస పత్రిక 42/43

స్వ (?) విషయం

సృజన మార్చ్ ఏప్రిల్ సంచికలు కలిపి ఒకే సంచికగా ప్రచురించాల్సి వస్తున్నది. ఫిబ్రవరిలో వెలువడిన జన్మదిన సంచికను పాఠకులు ఎంతో ఉత్సాహంతో స్వీకరించారు కాని ఈ ఉత్సాహం ఆలోచనాపరంగా వ్యక్తమయినంతగా ఆర్థికంగా కాలేదు. కొన్నాళ్ళుగా సృజన ప్రచారం నెల నెలకు క్రమంగా పెరుగుతున్నది. కాని డిసెంబర్ నెల మొదలుకొని ఆంధ్ర ఉద్యమం ఫలితంగా, బంద్‌లు, ఆందోళనల వలన, తపాల అసౌకర్యాల వలన పత్రికలు మిగిలిపోవడము, వి పి పి లు తిరిగిరావడము జరిగింది. ఆందోళన, కరువు సాకుగా పెట్టుకొని కాగితం మున్నగు అన్ని పత్రికావసరాల ధరలు విపరీతంగా పెంచారు. సృజన పాఠకులు పేదవాళ్ళు. కరువు కాలంలో పత్రిక కొనలేనివాళ్ళు. ఈ కారణాలన్నిటివల్ల పత్రిక ఆర్థికంగా చాల నష్టపడ్డది. ఇవన్నీ అనివార్యమయిన (కనీసం ఈ వ్యవస్థలో) ఇబ్బందులు.

కాని సృజనపట్ల, వామపక్ష సాహిత్యంపట్ల అభిమానంతో ఏజెన్సీ తీసుకొని, విడిగా తెప్పించుకొని పత్రికలు విరివిగా అమ్మికూడ డబ్బు పంపించని ఏజెంట్లు, అభిమానుల విషయమే ఆశ్చర్యంగానూ, విచారంగానూ వున్నది. బకాయిలున్నవారంతా వెంటనే చెల్లిస్తారని ఆశిస్తున్నం.

సృజనలో లోపాలు వుంటే చూపి, సరిదిద్ది, సృజననొక విప్లవ సాహిత్య వేదికగా నిలబెట్టుకొనే బాధ్యతను స్వీకరించవలసిందిగా పాఠకులను కోరుతున్నం. మే నెల సంచిక మే దినోత్సవ ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. పాఠకుల సూచనలు, రచనలు ఆహ్వానిస్తున్నం.

— 'సాహితీ మిత్రులు'

సమ సమాజంలో విద్య

సాంస్కృతిక విప్లవంతరవాత జనచైనాలో విద్యావిధానం

కన్సర్న్డ్ ఏసియన్ స్కాలర్స్ కథనం.

స్వేచ్ఛానువాదం : రాంప్రసాద్

(గతసంచిక తరువాయి)

పెకింగ్ మిడిల్‌స్కూల్ నెం. 31

పెకింగ్ నగరం మధ్యలో నెం. 31 మిడిల్ స్కూల్ ఉంది. ఇది చాలాకాలం కిందట పాశ్చాత్యమత ప్రచారకులు ప్రారంభించినది. విశాలమైన ప్రాంగణంలో ఒకపక్కన గాథశిల్పాలుచెక్కిన ప్రార్థనా మందిరం వుంది. దానిపై మతచిహ్నాలన్నీ తొలగించి యిప్పుడది స్కూలుగా వాడుతున్నారు. మిగిలిన భవనాలు, యిటుకలతో కట్టిన పొట్టి ప్రాకారాలమధ్య, అపక్కనే మూడు ప్రాంగణాల్లో వున్నాయి. వీట్లో కొన్ని క్లాసురూంలు, మరికొన్ని పింగ్‌పాంగ్ ఆటగదులు. వాటిమధ్య ఒక ఈతకొలను వుంది. అక్కడి టీచర్లు, స్కూలునిర్వాహకులు, విద్యార్థులు మాకొక చిన్న మీటింగ్ హాల్లో స్వాగతంచెప్పేరు ఆ స్కూలు గత చరిత్రగురించి వారెవరూ గర్వించడంలేదు. సాంస్కృతిక విప్లవం తెచ్చిన మార్పుల గురించి చర్చించడానికే ఎక్కువ ఉత్సాహం చూపేరు.

ఒక సంవత్సరంముందే ఉద్యోగంలో చేరిన టీచర్ ఒకాయనున్నారు. మొదట్లో పిల్లల్ని క్రమశిక్షణలో వుంచటం ఆయనకి పెద్దసమస్య అయేదట. వాళ్లు ఎంతసేపటికీ వర్క్‌షాపుల్లో పనిచేయడానికీ, వ్యాయామం క్లాసులకి వెళ్ళడానికీ సరదాపడేవారు తప్ప క్లాసుల్లో కుదురుగా కూర్చునేవారుకారట. ఫ్యాక్టరీలో మాత్రం అతిచురుగ్గానూ శ్రద్ధగానూ పనిచేసేవారు. తాను ఎంత విమర్శించినా లాభంలేకపోయేసరికి ఫ్యాక్టరీల్లో వారు చేసే పనుల్ని సరిగా అర్థంచేసుకోడం మెచ్చుకోడంతో వాళ్ళదృష్టిని సులువుగా ఆకట్టుకోగలిగేనని ఆ టీచర్ వివరంగా చెప్పేరు.

మొదట క్లాసురూంలు,ఫ్యాక్టరీలు చూసి స్కూలు వెనకనున్న మైదానందగ్గర చేరేం. అది పిల్లల ఆటస్థలం. ప్రతి రోజూ ఉదయాన్నే పిల్లలందరూ అక్కడ సామూహికంగా వ్యాయామంకూడా చేస్తారు. ఉదయంచేసే వ్యాయామం ఆరోజు మేంవెళ్లేవరకూ

ఆపేరు. మేం మైదానం చేరగానే క్లాస్‌రూముల్లోనుండి పిల్లలంతా బిలబిలమంటూ వచ్చేరు. చిరునవ్వులతో మమ్మల్ని ఒకరికొకరు చూపించుకుంటూ గుసగుసలుగా కబుర్లు చెప్పుకుంటూ, అందరూ మైదానంలో రెండుబారులుగా తీర్చినిలబడి వ్యాయామం మొదలెట్టేరు. అప్పుడే ఎండ కొద్దిగా ముదురుతూంది. పిల్లల లేతబుగ్గలు గులాబుల్లా ఎర్రబడుతూవుంటే నీడలో నిలబడిచూస్తూ, మేమే కారణంకదాఅని సిగ్గుతో బాధపడాల్సి వచ్చింది. ఆ తరవాత ఈతకొలనుకు వెళ్లేం. నీలం-ఎరుపురంగు ఈతదుస్తులు వేసుకున్నఆడపిల్లలు నీళ్ళలోమునిగి ఈదడం నేర్చుకుంటున్నారు. కొందరు కిచకిచలాడుతూ కేరింతాలుకొడుతూ, కొత్తవాళ్ళకి నీళ్ళల్లో తలముంచడం నేర్పుతున్నారు. మరికొందరు అతిథులు, టీచర్లు ఉన్నారని సంకోచంలేకుండా, ఒకర్నొకరు నీళ్ళల్లోకి తోసుకుంటూ గోలచేస్తున్నారు. తొందర్లో ఆ స్కూలుకు వేసవి సెలవులు ఆరంభం కాబోతున్నాయి. అప్పటికే వాళ్లంతా ఆసంవత్సరం అనుభవాల్ని చర్చించుకునే కార్యక్రమంలోవున్నారు. అందుచేత మేము పాఠాలు జరుగుతూవుండగా యెక్కువ క్లాసులుచూసే అవకాశం లేకపోయింది.

మాకు స్కూలుచూపెడుతున్న ఒక అమ్మాయిని "వేసవిసెలవుల్లో నువ్వేంచేస్తావు?" అని అడిగేం. "సాధారణంగా పిల్లలందరూ సెలవుల్లో గ్రామాలకువెళ్ళి పనిచేస్తారు కాని ఈ స్కూల్లో అందరు పిల్లలకీ అలాటి అవకాశం సాధ్యంకాలేదు. ఈ సెలవుల్లో నేను ఇంటిదగ్గరేవుండి మా చిన్నతమ్ముణ్ణి చూసుకుంటాను. అయినా సెలవుల్లోకూడా స్కూల్లో ఏదో ఒక పని వుండనే వుంటుంది" అందామె. సెలవుల్లో పల్లెకువెళ్లే అవకాశం లేనందుకు ఆమె నిరుత్సాహపడినట్టు కనిపించింది.

ఆ తరవాత స్కూలు ఆవరణలో చేరేం. పెద్దక్లాసుల ఆడపిల్లలు కొందరు సాంస్కృతిక ప్రదర్శనకు తయారవుతున్నారు. వాళ్లు పాడటం ప్రారంభించగానే దూరాన పింగ్-పాంగ్ ఆడుకుంటున్న పిల్లలు వచ్చి మమ్మల్నీ ప్రదర్శననీ చూస్తూ అక్కడ పిట్టగోడమీదకువంగి నిలబడ్డారు. ఆపిల్లలు చాలా బిడియపడుతూన్నట్టనిపించి మధ్యలోనే సిగ్గుపడి నవ్వేసి ప్రదర్శన అభాసుచేస్తారనిపించింది. కాని చివరవరకూ చాలా బాగా నటించేరు. ప్రజావిమోచనా సైనికుల దుస్తులు ధరించిన ఆ రెడ్‌గార్డ్‌లు, ఆ ప్రదర్శనలో వియత్నాం ప్రజలుగా నటించేరు. అమెరికా విమానాన్ని కూల్చేయటం ఎంతో నేర్పుగా ప్రదర్శించేరు. ఆ తరువాత కొన్ని బృందగీతాలు పాడేరు. చివర్న ప్రేక్షకులతోసహా ప్రదర్శకులుకూడా అందరూ చప్పట్లుకొడుతూండగా ప్రదర్శన ముగిసింది. అలా ప్రదర్శకులు, ప్రేక్షకులు కలిసి చప్పట్లుచరచడం చైనాలోఆచారం. ప్రదర్శన విజయవంతంచేయడంలో ప్రదర్శకులూ ప్రేక్షకులుకూడా కలిసి కష్టించారనీ

ఎవరిపాత్రి వారు సరిగా నిర్వహించేరనీ దీనిఅర్థం. ఈ ఆచారం మాకు చాలా బాగా నచ్చింది. తరువాత, తిరిగి మీటింగ్‌రూంకు వెళ్లేం. ఈసారి ఫలితాల గురించి ఎక్కువగా చర్చించేం.

ప్రవేశం (Admissions)

అదివరకు మమ్మల్ని పలకరించిన పొడుగాటి పిల్లలు, బలంగా ఆరోగ్యంగాఉన్న ఆ ముగ్గురూ ఆ చుట్టుపక్కలనే ఉంటున్నారట. సాంస్కృతిక విప్లవానికి పూర్వం మిడిల్‌స్కూల్‌లో చేర్చుకోడానికి ప్రవేశపరీక్ష ఉండేది. నగరంలో ఏ స్కూల్లోనైనా అన్నిప్రాంతాల విద్యార్థుల్ని చేర్చుకునేవారు. ఈ ప్రవేశపరీక్షల పద్ధతివల్ల "ట్రాకింగ్" సిస్టమ్ బలపడింది. పేరుపడిన స్కూళ్లలో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న పిల్లలకే ప్రవేశం దొరికేది. సామాన్యంగా వీరందరూ శ్రామికేతరవర్గంవారే అయుండేవారు. అంతకంటె తక్కువ ప్రసిద్ధిగల స్కూళ్ళలో మామూలు మార్కుల వాళ్ళను చేర్చుకునే వారు. తగినన్ని మార్కులురాని అనేకమంది పిల్లలు చదువులు మానుకోవలసివచ్చేది. ప్రభుత్వ అధికారులు, కమ్యూనిస్టుపార్టీలో ఉన్నతస్థానాల్లో ఉన్నవాళ్లమాత్రం తమ పిల్లలకి తక్కువ మార్కులు వచ్చినా, తమ పరపతినుపయోగించి మంచి మిడిల్ స్కూళ్లలో చేర్చగలిగేవారు.

సాంస్కృతిక విప్లవం తరువాత "ప్రవేశ పరీక్షలు" "ట్రాకింగ్ సిస్టమ్" రద్దు చేసేరు. ప్రైమరీ పరీక్ష పాసయినవాళ్లు, ఏ ప్రాంతం విద్యార్థులు ఆప్రాంతపు మిడిల్ (సెకండరీ)స్కూళ్ళలోనే చేరేపద్ధతి అమలుచేసేరు. ఇది చాలా ముఖ్యమైన మార్పు. దీనిఫలితంగా ప్రైమరీ పరీక్షపాసయిన ప్రతివిద్యార్థీ తన చదువు కొనసాగించే అవకాశం కలిగింది అంతేకాక దీనివల్ల ప్రతి మిడిల్‌స్కూల్లోనూ వివిధ కుటుంబస్థితిగతులు, విభిన్న శక్తి సామర్థ్యాలుగల పిల్లలు కలిసి చదువుకునే అవకాశం కలిగింది. మేము వెళ్ళిన ప్రతి నగరంలోను యీ మార్పుగురించి వాకబుచేసేం. కాంటన్, షాంఘై, నాన్‌కింగ్, సియాన్ నగరాల్లోకూడా ప్రవేశపరీక్షలు రద్దుచేసి ఈ కొత్తపద్ధతినే అవలం బిస్తున్నట్లు అధికారులు చెప్పేరు. ఈ విధానంవల్ల సెకండరీ విద్యలో సమానత్వం సాధించగలమని వారాశిస్తున్నారు.

విద్యా కాలం :

పెకింగ్‌లో మిడిల్ స్కూళ్ల విద్యాకాలం ఆరునుంచి అయిదు సంవత్సరాలకు తగ్గించారు. సాంస్కృతిక విప్లవానికి పూర్వం మూడేళ్లు జూనియర్ మిడిల్ స్కూలు (జూనియర్ హైస్కూలు) మూడేళ్లు సీనియర్ మిడిల్‌స్కూలు(సీనియర్ హైస్కూలు)

మొత్తం మిడిల్‌స్కూల్ విద్య ఆరేళ్లు ఉండేది. జూనియర్ నుండి సీనియర్‌కు వెళ్ళడానికి మరొక ప్రవేశ పరీక్ష పాస్‌కావలసి వుండేది. చైనా ఫ్యాక్టరీల్లో మేం చూసిన యువ కార్మికులుఅనేకమంది జూనియర్ మిడిల్‌స్కూల్ గ్రాడ్యుయేట్లే. అంటే చాలా తక్కువ మంది యువజనులు మాత్రమే సీనియర్ మిడిల్‌స్కూల్‌కు వెళ్లగలిగేవారన్నమాట. ఇప్పుడు జూనియర్ సీనియర్ వేర్పాటు రద్దుచేసి అందరూ అయిదు సంవత్సరాల మిడిల్‌స్కూల్ చదువు పూర్తిచేసే అవకాశం కల్పించేరు.

ఇదివరలో ప్రైమరీ విద్య ఆరుసంవత్సరాలు, సెకండరీవిద్య ఆరు సంవత్సరాలు వుండేది. నగరాలలోవుండే విద్యార్థులుగూడా ఈ పన్నెండు సంవత్సరాల విద్య పూర్తి చేయలేకపోయేవారు. ఈ విద్యాకాలాన్ని పది సంవత్సరాలకు తగ్గించడంవల్ల ఇప్పు డున్న టీచర్లు, పరికరాలతోనే ఎక్కువమంది పిల్లల్ని విద్యావంతులుచేసే అవకాశం లభించింది. ఇలా విద్యాకాలం తగ్గించడం మూలంగా పిల్లలందరికీ చదువుకునే అవకా శం కల్పించగలమని చైనావారు ఆశిస్తున్నారు.

మిడిల్‌స్కూల్ నెం. 31 అధికారులు ఈ కొత్తవిధానాల లాభాలగురించి చెబుతూ వుంటే, మిగతా చైనా నగరాలలో మేం చూసిన విషయాలతో వాటిని పోల్చుకున్నాం, ప్రస్తుతం చైనాలో స్థానిక స్థాయిలో ప్రయోగాలు జరుగుతున్నందువల్ల విద్యాకాలం విషయంలో వివిధనగరాలలో విభిన్న ప్రమాణాలు పాటిస్తున్నారు.

విద్యాకాలం, ఇతర విద్యావిషయక యేర్పాట్లు గ్రామీణ ప్రాంతాల్లో యింకా భిన్నంగా ఉన్నాయి సాంస్కృతిక విప్లవానికి పూర్వం ఎందరో రైతులపిల్లలు చదువు కోవాలంటే పొలం పనులు విడిచిపెట్టవలసి వచ్చేది. ఎక్కువమందికి యిది సాధ్యమ యేదికాదు. అంతేకాక మిడిల్‌స్కూళ్లలో చదవాలంటే చాలా దూరంలోవున్న నగరా లకు వెళ్లాల్సివచ్చేది. సాంస్కృతిక విప్లవం తరువాత చాలాకమ్యూన్లు ఉత్పత్తిదళాలు స్వంతంగా మిడిల్‌స్కూళ్లను యేర్పాటుచేసుకున్నాయి. కనీసం అప్పటివరకూవున్న అయిదు సంవత్సరాల ప్రైమరీస్కూళ్లకు రెండుసంవత్సరాల మిడిల్‌స్కూలు తరగతు లను జోడించేరు. ఇలా మిడిల్‌స్కూలు రెండు సంవత్సరాలకు కుదించడమంటే సెకం డరీ విద్యను విపరీతంగా తగ్గించడమే. కాని యిదివరలో ఏ మాత్రం మిడిల్‌స్కూలు విద్యకు నోచుకోని రైతుపిల్లలకు ఇది విస్తృతమైన విద్యావకాశాలనే కలిగించింది.

షాంగ్జీరాష్ట్రం మెరకపల్లాలతో విస్సారమైన గుట్టలతో కఠినప్రదేశం. నిండిన అక్కడి తా-చాయ్ ఉత్పత్తిదళం స్వయంగా తొమ్మిది సంవత్సరాల ప్రైమరీ, మిడిల్ స్కూళ్లు నడుపుతూంది. ఆ గ్రామజనాభా 438. మేటలుపడ్డ మెరకభూములు, అనను

కూలమైన వాతావరణం లొంగదీసుకుని కృషిచేయడం వాళ్ళకి విపరీతమైన కష్టప్రయత్నమే అయింది. ఇటీవలే వారు కొంత విజయం సాధించారు, కొద్దికాలమై ఉత్పత్తి పెరగడంతో తమ పిల్లలకి మిడిల్‌స్కూల్‌చదువు చెప్పించగలుగుతున్నారు. సాంస్కృతిక విప్లవంముందు ఆ ఊళ్లో అతికొద్దిమందిమాత్రమే పిల్లల్ని పట్నాల్లో మిడిల్‌స్కూళ్లకు పంపగలిగేవారు. అవూరు కమ్యూనిస్టు కమిటీ ఆఫీసరే అందుకు నిదర్శనం. ఎర్రగా బొద్దుగా పొడుగాటిజడలతో హుషారుగావున్న ఆయువతి ప్రైమరీస్కూలువిద్యమాత్రమే చదువుకుందట. తనకు అందని మిడిల్‌స్కూల్‌చదువు, తన బిడ్డకు అవూళ్లోనేదొరికే అవకాశం కలిగినందుకు ఆమె సంతోషం, తృప్తి వెలిబుచ్చింది. ఆ చుట్టుపక్కల మేం చూసిన చాలాగ్రామాల్లో కొత్తగా మిడిల్‌స్కూల్లు, ప్రైమరీ-మిడిల్ స్కూళ్లు స్థాపించేరు. గ్రామాల్లో కొత్తగా స్కూల్లు స్థాపించడంద్వారా పట్నాల్లోను నగరాల్లోను వున్నంత విస్తృతంగానూ గ్రామీణ ప్రాంతాల్లోకూడా విద్యావకాశాల్ని కల్పించడానికి చైనా నాయకులు యెంతో కృషిచేస్తున్నారు.

పాఠ్యాంశాలు :

నెం. 31 మిడిల్‌స్కూల్లో పన్నెండు సబ్జక్టులు చెబుతారనీ, ప్రతిసంవత్సరం అందులో తాము ఎనిమిది, తొమ్మిది విషయాలు ఎంచుకుంటామనీ విద్యార్థులు చెప్పేరు. అవి: రాజకీయాలు, చైనాభాష-సాహిత్యం, గణితం, ఇంగ్లీషు, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ప్రాదమిక వ్యవసాయ విజ్ఞానం, ఆరోగ్యం-పరిశుభ్రత, చరిత్ర, భూగోళం. ఆటలు-సైనికశిక్షణ, సాంస్కృతిక ప్రదర్శనలు.

మేము చూసిన చాలా స్కూళ్లల్లో బోధనావిషయాలు యించుమించు ఒకేమాదిరిగావున్నాయి. సో-చౌ(Soochow) మిడిల్‌స్కూల్లో పిల్లలు చైనాభాష-సాహిత్యం గణితం, వ్యవసాయం-పరిశ్రమల మౌలిక విజ్ఞానం, వ్యాయామం-సైనికశిక్షణ, సంస్కృతి, చరిత్ర-భూగోళం, రాజకీయాలు, విదేశీభాష చదువుతారు. తా-ఛాయ్ మిడిల్ స్కూల్లో 37 గురు పిల్లలు మావో ఆలోచనావిధానం-మార్క్సిజం, లెనినిజం, గణితం, చైనాభాష, భౌతిక-రసాయనశాస్త్రాలు, వ్యవసాయ పారిశ్రామిక మౌలికవిజ్ఞానం, సైనిక శిక్షణ-వ్యాయామం, విప్లవకళలు సంస్కృతి చదువుతున్నారు. తా-ఛాయ్‌వంటిగ్రామీణ ప్రాంతాల్లో విదేశీభాష ఏదీ చదవడంలేదు. పట్నాల్లోఉండే చాలా మంది పిల్లలు మాత్రం ఇంగ్లీషు చదువుతారు. కొన్ని స్కూల్లలో రష్యన్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్‌భాషలుగూడా నేర్పుతారు.

1949లో విముక్తి సాధించినప్పటినుండీ చైనాస్కూళ్లలో రాజకీయాల అధ్యయ

నానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. నవవిప్లవ సమాజానికి నూతన విద్యావిధానం కొత్తదృక్పథం ముఖ్యమైనవి. అందుకనే చైనాలో పాఠ్యాంశాలలో మావో ఆలోచనా విధానం— అంటే మావోరచనలు— మార్క్సిజం-లెనినిజంకు యెక్కువ ప్రాముఖ్యత నిస్తున్నారు. విద్య పూర్తి చేసి పట్టాలు తీసుకోడానికి, తదుపరి ఉద్యోగాలు పొందడానికీ పాఠ్యాంశాలలో పరిణతితోపాటు సరియైన రాజకీయ దృక్పథంకూడా అత్యవసరంగా భావిస్తారు.

31 నెం. మిడిల్‌స్కూల్లో టీచర్లు పిల్లలతో మాటాడినదాన్నిబట్టి, నాన్‌కింగ్‌లో ప్రైమరీస్కూల్లో చూచినదాన్నిబట్టి. సాంస్కృతిక విప్లవం తరువాత స్కూళ్లలో అన్ని స్థాయిలలోనూ రాజకీయాల అధ్యయనానికి మరింత ఎక్కువగా ప్రాధాన్యత యిస్తున్నారని మాకర్థమయింది. చైనీస్, ఇంగ్లీష్ భాషాధ్యయనంలో కూడా పాఠాలు రాజకీయ సంబంధమైనవే కావడం మేము గమనించేం.

ఇదివరలో విద్యార్థుల దృక్పథాలను మలచడంలో విద్యాలయాలు ఏమాత్రం శ్రద్ధ వహించలేదని, సాంస్కృతిక విప్లవ కార్యకర్తలైన రెడ్‌గార్డులు భావించారు ఇప్పుడు ప్రజలను సేవించడమే తమ పరమలక్ష్యంగా భావించేలా విద్యార్థులను మలచడానికి తీవ్రంగా కృషిచేస్తున్నామని నెం. 31 రు పెకింగ్ మిడిల్ స్కూల్ ఉపాధ్యాయులు మాతో చెప్పేరు. "వారు ఎవరికోసం ఈ చదువులు నేర్చుకొంటున్నారో మేము విద్యార్థులకు బోధిస్తాం వాళ్ల విజ్ఞానమూ శిక్షణా తమ తమ స్వంత ఆశలను నెరవేర్చుకోడానికి పరిమితం చేయడంకాక, చైనా మొత్తపు అభివృద్ధికి అంకితం చేయాలని గట్టిగా చెబుతాం."

చైనా అంతటా అనేక స్కూళ్లల్లో మేము చూసిన పాఠ్యపుస్తకాలన్నీ. ఆ యా ప్రాంతాల్లోవున్న బోధనావిషయాల పరిశోధనా సంఘాలు సాంస్కృతిక విప్లవ కాలంలో రాసినవి. స్థానికంగా ప్రయోగాలు చేస్తున్న ఈ దశలో, జాతీయ ప్రమాణాలతో నిర్ణయించిన ఒకే మాదిరి పాఠ్యాంశాలు అమలులోలేవు. దీనికి బదులు ఏ ప్రాంతం విద్యార్థులు ఆ ప్రాంతంలో తయారైన పుస్తకాలే చదువుతున్నారు. ఈ స్థానిక ప్రయోగాల ఫలితాలు పరిశీలించి పెకింగ్ విద్యాధికారులు దేశానికంతటికీ ఒకే ప్రమాణాలు ముందు ముందు నిర్ణయించవచ్చు.

చదుతూనే పనిచెయ్యడం; పనిచేస్తూ నేర్చుకోడం.

నెం. 31 రు పెకింగ్ మిడిల్‌స్కూలు విద్యార్థులు, సాంస్కృతిక విప్లవం తరువాత వాళ్ల స్కూల్లో ప్రారంభించిన వర్క్‌షాప్ పట్ల ఎంతో ఉత్సాహం కనబర్చేరు.

ఈ వర్క్‌షాపు చూస్తే విద్యావిధానంలో వచ్చిన అతి ముఖ్యమైన మార్పులు బోధపడతాయని వారన్నారు. పూర్వం కర్మాగారాల్లోను పొలాల్లోను స్వయంగా పనిచేస్తూ నేర్చుకొనే అవకాశంలేదు. కనుక అప్పటి విద్యావంతులు వ్యవసాయాన్ని పటాల్లోనూ, నల్లబల్లల మీదానూ; ఆచరణలో అక్కరకురాని విజ్ఞానం పుస్తకాల్లో చదివినవాళ్లు. లేత్ మిషన్ ఉపయోగించడం ఊహల్లోనూ మాత్రమే తెలిసినవాళ్లు. అందుచేతనే ఆ విద్యావంతుల్ని రైతులు కార్మికులు మనసారా పనిలోకి తీసుకోలేకపోయేవారు.

ఇప్పుడు పెకింగ్ మిడిల్ స్కూళ్లలో ప్రతి విద్యార్థీ సంవత్సరంలో ఒక నెల పాటు స్కూలు వర్క్‌షాపులోగాని, బయట ఫ్యాక్టరీలోగాని పనిచేస్తాడు. మరో నెల ఉత్పత్తిదళాల్లో చేరి వ్యవసాయ పనులు చేస్తారు. దీనితోపాటు రైతుల్ని కార్మికుల్ని సైనికుల్ని స్త్రీలనీ స్కూళ్లకు తరచు ఆహ్వానించి వాళ్ల వాళ్ల అనుభవాల్ని విద్యార్థులకి చెప్పిస్తారు. దీనివల్ల విద్యావిధానానికి సమాజంతో సరియైన దృఢసంబంధం ఏర్పరుస్తున్నామనీ, చదువు కేవలం సిద్ధాంతాలు వల్లెవెయ్యడంకాకుండా, ఆచరణలో ఉపయోగపడేలా నేర్చుకున్నది ఆకళింపుచేసుకోవడంగా, విద్యను అర్థవంతంగా మలుస్తున్నామనీ విద్యార్థుల్ని భావిజీవితాలకనుగుణంగా తయారుచేస్తున్నామనీ విద్యాధికార్లు భావిస్తున్నారు.

ఆ మధ్యాహ్నమంతా స్కూలు వర్క్‌షాపులో గడిపాం. ఆ స్కూలు నాలుగు వర్క్‌షాపులు ఒక పాత మేడలో వున్నాయి అందులో చిన్న చిన్న పరికరాలు కొత్తవి. పెద్ద యంత్రాలు మాత్రం ఫ్యాక్టరీలు పనికిరానివని విడిచిపెట్టినవి. ప్రస్తుతం చైనాలో స్వశక్తి మీద ఆధారపడడం, పొదుపు విధానాలు అనుసరిస్తున్నందువల్ల ఏదీ వృథాచేయరు. అందుకనే ఆ పాత యంత్రాలు తెచ్చుకుని విద్యార్థులు టీచర్లు కలిసి వాటిని బాగుచేసుకుని స్కూలు వర్క్‌షాపుల్లో ఉపయోగిస్తున్నారు.

సృజనాత్మక శక్తి నశించిపోతుందన్నది, అమెరికాలో సోషలిస్టు విధానానికి ఎదురయే పెద్ద ఆక్షేపణ. కాని చైనాలో స్కూలు వర్క్‌షాపులు చూసినప్పుడు ఇది వాస్తవం కాదని మాకు బోధపడింది. చైనాలో పిల్లలు నిజమైన సమస్యలు పరిష్కారం చేస్తారు. అమెరికాలో సృజనాత్మకత కళారంగానికి మాత్రమే పరిమితం చైనాలో అది ఉత్పత్తిపరంగానూ, నిజ సమస్యల పరిష్కారపరంగానూకూడా పరివ్యాప్తమవుతుంది.

మిడిల్‌స్కూలు వర్క్‌షాపులన్నిట్లోను పిల్లలు కొత్తగా కనిపెట్టిన పరికరాలు విధానాలు విరివిగా ఉపయోగంలోవున్నాయి. వీటిలో ప్రింటెడ్ సర్క్యూట్ల తయారీలో ఉపయోగించే నెగెటివ్‌లు తీసే కెమెరా ఒకటి. ఇలాటి కొత్త కెమెరా ఖరీదు వెయ్యి యువాన్లు (Yuan) (సుమారు మూడువేల అయిదు వందల రూపాయలు). ఇంత డబ్బు

కెమెరాకు ఖర్చుపెట్టడం ఆ స్కూలు వర్క్‌షాపు ప్రయోజనాలకే విఘాతం కలిగిస్తుంది. స్వశక్తిమీద ఆధారపడాలనే సూత్రం పూర్తిగా అవగాహన చేసుకున్నందువల్ల వారు ముప్పై యువాన్లకు (105 రు. లు) ఒక పాత లెన్సు కొని దాంతో కెమెరా స్వయంగా తయారుచేసేరు. సంవత్సరంపాటు అది వాడుతున్నారు. స్వయంగా తయారుచేసిన కెమెరా వారు గర్వకారణంగా ఎంచుతున్నట్టు ఆ వర్క్‌షాపు లీడరు చెప్పింది.

పిల్లలు కనిపెట్టిన మరో కొత్తయంత్రం చూసేం. పొదుపు చెయ్యాలనే లక్ష్యంవల్ల దీన్ని కనిపెట్టగలిగేరు. ఆటోమేట్ వైరింగ్‌కి కావల్సిన కేబుల్స్ ఆ స్కూలు వర్క్‌షాపులో తయారు చేస్తున్నారు. దీనికి సోల్డరింగ్ మెషిన్‌తో ఎక్కువ పని వుంటుంది. ఆ మెషిన్‌కి 220 ఓల్టుల విద్యుత్తు అవసరం. అంటే ఎంతో ఖర్చు. అది చాలా శక్తివంతమైన యంత్రం కనక పనిమధ్యలో వైర్లు అనేకసార్లు కాలిపోతుండేవి. అందువల్ల నాణ్యమైన కేబుల్సు తయారుచేయడం చాలా కష్టమయేది. ఈ ఖర్చును, వృధాను తప్పించడానికి, కార్మికులు విద్యార్థులు టీచర్లు కలసి ఆరు ఓల్టుల విద్యుత్తుతో పనిచేయగల కొత్తరకం సోల్డరింగ్ మెషిన్ కనిపెట్టేరు. దీని వాడకంతో ఖర్చు తగ్గడమే కాక, తీగలు తరచు కాలిపోవడంతో, తగినంత నాణ్యతకూడా లభ్యమైంది. ప్రమాదాల సంఖ్య తగ్గి పనిలో క్షేమం కూడా ఎక్కువయింది.

ఈ వర్క్‌షాపులు ప్రారంభించడంలో పిల్లలకి శిక్షణ యివ్వడమే ముఖ్య ప్రయోజనం కాని లాభాలు. అధికోత్పత్తి కావని అక్కడి టీచర్లు పిల్లలు అన్నారు. అయినా అక్కడ తయారైన వైర్లు, ట్రాన్సిస్టరు భాగాలు బయట ఫ్యాక్టరీలకు కూడా సప్లయి చేస్తారు. ఆవిధంగా పిల్లలకు పారిశ్రామిక శిక్షణ పొందడమేగాక, వారు చేసిన వస్తువులు నిజంగా ఉపయోగించబడేవి కూడా. ఇందువల్ల, సమాజంలోని ఉత్పత్తి శక్తుల్లో తామూ ఒక భాగమనీ, దేశసౌభాగ్య నిర్మాణంలో తమకీపాత్రవుందనీ విద్యార్థులు అనుకొనే అవకాశం కలిగిందనీ కనుక ఈ భాగాన్ని తమ పనిమొత్తంలో ముఖ్యమైనదిగా పరిగణిస్తామనీ విద్యార్థులు చెప్పేరు.

విద్యార్థులు విద్యుత్తు, తమ పనికి సంబంధించిన ఇతర సాంకేతిక విషయాల గురించి చాలా తెలుసుకుంటారు. ఫ్యాక్టరీలోను వర్క్‌షాపులోను పనిచేసే నెలరోజులూ వాళ్లు మిగతా తరగతులకు హాజరుకారు: చేస్తున్న పనికి సంబంధించిన వైజ్ఞానిక పుస్తకాలు చదివి చర్చలు జరుపుతారు.

కొంత మంది మిడిల్‌స్కూల్ విద్యార్థులు సంవత్సరానికొకనెల స్కూలు వర్క్

షాపులోకాకుండా బయట ఫ్యాక్టరీల్లో పనిచేస్తారు. నాన్‌కింగ్‌లోని ఒక ఫిలిం ప్రొజెక్టరు ఫ్యాక్టరీలో ముగ్గురు యువకులు కార్మికులతో కలిసి పనిచేస్తున్నారు. వారెవరని అడిగితే వాళ్లు మిడిల్‌స్కూల్ విద్యార్థులని చెప్పేరు ఆ మిడిల్‌స్కూలు ఆఫ్యాక్టరీకి ప్రతి నెలా కొందరు విద్యార్థుల్ని టీచర్లని పంపుతుందని చెప్పేరు. వాళ్లు ఒకోవారం ఒకోపనిచొప్పున ఫ్యాక్టరీలో అన్నిరకాల పనులు నేర్చుకుంటారు. అక్కడున్నప్పుడు వాళ్లు కార్మికులతోపాటు వాళ్ళ కేంటిన్లోనే భోజనం చేస్తారు. కార్మికులతో వాళ్ళ పనికి సంబంధించిన సాంకేతిక విషయాలు చర్చిస్తారు. పెకింగ్‌లోవలెనే నాన్‌కింగ్‌లోకూడా మిడిల్‌స్కూల్ విద్యార్థులు సంవత్సరంలో ఒకనెల పొలంలోను ఒకనెల ఫ్యాక్టరీలోనూ పనిచేస్తారు

విద్యార్థులు ఫ్యాక్టరీలు పొలాల్లో గడపవలసిన కాలం, చేసేపని ఒక్కొక్క ప్రాంతంలో ఒకోవిధంగా వుంటుంది. సో-చా (Soochow) మిడిల్‌స్కూలు విద్యార్థులు సంవత్సరానికి ఒక నెల ఉత్పత్తికి పనిచేస్తారు. షాంఘైలో మిడిల్‌స్కూలు చివరి సంవత్సరపు విద్యార్థులు సంవత్సరంలో ఆర్నెల్లు మూడునెల్లు ఫ్యాక్టరీల్లో, మూడునెల్లు పొలాల్లో పనిచేస్తారు. గ్రామాల్లో విద్యార్థులు పొలంపనుల కాలాన్నిబట్టి పనిలో పాల్గొంటారు. ఉదాహరణకి తా-భాయ్ మిడిల్‌స్కూల్లో తొమ్మిదవక్లాసు విద్యార్థులు మామూలుగా వారానికొకపూట, కోతకాలంలో ఒక నెల, విత్తులు-ఊడుపులు కాలంలో ఒకవారమూ వ్యవసాయపనులకు సాయంచేస్తారు. మొత్తంమీద "సిద్ధాంతం-ఆచరణ, పుస్తకం-పని రెండింటినించీ నేర్చుకోవాల"నే మావో సూత్రాన్ని చైనాలో అన్ని స్కూళ్ళలో అన్ని స్థాయిలలోనూ అమలు చేస్తున్నారు.

చదువులు పూర్తయాక :

నెం. 31 పెకింగ్ మిడిల్‌స్కూల్లో ఓ పన్నెండేళ్ల అమ్మాయిని 'చదువు పూర్తయేక నువ్వేం చేస్తావు' అని అడిగేం. 'ప్రజా విమోచన సైన్యంలో చేరుతాను' అని తడుముకోకుండా చెప్పింది. చాలామంది విద్యార్థులు యిలాగే చదువు తరవాత ప్రజావిమోచన సైన్యంలో చేరడానికే మొగ్గుచూపుతున్నారు కాని ప్రజా విమోచన సైన్యంలో అందరికీ స్థలం, అవకాశం వుండదు. 1970 లో నెం. 31 పెకింగ్ మిడిల్‌స్కూల్లో చదువు పూర్తిచేసినవాళ్లు, 60 శాతం ఫ్యాక్టరీలకు 30 శాతం వ్యవసాయ కేంద్రాలకు వెళ్లేరు. 10 శాతం లోపు ప్రజా విమోచన సైన్యంలో చేరేరు. కొద్దిమంది వాణిజ్య సంబంధమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అన్నిటికంటె కొట్టవచ్చి

నట్టు కనిపించే విషయం. గ్రేడ్యుయేట్లు ఎవరూ నేరుగా యూనివర్సిటీ చదువులో చేరడం లేదు.

చైనా అంతటా యిదే పద్ధతి. అయితే, కొన్ని యూనివర్సిటీలు మాత్రం ఒక ప్రయోగంగా, మిడిల్‌స్కూలు గ్రాడ్యుయేట్లను నేరుగా చేర్చుకుంటాయని తెలిసింది. యువకులంతా మిడిల్‌స్కూలు విద్య పూర్తయాక ఏదో ఒక పనిలో చేరుతారు. కొన్ని సంవత్సరాలు పనిలో అనుభవం పొందిన తరువాత కొందరు యూనివర్సిటీ విద్యకు ఎన్నిక కావచ్చు. కాని యూనివర్సిటీల్లో సీట్లు చాలా పరిమితంగా వున్నందువల్ల, ఎక్కువ మంది యువజనులు మిడిల్‌స్కూలు విద్యతోనే సరిపెట్టుకోవాలి. అయితే, వారు తీరిక సమయాలలో నడపబడే వివిధరకాల పయోజన విద్యాకేంద్రాలకు హాజరవ దానికి ఎన్నో అవకాశాలున్నాయి.

మిడిల్‌స్కూలు విద్య పూర్తికాగానే విద్యార్థుల్ని ఉత్పత్తి పనుల్లో ప్రవేశపెట్ట డంతోపాటు, సాంకేతిక శిక్షణగల బలగాన్ని గ్రామీణప్రాంతాలకు విస్తరించే విధానం కూడా జోడించేరు. అందుచేతనే, పెకింగ్‌వంటి పట్టణ మిడిల్‌స్కూల్ గ్రాడ్యుయేట్లు చాలామంది ఫ్యాక్టరీల్లోకాక, పొలాల్లో పనిచేస్తూ గ్రామాల్లో స్థిరపడతారు. 1970లో నెం. 31 మిడిల్‌స్కూలు విద్యార్థుల్లో 30 శాతం యిలాగే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేరు. సాంస్కృతిక విప్లవం తరువాత, షాంఘై నగరంలోని ఏడు లక్షల ముప్పై వేల మంది యువజనులు వ్యవసాయపనులు చేయడానికి గ్రామాలకు వెళ్లేరు.

చైనాలో వివిధ ప్రాంతాల్లో కమ్యూన్లలో ఈ విధంగా వెళ్లిన కొత్త రైతులు చాలామంది వున్నారు. కొందరు కమ్యూన్లలోవున్న ఫ్యాక్టరీల్లో, స్కూళ్లల్లో పనిచేస్తు న్నారు. మరికొందరు సంచార వైద్యులుగా (barefoot doctors) పనిచేస్తున్నారు. ఎక్కువభాగం మామూలు వ్యవసాయ పనుల్లో స్థిరపడ్డారు.

పట్నంలో చదువుతున్న విద్యార్థుల్ని రైతు జీవితం గడపమని గ్రామీణప్రాంతం పంపితే, వారు దాన్ని ఎలా తీసుకుంటారో మేం వూహించలేకపోయాం. నెం. 31 పెకింగ్ మిడిల్‌స్కూల్లో 1970లో గ్రాడ్యుయేటయిన చెన్-యు-పింగ్ అనుభవం అక్కడి విద్యార్థులు చెప్పేరు. చదువు పూర్తయేక ఆ అమ్మాయి నగరంలోనే ఉండా లని ఆమె తండ్రి కోరిక. అందుకు, తన పరపతినుపయోగించి ఆమెకి ఫ్యాక్టరీలో ఉద్యోగం వేయించే ప్రయత్నం చేసేడాయన. కాని ఆమె మాత్రం తాను ఎక్కువగా ఉపయోగపడగలిగేచోటనే పని చేస్తాననీ, తనకు గ్రామీణప్రాంతంలో పని యివ్వమనీ అధికార్లను కోరింది. కొంతకాలం తర్వాత ఆమె తిరిగివచ్చి స్కూల్లో పిల్లలకు తన

అనుభవాలు చెప్పింది. తమ శక్తియుక్తులు వినియోగించడానికి గ్రామీణ ప్రాంతాల్లో చాలా అవకాశాలున్నాయని ఆమె మమ్మల్ని ఒప్పించగలిగిందని అక్కడి విద్యార్థులు చెప్పేరు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడం గురించి కొందర్ని ఒప్పించవలసి రావడం వల్ల పట్నాలకంటె గ్రామాలు తక్కువ నాగరికంగా ఉండడంవల్ల, గ్రామ జీవితాన్ని ఎంచుకోడానికి మిడిల్‌స్కూల్ గ్రాడ్యుయేట్లు అనేకులు యింకా విముఖంగా వున్నారని అనుకోవలసివస్తుంది.

సాంస్కృతిక విప్లవంతరువాత సెకండరీ విద్యావిధానంలోవచ్చిన అనేక మార్పులు లక్ష్యసాధనలో పరస్పరం ఎలా తోడ్పడుతున్నాయో మాకు అర్థమైంది. మిడిల్‌స్కూళ్లలో అందరికీ సమాన విద్యావకాశాలూ, గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా విద్యావకాశాల విస్తరణ, తక్కువ విద్యాకాలం, పాఠ్యాంశాలలో పనికి తగిన స్థానం కల్పించడం-యివీ ముఖ్యమైన మార్పులు. ఇవన్నీ ఒక కొత్త తరహా మిడిల్‌స్కూలు గ్రాడ్యుయేట్ను తయారు చేయడానికి రూపొందించినవి. పెద్ద సాంకేతిక నిపుణుడు కాకపోయినా, పొలాల్లోను ఫ్యాక్టరీల్లోను ఎదురయే సమస్యల పరిష్కారంలో వెంటనే ఉపయోగపడగల నేర్పరితనం కల గ్రేడ్యుయేట్ను తయారుచేయడమే యీ విధానలక్ష్యం. ఇతనికి సాదా కష్టజీవులతోను తన దేశ అభివృద్ధి సమస్యలతోను సజీవమైన సంబంధం వుండాలి. అతను శ్రమచేసే ప్రజల్ని గౌరవిస్తూ, తన శాయశక్తులా ప్రజలకు సేవచేయడానికి సంసిద్ధుడుగా ఉండాలి. ఈ గ్రేడ్యుయేట్లు కొన్ని సంవత్సరాలు పనిలో అనుభవం గడించేక వీరిలో కొందర్ని యూనివర్సిటీ చదువుకు ఎన్నికచేస్తారు. ఎలా ఎన్నిక చేస్తారు? వారు యూనివర్సిటీలో ఏంచదువుతారు? ఇవి తెలుసుకుందికి పెకింగ్ యూనివర్సిటీ దర్శించేం.

(ఇంకా వున్నది)

ఇది మా దేశం

ఆర్. ప్రశాంత్

ఇది మా దేశం
ఇది మా కష్టం
నిర్మిస్తాం మేమిక్కడ
సమతా సుందర స్వర్గం.

బంగళాలు కట్టినాము
బలిసినోళ్ళ నివాసాలు
రహదారులు వేసినాము
మా కాళ్ళకు రాళ్ళబాట
యుద్ధాల్లో మా నెత్తురు
మీ చరిత్ర రాస్తున్నది
ఫ్యాక్టరీలో మా శక్తికి
మీ ఖజాన నిండుతుంది
పొలం పండి మా సత్తువ
మీగుమ్మిలో పలుకుతుంది
ఉత్పత్తే మా వంతు
ఉపయోగం మీ స్వార్థం

తరాలుగా దోచుకున్న
దొరలిక్కడ నిర్మాతలు
జాతికి జీవం పోసిన
ప్రజలిక్కడ దుర్మార్గులు
సాలెగూడు వ్యవస్థలో
సమిధలమైనాము మేము
మా తమ్ములు మా చెల్లెలు
కసిగందులు పసిపిల్లలు

పుట్టుకతో బిచ్చగాళ్ళు
పేరు ఊరులేనివాళ్ళు
కాంతిలేని బతుకులతో
కలకాలం పోరాడే
మా తల్లుల మా తండ్రుల
కష్టాలను దోచినోళ్ళు
ధర్మాలతో దానాలతో
స్వర్గాలే పొందుతారు
నవయవ్వన తేజస్సుతో
నందనాలు పండాల్సిన
నా అక్కలు నా అన్నలు
రౌడీలూ, వ్యభిచారులు
దొంగలు దోపిడిమూకలు ;

బడిచదువుల మార్ఫియాతో
మేధస్సును మింగి మేసి
యంత్రాంగపు పునాదుల్లో
రాళ్ళుచేసి వేసినారు
ఆలోచన పుట్టిందో
అతనిపేరు నక్సలైటు
అక్రమాల నెదిరిస్తే
అతడిక్కడ విద్రోహి.

పోలీసులు తుపాకులూ
జైళ్ళున్నయ్ ఎవరికొరకు ?
రాజ్యాంగం పుస్తకాలు
రాసుకున్న దెవరికొరకు ?

న్యాయశాఖ ముసుగుల్లో
న్యాయం జరిగేదెవరికి ?
ప్రజచేసిన తుపాకులే
ప్రజల గుండె చీల్చుతాయి
ప్రజకట్టిన జైలుగోడ
ఆ ప్రజలనె మింగుతుంది
జనంలోని పోలీసులు
జనంమీద కాపలాలు
దోపిడి సాగేటందుకు
రాజ్యాంగం తురుపుముక్క

దేశభక్తు డెవడిక్కడ ?
ఈ దేశం ఎవడిసొత్తు
ప్రేమను ప్రేమ ప్రేమించే
సమతా సుందర స్వర్గం
జన చరిత్రి భవిష్యత్తు.

ఇది మా దేశం
ఇది మా కష్టం
నిర్మిస్తాం మేమిక్కడ
సమతా సుందరస్వర్గం–

నెత్తుటిలో తడిసిన చెయి రాయునియ్ఁ

ఎస్. కె.

నిప్పులా అలా ముందుకు ఉరికి
ఇప్పుడే పిరికి నీకెందుకు
నెత్తుటిలో తడిసిన చెయి పైకెత్తడానికి
ఎందుకలా భయపడుతున్నావ్

విషపు వేళ్ళు నేలకుతన్ని
మొక్క మహావృక్షమై వూడలుపన్ని
నీడనిచ్చే మిషలో
నిముష నిముషం నీ వూపిరిలో విషాన్ని నింపుతుంటె

ఇంకా యేదో నెమ్మదిగా
మార్చాలి, మానిపించాలి, హింసకూడదు అన్నవి
రక్తం చల్లబడ్డ మాటలు
చెప్పిన గూటికే తిరిగి చేరే గాలిపాటలు

ఈ వెనుకాముందులాట వద్దు
ఆలోచనలోనే బతుకంతా గడుపొద్దు
నెత్తుటిలో తడిసిన చెయి పైకెత్తు
అది నువ్వందించే సందేశానికి గుర్తు.

కొత్త పండగ

ప్రభావతి

కాళ్ళు విరిగిన ఉగాది
మళ్ళీ వస్తోంది కుంటుతూ— దేకుతూ...

ఉగాది వచ్చినప్పుడల్లా
ఏదో నవ్యత్వం వస్తుందని
శుష్కించిన జీవితాల్లో పండువెన్నెలలు కురిపిస్తుందని
మోడువారిన బతుకుల్ని చిగురింప జేస్తుందని
కట్టుకునే "ఇసుకమేడల్ని" ప్రతిసారీ కూల్చివేయడమేగాక
కుల మతాల వైషమ్యాలని రెచ్చగొట్టి
అనేక నిండు ప్రాణాల్ని ఆహుతి చేస్తోంది।

ఇది ఉగాదికాదు।। ఇది కొత్త సంవత్సరంకాదు।। ఇది
వసంతరుతువనే బురఖా వేసుకు వస్తున్న కారుచీకటి।

'గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం బాగుండక పోతుందా'
అనే పుండాకోర్ ఆశలని చూపిస్తూ... మనలోని
ఉద్రేకాన్ని, చైతన్యాన్ని చంపే 'బ్రహ్మరాక్షసి' ఇది।
ఈసారి కాళ్ళనికాదు దీని కంఠాన్ని తొలగించాలి।।

పారితోషకాలకు, బిరుదులకు, సన్మానాలకు
తమ వ్యక్తిత్వాలని అమ్ముకునే వాజమ్మలు
కళ్ళనిండా కుళ్ళు నింపుకున్న అభ్యుదయ వాదులు
'మార్పు' అంటే భయపడే అభివృద్ధి నిరోధకులు
మనుషుల్ని విడిచి — వారి జీవితాల్ని మరచి
చెట్లు చేమల్నిచూస్తూ ఆడుతున్నారు— పాడుతున్నారు
"ఉగాదిపండుగ వచ్చింది ఊరికి అందం తెచ్చిందీ" అంటూ
కప్పగంతులు గెంతు తున్నారు।

ముండ కవులంతాకూడి సమ్మేళనాలు జరుపుతే
ఆ రొచ్చును ఆకాశవాణి దేశమంతా ఎగజిమ్ముతోంది।।

వీళ్ళు
వేపపూలని- మామిడి చిగుళ్ళని పట్టించుకుంటారేగాని
తరతరాలుగా దోపిడీకి గురికాబడుతున్న
రైతులను, కార్మికులను కన్నెత్తి చూడరు!
ఆకురాలిన చెట్లు ప్రతిఏడూ చిగురిస్తున్నాయి- కాని
అధమ తరగతి బతుకులు ఒక్కసారైనా
చిగురించడం లేదని గమనించరు!!

ఉగాది ఏదో మార్పు తెస్తుందనుకోడం భ్రమ!
బ్రిటిష్‌కాలంలోనూ వచ్చాయి ఉగాదులు
నైజాం కాలంలోనూ వచ్చాయి! స్వాతంత్ర్యం వచ్చిన
పాతికేళ్ళనుండీ ఈ ఉగాది ప్రతి ఏడూ వస్తునేఉంది
కాని— సంవత్సరం సంవత్సరానికీ
నిరుద్యోగుల్ని— ఆకలి చావుల్ని— పోలీస్ కాల్పుల్ని—
ప్రాంతీయ తత్వాన్ని— మతోన్మాదాన్ని— పెంచుతోందేకాని
మానవతా వాదాన్ని - సమతాభావాన్ని ఏ ఉగాది
సృష్టించడమేలేదు.

ఈ ఉగాదేకాదు ప్రతీ పండగా
మన మూఢనమ్మకాలకు ప్రతీక!
మన బలహీనతలకు, అజ్ఞానానికి ప్రతిబింబం!!
పండగ పండగ వెనక ఓ పనికిమాలిన కథ
ఆరాధనలు, నైవేద్యాలు, పూజలు పునస్కారాలు అన్నీ దండగ!!!

ఇన్ని పండుగలు... ఇన్ని కథలు...
మన్ని చవటలుగా మార్చేందుకే!
మనలో భయాన్ని, పిరికితనాన్ని, అవివేకాన్ని చొప్పించి
మనల్ని సదా దద్దమ్మలుగా ఉంచేందుకే!
అందుకే వీటిని బహిష్కరించాలి! చావగొట్టాలి!!
వీటిలోని మూఢత్వాన్ని ఎత్తిచూపాలి! వీటిని చితగ్గొట్టాలి!!
రాత్రింతా సినిమాల్లో హీరో—హీరోయిన్ల రోమాన్స్‌ని,
కౌగిలింతల్ని, అంగవిన్యాసాల్ని చూసి

'శివరాత్రి జాగరణ' ఉన్నాం— ఏదో పుణ్యం వస్తుందని
భ్రమించే మూర్ఖులకు బుద్ధి చెప్పాలి!

పాతపురాణాన్ని నమ్మి 'వినాయక చవితి' నాడు
మానవులా పాదం మోపిన చంద్రున్ని చూసేందుకు
భయపడి తలవంచుకు తిరిగే చవటల
వీపు తట్టి యదార్థాన్ని విప్పిచూపాలి !!

ఈ ఉగాది మనకు నిజమైన ఉగాది కాదని
దేశంలో— దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం, దోపిడీ
పోలీసు కాల్పులు లేకుండా అందరూ సామరస్యంతో
సమానత్వంతో జీవించేరోజే నిజమైన ఉగాదనీ...
దేశంలో ఇంకా చావవలసిన 'నరకాసురులు',
'రావణాసురులు' అసంఖ్యాకంగా ఉన్నారనీ
వాళ్ళందరూ చచ్చినరోజే మనకు నిజమైన దీపావళనీ
చాటాలి !!

ప్రతి ఒక్కరినీ మేల్కొల్పి, మానవులనుగా తీర్చిదిద్ది
సమతాభావం వెల్లివిరిసే సామ్యవాద
సమాజ నిర్మాణానికి పూనుకునే వీరులుగా
కార్యశూరులుగా, యోధానయోధులుగా మార్చాలి !!

ఈ పండగ హిందువులకు— ఆ పండగ ముస్లింలకు
మరో పండగ క్రైస్తవులకు అనే బేధభావం లేకుండా
మనం అందరం ఆరోజే ఆనందోత్సవాలతో
'కొత్తపండగ' జరుపుకుందాం!

లాల్ సలామ్

సుబ్బారావు పాణిగ్రాహి బుర్రకథ

ఎ. యల్. చిత్రలేఖ

మొదటివాడు: తమ్ముడూ మనం వేదిక మీదికొచ్చాం. ప్రజల ముందు నిలబడ్డాం. ఏమీ చెప్పకుండా వేషాలతో తిరిగివెడితె ఊరుకోరు. ఏదన్నా చెప్పాలి.

రెండవవాడు: ఏదైనా అంటె! ఇంత చెత్త వీళ్ళమీద పోసిపోవడం మాత్రం మన బాధ్యత కాదు. ఇప్పుడు సినిమాలలో నాటకాలలో బుర్రకథలలో అన్నీ దంపుడు పాతచింతకాయ పచ్చడి కథలు నింపి జనాన్ని అంధకారంలోకి తోస్తున్నారు. ఈ లఫంగి ప్రభుత్వం కొమ్ముకాస్తున్నారు. మనం మాత్రం ఆ పని చెయ్యొద్దు. అదీకాక....

మొ: బాబ్బాబు! అపాపు. నాకు ఏడుమంది పిల్లలు. అందులో ఐదుగురు ఆడవాళ్ళు. నన్నిలా బతకనియ్యి. నాటకాలను తిడితే భజన సమాజం వాళ్ళు ఊరుకోరు. ప్రభుత్వాన్ని తిడితె పోలీసులు ఊరుకోరు. నేనింటికి పోతా. బుర్రకథో గిర్రకథో నువ్వే చెప్పుకో....

రెం: ఒరేయ్! వేదిక మీదికి వచ్చాక ఇంకెక్కడి కెళతావ్! ఇది ప్రజా కళాకారుల రణరంగం. పోరు సల్పాల్సిందే. విజయం సాధించాల్సిందే ...

మొ: అపు! నాకు గుండె కొట్టుకోవడంలేదు. మెదడు పనిచేయడంలేదు.

రెం: ఇంతమాత్రానికే అలా బెంబేలుపడిపోతే ఎలా? ఒరేయ్ అటు చూడు.

మొ: (ఆకాశంవేపు చూసి) ఏమీలేదే!

రెం: ఇటు చూడు

మొ: (నేలకేసిచూసి) ఏమీలేదే! ఆఁ! ఉందుంది. నేలంతా ఎర్రగావుంది.

రెం: అదేరా! ఈ గడ్డంతా రక్తంతో తడిసింది. ఎంతోమంది వీరుల రక్తంతో భారత భూమి ఇంకింది. త్యాగాలతో మెరిసిపోతుంది. ఆకాశంలో అరుణ తారలుగా అమరవీరులు మెరుస్తున్నారు.

మొ: అవున్రోయ్! ఇప్పుడర్థమౌతంది.

రెం: ఇంత పిరికివాడవైన నీకే రెండు ముక్కలు చెప్పగానే రక్తం ఉప్పొంగింది. ఆ మహామహుల, త్యాగధనుల కథ చెప్పి మన ప్రజలను ఉర్రూతలూగిద్దాం.

మొ: సరేగాని ఇంతకూ కథ చెప్పేవాడేడి?

రెం: ఔను ఏడి?

మొ: అరెరె! లోపల చాయ్ తాగుతున్నాడు పిలుచుకొస్తానుండు (వెళ్ళిపోతాడు)
(ఇద్దరు ప్రవేశం)

కథ: ఆలస్యమైంది క్షమించాలి, అందుకొండ్రి బుర్రలు (బుర్రలు మోగుతాయ్)

కథ: జయము జయము మన విప్లవాలకు   జయము దిగ్విజయము
మానవాళికి ॥జయమురా॥
ప్రపంచ జనతకు ,,
రక్త చరిత్రకు ,,
వీర పురుషులకు ,,
రక్త చరిత్రకు వీరపురుషులకు   జయము దిగ్విజయము

భారతదేశ విప్లవాలకు ,,
తెలంగాణ వీరోచిత పోరుకు ,,
బెంగాలు తేభాగ పోరుకు ,,
నక్సల్‌బరి రైతాంగ పోరుకు ,,
శ్రీకాకుళ గిరిజన పోరుకు ,,
ములుగుచుట్టు గుట్టుగున్న పోరుకు ,,
విప్లవాలకు, విప్లనేతలకు   జ॥ వి॥ జ॥

చారు బాబుకు ॥జయమురా॥
సరోజ్ దత్తుకు ,,
సత్యం సారుకు ,,
కైలాసమన్నకు ,,
సత్యంసారుకు కైలాసమన్నకు   ॥జయము దిగ్విజయము॥

మల్లికార్జునికి ,,   ॥జ వి॥ జ॥
భాస్కరరావుకు ,,
నిర్మలమ్మకు ,,

కృష్ణమూర్తికి ..
నిర్మలమ్మకు కృష్ణమూర్తికి ..

సరస్వతులకు ..
అంకమ్మలకు ..
విశ్మకర్మార్కుర్కు ..
బాబూలాల్‌కు ..
విశ్వకర్మార్కుర్కు బాబులాల్‌కు .. జ॥వి॥జ॥

వర్గీసుకు ॥జయమురా॥
దయాసింగుకు ..
కోరన్నకే ..
మంగన్నకే ..
కోరన్న మంగన్నలకు ..

చిన్నారావుకు ..
ఉమారావుకు ..
గోకుల సన్యాసికి ..
రమేష్ చంద్రికు ..
గోకుల సన్యాసికి రమేష్‌చంద్రికు ..

భీమన్నకే ॥జయమురా॥
తామాడ గణపతికి ..
రెంజిమన్నకు ..
నరసింహరావుకు ..
రెంజిమన్నకు నరసింహరావుకు ॥జయము దిగ్విజయము॥
జ॥వి॥జ॥

బత్తుల వెంకటేశ్వరరావుకు ..
సుబ్బారావు పాణిగ్రాహికి ..

మొ: యెన్ని! యెన్ని పేర్లు చెప్పుతున్నావ్. వీళ్ళంతా ఎవళ్ళోకూడా నువ్వే చెప్పు.

రెం: ఒరేయ్ తమ్ముడు: 1967 లో నక్సల్‌బరిలో ప్రారంభమై దేశమంతట జ్వాలల్లా వ్యాపించి దోపిడి దొంగలను, భూస్వాములను బుగ్గి కరిపించి వీరవిహారం చేసిన

విప్లవవీరులు. వీళ్ళు ఇక మనకులేరు. కాని మన అణువణువుల్లో ఉండి మనల్ని నడిపిస్తున్నారు. భారతదేశ మణిపూసలు వీళ్ళంతా.

కథ: ఔను తమ్ముడూ! వీళ్ళంతా విప్లవవీరులు. ఎరుపు వీరులు. భారత రత్నాలు. జాతి పుత్రులు. ప్రభుత్వ తప్పుడు వెధవల చేతుల్లోబడి చంపబడ్డారు. వాళ్ళల్లో ఆఖర్న చెప్పిన విప్లవకళాకారుడు, విప్లవకారుడూ ఐన సుబ్బారావు పాణిగ్రాహిని నేడు తలుచుకుందాం. ఆయన కథ చెబుతున్నాను వినండి.

రెం: భలే భలే! పాణిగ్రాహి కథ యువకులను కష్టజీవులను కదిపివేస్తుంది. ఏది చెప్పు—

మొ: అయితే వినండయ్యా ప్రాణంలో ప్రాణమైన మన పాణిగ్రాహి కథ.

కథ: తూరుపుదిక్కున కొండల్లోన శ్రీకాకుళముంది ॥భళాభళి॥
॥వినరా భారత వీరసోదరా వీరగాధనేడు॥
తూరుపు ఎరుపున దేశంలోన ఎక్కడచూసినా ,,
ఎర్రగడ్డపై సుబ్బారావను బిడ్డపుట్టినాడా ,,
పేదల ఇంట్లో పాణిగ్రాహి జన్మమెత్తినాడా ,,
ధరణిపైని గడ్డిపోచలే లేచే చూసాయా ,,
బీదల బాధల నన్నింటిని చవిచూసాడండీ ,,
పాణిగ్రాహికి అన్నదమ్ములు నలుగురు ఉన్నారు ,,
పాణిగ్రాహికి అక్కచెళ్ళెళ్ళు నలుగురు ఉన్నారు ,,
నాటువైద్యము చేసుకుంటూ తండ్రి గడిపినాడా ,,
డబ్బుచాలక పస్తులుఎన్నో దాపురించినాయా ,,

వ॥ ఈ పరిస్థితుల్లో పుట్టిన పాణిగ్రాహి ఎలా పెరుగుతున్నాడయ్యా అంటే—

పుట్టిపెరిగిన ఊరిలో ॥సై॥
సోంపేట గ్రామంబులో ,,
పాణిగ్రాహి బడికెళ్ళెరా ,,
చదువులు అభ్యసించెరా ,,
వీరుల ధీరుల చరితలు ,,
జుణ్ణంగా చదివేసెరా ,,
పేదల దోస్తి కలిపెను ,,
పెద్ద చిన్న లేవానెను ,,

పిల్లలనంత కలిపెను ,,
దష్టచేష్టలను కెలికెను ,,
మంచిని మంచిగ నిలపాడా
మంచివానిగా పెరిగాడా భ॥ సై॥ మే॥ దా॥

వ॥ అంతేకాక పాణిగ్రాహికి చిన్నప్పట్నుండీ రాజకీయ చైతన్యం ఉన్నది అందుకే అంత చిన్నవయసులోనే తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నాడు.

పిట్టచిన్నదే అయ్యినా ॥సై॥
గూత మాత్రము పెద్దది ,,
వయసు చిన్నదే అయ్యినా ,,
మనసు మాత్రము పెద్దది ,,
ఆలోచించి తమ్ముడు ,,
అడుగుపెట్టెరా పోరులో ,,
తెలంగాణ రైతాంగము ,,
భగ్గున మండుతు ఉండెరా ,,
దుష్టశక్తుల నన్నిటి ,,
దహించి వేస్తుండెరా ,,
జాగీర్దార్ల నంతను ,,
జాగులేక నరికేసెరా ,,
భూస్వాములను పట్టిరి ,,
బడబడ రక్తం తాగిరి ,,
కత్తులు కటార్లు ఎత్తిరి ,,
బాంబులు బర్మార్లు పట్టిరి ,,
నాజీ నైజాం పాలనం ,,
నడ్డి విరుగ పడదోసిరి ,,
దొడ్డ వీరులనిపించిరి ,,
రైతుకూలీలె కలిశారా
గ్రామాల విముక్తి చేశారా భ॥ సై॥ మే॥ దా॥

వ॥ భారతదేశంలో కనీ వినీ ఎరుగని ఈ మహత్తర శ్రామిక విముక్తి పోరాటం తెలంగాణాలో ప్రారంభమై తెలుగువాళ్ళందర్నీ కదిలించివేసింది. అంధ్రి సోదరులూ కూడా దీనిలో పాల్గొని అగ్గిలా మండారు. పోరాటాన్ని విస్తరింప

చేసారు. ఈ తరుణంలోనే ఆంగ్లేయులనుండి గాంధీ నాయకత్వాన కాంగ్రెస్ రాజకీయ అధికారం చేతిలోకి తీసుకొని అంతవరకు తాము ప్రజలకొరకే పాటు పడుతాము అన్న దగుల్బాజీ అబద్ధం నిజమేనని తొందర్లోనే నిరూపించు తున్నారు.

తందానో... తందానో తానె తందానానా...

ఎందరి రక్తమో ఏరులుపారిన విప్లవ సమరంలో .. ..
కాంగ్రేసు గద్దలు శాంతంచు పాలన తన్నుకపోయారా .. ..
గోచిగుడ్డ దొంగ సన్యాసి గాంధి కపట నాటకమండీ .. ..
నెహ్రూ పటేళ్ళు స్థావరాల కొరకు వొంతలు పాడారా .. ..
పేదల గుండెలు దోచి బండలను పేర్చినారు బాబూ .. ..
పేదల కళ్ళల్లొ కారాలు జల్లి గద్దె లెక్కినారా .. ..
బీదవాళ్ళకు స్వర్గం లాంటి రామరాజ్యమని .. ..
తాతా దాల్మియ జాతి వారలు రాజ్యమేలినారా .. ..

వ॥ అధికారం మార్పిడికి స్వాతంత్ర్యం అనే బూటకపు పేరుతగిలించి రైతు కూలీలు లేవదీసిన విప్లవాన్ని, నిజమైన సామ్యవాద స్వాతంత్ర కలలు కంటున్న తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ఎలా అణుస్తున్నరయ్యా అంటే-

కూలినాలీల పేరుజెప్పుకొని వొచ్చిన నెవురయ్యా ॥భళాభళి॥
వినరా భారత వీరాధీరా విజయగాధ నేడు
ప్రజలకొరకె తమ ప్రాణాలనుచు పటేలుగారండీ .. ..
దేశపెద్దకై మురికిగద్దలై నృత్యం చేసారా .. ..
తెలంగాణ పోరుకు వారి గుండె లదిరినాయి .. ..
విముక్తి ఐన మూడు వేల్గూర్లకు కన్నుచెదిరినాదా .. ..
విప్లవ వీరుల రైతులమీదికి సైన్యం పంపారా .. ..
పాణిగ్రాహి చిన్నవాడైన ధైర్యం వీడకను .. ..
తెగించి తెగువతొ పోరులొ నాతడు ఒక్కడైనాడా .. ..
హిట్లర్ను నాజీల మించిన సైన్యాల్ తెలుగుగడ్డపైనా .. ..
కాలుబెట్టి విప్లవ కారుల కాల్చసాగినాయా .. ..

వ॥ స్త్రీల మానభంగాలు విప్లవకారులను కాల్చడాలు ఇలా అనేకానేక విధానాలు అనుసరించి ప్రజాపోరాటాన్ని అణచజూస్తున్న కాలంలో ఈ పోరాటానికి నాయ

కత్వం వహిస్తున్న భూస్వామ్య, బూర్జువావర్గ ప్రతినిధులు తమ స్వప్రయోజనాలకు రివిజనిస్టులై పోరాటాన్ని బలిపెట్టారు. అందుకే పాణిగ్రాహి మొదటినుండి రివిజనిస్టులపై దాడి కొనసాగిస్తూవచ్చాడు తాను బ్రతికినంతకాలం రివిజనిస్టులతో రాజీలేని పోరాటం సాగించినాడు. స్కూలురోజుల్లో పేదల పక్షంనుండి అక్రమాలను ఏవిధంగా ఎదుర్కొంటున్నాడయ్యా-

మొ: ఏవిధంగా ఎదుర్కొన్నాడు

విద్యార్థులను కూడగట్టుకొని సంఘం పెట్టాడా ॥భళా భళి॥
వినరా భారత వీరాధీరా విజయగాథ నేడు
అన్యాయాలను అక్రమాలను అధిగమించినాడా ,, ,,
ఉపాధ్యాయులకే పెద్దమనుషులకే బుద్ధిజెప్పినాడా ,, ,,
చిన్నల పెద్దల మెప్పులు బడిసి తాను నడిచినాడా ,, ,,
కులమత బేధాలన్నింటిని కాలదన్నినాడా ,, ,,
కులం అన్న హెడ్‌మాస్టర్ మీదకు ఎదుర్ తిరిగినాడా ,, ,,

వ॥ ఈ విధంగా సుబ్బారావు పాణిగ్రాహి అన్యాయాలను అక్రమాలను ఎదుర్కొంటూ చైతన్యంగా వృద్ధిచెందాడు. యస్. యస్. యల్. సి. వరకు చదివి చదువుకు స్వస్తి చెప్పాడు. మరి ఆ తర్వాత ఏంచేస్తున్నాడయ్యా అంటే-

బతుకు దెరువు కోసం ॥భళి భళి॥
సోంపేట వొదిలి పెట్టి ,,
బొడ్డపాడూ ఊరికొచ్చె ,,
మాతృభాష ఒడియ ఐనా ,,
బెంగాళీ అస్సామి నేర్చి ,,
హింది ఇంగ్లీషులు నేర్చి ,,
పాటలు పదాల నన్నిటిని ,,
తెలుగునె రాయ సాగాడా ॥భ॥ సై ॥ మె॥ దా॥

వ॥ ఇక పేదప్రజలతో కలిసి ఎలా మెసులుతున్నాడయ్యా-

వూరి వాళ్ళను కలిసెరా ॥ సై ॥
కర్షకులను కలిసెరా ,,
కూలి నాలినే కలిసెరా ,,

ఆత్మబంధువై వెలిసెరా ,,
యువజన సంఘమె పెట్టెరా ,,
కష్టజీవుల కందరికి ,,
రాత్రి చదువులు చెప్పాడా ॥ధ॥సై॥మె॥దా॥

దోపిడిదారుల గుట్టును తాను బట్టబయలుచేసే ॥భళా భళి॥
వినరా భారత వీరాధీరా విజయగాథ నేడు
దేవుడు లేనేలేడని బాబు చెప్పసాగినాడా ,, ,,
ఖర్మ గిర్మ లేనేలేవు అంతా కల్లనియె ,, ,,
తెలంగాణ రైతాంగ పోరుగాధను తెలిపాడా ,, ,,
బెంగాలు కొల్దార్లపోరు కన్న కలలు చెప్పె ,, ,,
విప్లవ కథలు వీరగాథలు నూరిపోసినాడా ,, ,,

వ॥ ఈ విధంగా సుబ్బారావు పాణిగ్రాహి ప్రజలను సమీకరించి వాళ్ళకు దోపిడి జరుగుతున్నతీరు దోపిడిదారుల గుట్టు బట్టబయలు చేసాడు. గతంలో జరిగిన భారత విముక్తి పోరాట కథలుకూడా వినిపించాడు. తిరుగుబాటు తత్వం నూరిపోసాడు. ప్రజల మనిషయ్యాడు. ఇంకా రాజకీయ పాఠాలెలా నేర్పుతున్నాడయ్యా అంటే—

మార్క్సు చెప్పిన శాస్త్రం చదివెను ॥తందాన తందాన తందన॥
లెనిన్ స్టాలిన్ల గాథలు చదివెను ,,
మావో బోధలు మననము చేసెను ,,
సమ సమాజ నిర్మాణ కలలను ,,
నిజం చేయుటకు ప్రతిజ్ఞ బూనెను తందానో తందానో ఓ
తానె తందనానా

రైతులకు రాజకీయాల్ నేర్పెను ॥తందాన తందాన తందన॥
దివుట గుండెలను చేరదీసెను ,, ,,
నగ్జల్‌బరి మార్గాన్ని తెలిపెను ,, ,,
కర్తవ్యాన్ని కళ్ళకు చూపెను ,, ,,
రాజీలేక బ్రతకని చాటెను ,, ,,
మహోదయమునకు మార్గము చూపి తాందానో తందానా ఓ
తానె తందనానా.

ర॥ పాణిగ్రాహి ప్రజాకవి. కళాకారుడు. అందుకే శత్రువుతో పోరాడడానికి మనకు సైనికదళంతోపాటు సాంస్కృతికదళంకూడా ఉండాలన్న వగ్నసత్యాన్ని గుర్తించాడు. అందుకే—

నాటకాలు ఎన్నో ఆడెరా ॥సై॥
పాటలు ఎన్నో పాడెరా "
కామ్రేడ్స్‌ల గుండెలో "
పాటలెన్నియో నింపెరా "
దోపిడి పాలన సంతను "
కథల ద్వారనే చెప్పెను "
డబ్బునోళ్ళ గుండెలు "
ఎంత పిరికివో తెలిపెను "
బూర్జువాల బుద్ధులను "
బట్టబయలు చేసేసెరా ॥భ॥సై॥మె॥దా॥

వ॥ ఈరకంగా పాటలద్వారా కథలద్వారా నాటకాలద్వారా పాణిగ్రాహి ప్రజలగుండెల్లోకి చొచ్చుకొని పోయేలా ఆశయాలను చొప్పించాడు. ఇక ప్రజా కళాకారుడైన తామాడ చిన్నారావనే బాలునితో తన తమ్ముడు హేమేంద్ర పాణిగ్రాహిలతో కలిపి జముకుల కథ ఎలా చెబుతున్నారయ్యా—

పాణిగ్రాహి ఒక పక్కుండి రాజకీయాల్ చెప్ప ॥భళాభళి॥
వినరా భారత వీరాధీర విజయగాథ నేడు
హేమేంద్రదేమో మరియొకపక్క వంత పాడుతుంటే "
చిన్నారావు మధ్యలోన ఆడివేషమేసి "
గిరిజనుల కథను జముకల కథగా చెప్పసాగినారు "
పోరులోపల చిన్నారావు అగ్గయి మండాడా "
దోపిడిమూకలు చిన్నారావుని పట్టుక కాల్చాయా "
కృష్ణమూర్తితో చిన్నాకూడ అమరుడయ్యినాడా "
ప్రజల కొరకు పుట్టిన బాబు ప్రజల కొరకె చచ్చె "

వ॥ పాణిగ్రాహి అనుచరుడైన ప్రజా కళాకారుడైన 14 సం॥ బాలుడు తామాడ చిన్నారావును ఈ కసాయి ప్రభుత్వం కాల్చి చంపింది. ఈ సంఘటన తరు

వాత పాణిగ్రాహి ఆగ్రిహావేశపూరితుడైనాడు. ఇదే పరిస్థితుల్లో పాణిగ్రాహి అస్వస్తతగా ఉన్నాడు. ఐనా లెక్కచేయక పోరాటంలో దూకాడు.

సోంపేటలో కాలిడి ॥భళిభళి॥
సత్యాన్నే కలుసుకొని ”
గణపతన్ననె తలుసుకొని ”
గన్నును చేత బట్టాడా ”
విప్లవ మూర్తయి లేచాడా ॥భ॥సై॥మె॥దా॥

వ॥ తల్లి పెళ్ళాం పిల్లలు, అన్నదమ్ములు, అక్కచెళ్ళండ్ల విడిచి పోరాటాన్ని ప్రేమించి పర్వసన్నిద్ధుడైనాడు. ఈ తరుణంలో డా॥ భాస్కరరావు, తామాడ గణపతుల వీరమరణం కారణంగా సుబ్బారావు పాణిగ్రాహి సోంపేట ఏరియా కమిటీకి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. ఇక పాణిగ్రాహికి పార్టీనుండి అభినం దనల పరంపర ఎలా కురుస్తుందయ్యా అంటే—

కలకత్తానుండి చారుమొజుందారు ॥తందానో తానెతందన॥
బెంగాలు ప్రజల అభినందనలు పంపె ”
బీహారు నుండి బెబ్బులులంతా ”
భీతిలేక పోరాడని తెలిపిరి ”
కేరళ నుండి అరివీర భయంకరులు ”
దోపిడి కోరల నరకని చెప్పిరి ”
తెలంగాణ వీర యోధులందరు ”
పాణిగ్రాహిని యెంతో మెచ్చిరి “

వ॥ పాణిగ్రాహికి ప్రజల మద్దతు ఎలా లభిస్తుందయ్యా అంటే—

శ్రీకాకుళ జిల్లాయందు ॥భళీభళి॥
సోంపేట ఆయువుపట్టు ”
శ్రీకాకుళ జిల్లాయందు ”
కొండజాతి గుండె మెండు ”
ధైర్యమున్న కొండజాతి ”
గుండెలు ముందుంచి పోరు ”
వీరులైన కొండ ప్రజలు ”

అలుపు ఎరుగక పోరు ఘనులు ,,
పాణిగ్రాహికి ప్రజల శక్తి ,,
కొండంత అండయై నిలిచె ,,
పాణిగ్రాహి గుండె బలము ,,
వెయ్యి వెలుగులు వెలుగసాగె ,,
ప్రజలంత పనిగట్టుకొని ,,
రాత్రి పగలను తేడానే మరిచి ,,
ఆడ మగ బేధాలే విడిచి ,,
ఒక్క ఉమ్మడిగ తాము కలిసి ,,
శతృవుతో పోరాడ నిలిచార
గవిని కుక్కల నడుమ సాగార ॥ఓ॥గి॥లే॥రా॥

వ॥ పాణిగ్రాహి ధైర్యంతో కొండంత ప్రజల అండతో శతృవును ఎదుర్కోవడానికి ఎలా సన్నాహాలు చేస్తున్నాడయ్యా అంటే—

వూరూ వూరూ తిరుగుతూ ॥సై॥
పల్లె పల్లె కదులుతూ ,,
ప్రజల తలలలో నాలుకై ,,
తానే మెదుల సాగెరా ,,
పల్లె పల్లె పోరును ,,
విస్తరింప పని చేసెరా ,,
బీదల బాధల నన్నిటి ,,
పూసగుచ్చినట్టు తెలిపెరా ,,
ఆ బాధల కారకు లెవ్వరో ,,
వేలుపెట్టి చూపించెరా ,,
వారి నతమార్చిన తమ్ముడా
మన బాధలు తప్పును అన్నాడా ॥భ॥సై॥మే॥దా॥

వ॥ ఇక పంటలను కోసుకొమ్మని స్వాధీనం చేసుకొమ్మని రైతులకు గిరిజనులకు ఎలా పిలుపు ఇస్తున్నాడయ్యా అంటే—

ఓ రైతు సోదరా గిరిజన వీరుడా- లేవోయి లేచిరావోయి
నాగళ్ళతో చాళ్ళు దున్ని ॥భళిభళి॥

మోటగొట్టి నీరు బెట్టి ,,
మడికట్లు గట్టిగా కట్టి ,,
బురదలోనా నారుబోసి ,,
నారు నంతయు కట్ట గట్టాము
ఒక్కొక్క మొక్కనే నాటాము ॥ఓ॥గి॥లే॥రా॥
ఇన్నాళ్ళ కష్టము మనకు ॥భళీభళీ॥
దక్కకుండా చేసువాడు ,,
కోసకబోతుంటు మనము ,,
ఒక్కదాటిగ బాగ నిలిచి ,,
ఉవ్వెత్తు కెరటమై లేచి ,,
పంటలను స్వాధీన పరుచుకో ,,
మన పోరును గుండెల్లో విలుపుకో ॥ఓ॥గి॥లే॥రా॥

వ॥ ఇక పోరాటం ఎలా నడుస్తుందయ్యా–

సోంపేట ఏరియలోన ॥తందానో తానెతందానా॥
ఉద్దానం అను గ్రామము ఉంది ,,
ఉద్దానం నుండి పోరు ,,
బుడారి శింగి జరడ వరకు ,,
పోరాటమే సాగుతుండెనా ,,
రైతాంగ వీరులు లేచి వచ్చిరి ,,
గెరిల్లాలుగ ప్రజలు నిలిచిరి ,,
సాయుధులై ముందర నడిచిరి ,,

వ॥ జనవాహిని కదిలి ఎలా వెడుతుందయ్యా అంటే–

వెనుక సాయుధ దండురా ॥సై॥
ముందర పాణిగ్రాహిరా ,,
ముందు ముందుకే దూకుతూ ,,
మార్గదర్శియై నిలిచెరా ,,
మందిని దోచిన వారిని ,,
కరకర కరకర కోసాడా
కాకుల గద్దల కేసాడా ॥భ॥త॥సై॥మే॥దా॥

వ॥ రాజకీయాలు జీవితం రెండూ వేరు వేరుకావని తన జీవితాన్ని పోరులోపణంగా పెట్టి హీరోచితంగా యిలా పోరాడుతుంటే ఒకవేపు అతని కుటుంబం యెలా అవస్తలు పడుతుందయ్యా అంటే—

కొలువులు గిలువులు లేక సోదరుల్ కూటికి మాడారా
॥తందానో... అయ్యయ్యో... తందానో తానె తందనానా॥
పిల్లలు పెద్దలు మలమల మాడి బేజారెత్తారా ..
ఆలు పిల్లలు అక్క చెల్లెండ్లు అల్లాడి పోయారా ..
కష్టాల నష్టాల నెన్నింటినో కలిసి భరించారా ..
జల జల పారే కన్నీళ్ళకే కలిగే బాధండీ ..
కన్నీళ్ళే కట్నాలుగ మిగిలే పేదప్రజల బాధ ..

వ॥ ఒకపక్క తన కుటుంబం ఎన్ని అవస్తలుపడ్డా ఎన్ని బాధలకులోనైనా అదురు చెందకుండా, దేశంలో కొన్ని కోట్ల కుటుంబాలను ఈబాధలనుండి పీడననుండి విముక్తి చేయడానికి పూనుకున్నాడు. ఇంకా పాణిగ్రాహి ఎలా పురోగమిస్తున్నాడయ్యా అంటే—

గన్ను ఒక్కచేత బట్టి
ఎర్రజెండను లేపనెత్తి
పండ్లు పటపట కొరికినాడయ్యా
పాణిగ్రాహి
కదనమందు కురికి నాడయ్యా
॥పాణిగ్రాహి కదనమందు కురికినాడయ్యా॥

బిక్కమొఖమె వేసినారు
ప్రభువులూ పోలీసులూనూ
భీరువులవలె తొలిగినారండీ
నాసామిరంగా
పక్కదోవలు పట్టినారండీ
॥నాసామిరంగా పక్కదోవలు పట్టినారండీ॥

భూస్వాముల గుండెలు ॥నై॥
ధడధడమన సాగెరా ..
పోలీసులు పిరికిగా ..

పారిపోవు చుండిరా ..
వర్గశత్రువునె పట్టెను
వర్గ కసి చవి చూపెను ..
బందూకుకు గురిచేసెను ..
బారులుతీర్చి పోరెను ..
దోపిడి దొంగల పట్టాడా
బయనట్లతో పొడిచాడా ॥భ॥సై॥మే॥దా॥

వ॥ పాణిగ్రాహి ఆదిపాదడమేగాక తన ఆశయానికి అనుగుణంగా జీవితాన్ని మలుచుకున్నాడు. చేత గన్ను పట్టుకొని పోరాడాడు. పోరాటం నడిపించాడు.

మాందసా గ్రామంబునా ॥సై॥
రైతు వీరులు లేచిరి ..
గెరిల్లాలతో కలిసిరి ..
ప్రజలకు ద్రోహం చేసినా ..
పోలీసు క్యాపుతో బతికినా ..
భూస్వామినే పట్టిరి ..
పడదోసి నరికేసిరా ..
తల గుమ్మాని కేలాదేసిరా ..
ప్రజలను దోచిన సొమ్మును ..
దొంగ ప్రాంసరి నోట్లను ..
ప్రజలకు అప్పగించిరా ..
ప్రజల రక్తము తాగినా ..
వాని రక్తముతో రైతులు ..
వొడియా హిందీ తెలుగులో ..
కృష్ణమూర్తి జిందాబాదని ..
మాహో జిందాబాదని ..
విప్లవమా వర్ధిల్లుమాని
గోడలపైననె వ్రాసారా ॥భ॥సై॥మే॥దా॥

వ॥ ఈ విధంగా మహోద్రుతంగా గిరిజన సాయుధపోరాటం విజయవంతమైతుం డగా వర్గ శత్రువులను నిర్మూలించుటకు వేలాది ప్రజానీకం పాల్గొన్నది. ఈ పోరాటాన్ని పాణిగ్రాహి ఇంకా ముందుకు ఎలా తీసుకపోతున్నాడయ్యాఅంటే

రైతన్న రారా
పరుగున నీవు
కూలన్న రారా
రైతన్న రార
కూలన్న రార
కూడుబెట్టె మాయన్నరో ॥రై॥ప॥కూ॥

ఊర్లో గూడు పెరికివేసిన
అప్పులు ఇచ్చి కుప్పలు మేసిన
కూటికి గుడ్డకు మాడ్చి చంపిన
,, ,, ,,
,, ,, ,,
భూస్వాములవి పీకలు కోసి
రక్తం తీసి నువు రంగులాడరా ॥రై॥ప॥కూ॥

విప్లవ కారుల కాల్చివేసినా
ప్రజలను ఎన్నో హింసలు పెట్టిన
అక్కల చెల్లెల చెరిచివేసినా
,, ,,
,, ,,
పోలీసుల తల లడ్డం నరికి
పాతరేసి నువు పోరాడరా ॥రై॥ప॥కూ॥

వ॥ ఈ రకంగా శ్రీకాకుళంలో సుబ్బారావు పాణిగ్రాహి వీరవిహారం చేసాడు. ప్రజలకొరకే బతుకుతూ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసాడు. కసాయి ప్రభువులు పోలీసులు భూస్వాములు పాణిగ్రాహి పేరు వింటే హడలిపోసాగారు. అందుకే పాణిగ్రాహిమీద అతని దళంమీద కన్నువేసి ఉంచారు.

రెం: ఈ దోపిడి ప్రభుత్వం ఎప్పుడూ భూస్వాములకు, వారి తొత్తులకే కొమ్ము కాస్తుంది. అందుకే పాణిగ్రాహి వారికంట్లో నులకగా తయారయ్యాడన్నమాట–

వ॥ ఔను! ముమ్మాటికీ అంతే. అందుకే ఈ ప్రభుత్వం ఎంగిలిబొక్కలు కొరికే పోలీసుమూక అకస్మాత్తుగా ఒకనాటి వేకువజామున తన దళంతో ఉన్న పాణిగ్రాహిని పట్టుకుంది–

పేదలమనిషి పాణిగ్రాహి పట్టుబడ్డాడా
॥తందానో...అయ్యయ్యో తందానానో తానెతందనానా॥
ముందు వెనుక వేలదండు చుట్టుముట్టినారా ..
కరుకు గుండెలు రాక్షస దండులు చుట్టూ ఉన్నాయి ..
ఒక్కదళానికి ఇంత సైన్యము కావల సొచ్చిందా ..
దోపిడి దొంగల రాజ్యంలోన కరుణ ఎక్కడండీ ..
పాణిగ్రాహిని ఎన్నో హింసలకు గురిచేసారండీ ..
లోకంలోని హింసలన్నిటిని అమలేచేశారా ..

వ॥ ఎన్నో హింసలుపెట్టి నానా చిత్రివధ చేసికూడా ప్రజాకవి పీడిత నాయకుడు సుబ్బారావు పాణిగ్రాహినుండి ఒక్క రహస్యంకూడా రాబట్టలేకపోయారు. ఇక లాభంలేదని పాణిగ్రాహిని రంగమొటియా అడవులకు తీసుకపోయారు. తీసు కెళ్ళి ఏంచేస్తున్నారయ్యా అంటే–

పాణిగ్రాహిని పట్టుకవెళ్ళి చెట్టుకు కట్టారా ॥భళాభళి॥
వినరా భారత వీరాధీరా విజయగాధనేడు
గన్నులు ఎత్తి గుండెలపైకి గురిచూసినారా

వ॥ ఇంతలో పాణిగ్రాహి ఇలా అంటున్నాడు–
నన్ను చంపిన క్షణం క్షణమే
కోట్లకొలది ప్రజలులేచి, విప్లవాలను లేవదీసి
భగ్గు భగ్గున మండుతారురా
మిమ్ములను
బుగ్గిపాలు చేస్తారురా

వ॥ ఈ మాటలు విన్నంతనే పాణిగ్రాహిని కాల్చివేసారు–
బడబడ రక్తం గుండెల్లోంచి కారసాగిందా
॥తందానో...అయ్యయ్యో...తందానో ఓ దేవనందనానా॥
రక్తం చిమ్ముతు చిమ్ముతు చిమ్ముతు పారసాగిందా ..
ప్రజల మనిషి పాణిగ్రాహి వేలాడ సాగినాడా ..
రాక్షసుల చేతిలో బాబూ ప్రాణాలొదిలాడా ..
పాణిగ్రాహి ప్రజల కొరకు అమరుడయ్యెనాడా ..
విప్లవాలకు ప్రజలశక్తికి అద్దం పట్టాడా ..
త్యాగాలకు వీరమరణాలకు చాలుపోసినాడు ..

పాట : లాల్ సలామ్ లాల్ సలామ్ లాల్ సలామ్
అమర వీరులార మీకు లాల్‌సలామ్

ప్రజల కొరకు పుట్టినారు
ప్రజల కొరకు గిట్టినారు
పోరునందు ప్రాణాలను
పణంగా పెట్టినారు ॥లాల్॥
దేశ దేశ శ్రామికులకు
మన దేశ పీడితులకు
హిమాలయ శిఖరాలుగ
ఆశయాల నిలిపినారు ॥లాల్॥
కొండల్లో కోనల్లో
బండలైన బతుకుల్లో
ఎర్రజెండ లెత్తినారు
బందూకులు నిలిపినారు ॥లాల్॥
హరిజనులకు గిరిజనులకు
తిరుగుబాటు నేర్పినారు
భూస్వాముల కుత్తుకల్లొ
కత్తులనే దింపినారు ॥లాల్॥
నగ్జల్‌బరిలో పుట్టి
శ్రీకాకుళాన పెరిగి
తెలంగాణ గ్రామాల్లో
నిప్పులుగా మారినారు ॥లాల్॥
ఉన్నోళ్ళను ఉరిమురిమి
దోపిడిపై పగబట్టి
పాలకులపై పడగలెత్తి
జీవితాన్ని గడిపినారు ॥లాల్॥
కూడులేని గుడ్డలేని
ఉండడాని కిల్లులేని
దౌర్భాగ్యుల గుండెల్లో
అగ్ని శిఖగ వెలిసినారు ॥లాల్॥

దోచుకునే రక్కసుల
దోపిడి కావలి కుక్కల
తరిమి తరిమి వొదిలినారు
పోరులోన వొరిగినారు ॥లాల్॥
అగ్గి అగ్గిగా మండి
భగ్గు భగ్గునా లేచి
విప్లవ శిఖరాగ్రాన
అమరులై నిలిచినారు ॥లాల్॥
తల్లి దండ్రులను విడిచి
ఆలు పిల్లలను వొదిలి
అహర్నిశం ఆశయాల
కంకితమై పోయినారు. ॥లాల్॥
అడవే ఒక ఇల్లయి
ఆకాశమె దుప్పటిగా
కనుపాపలె కాపేద్నాయి
ఆశయాల నడిపినారు ॥లాల్॥
నికృష్టపు నిర్భాగ్యపు
పేద ప్రజల బతుకుల్లో
అరుణ తారలై నిలిచి
ఆశలు చిగురించినారు ॥లాల్॥
దీర్ఘకాల పోరాటమె
ధ్యేయంగా పెట్టుకొని
విప్లవాలు నడిపినారు
మార్గాలను వేసినారు. ॥లాల్॥

— సమాప్తం —

కథలు చెబుతూ కన్నీరు పెట్టిస్తూ
ఆయుధం పట్టుకొని పోరాటంలో ముందు నడిచి
పోలీసుల క్రూరహింసలకులోనై
అమరుడైన 14 సం॥ బాలుడు, ప్రజా కళాకారుడు
కా॥మేడ్ తామాడ చిన్నారావుకు అంకితం.

ఓహో! విద్యార్థీ!

ఆజాద్

విద్యార్థీ ! ఓహో విద్యార్థీ !
ఈ బానిస చదువులకు బంధీ అగుదువా ?
లేక
విముక్తి పోరాటంలో వీరుడ వౌదువా ?
కదనరంగమే నీ కళాశాలరా !
విప్లవమేరా నీ విద్యాలయము !

మావో ఆలోచనతో
జీవితాన్ని వెలిగించుము
విప్లవ సందేశాన్ని
వాడ వాడ వినిపించుము
శ్రమజీవుల సమరశక్తి
అడుగడుగున గుర్తించుము
గుండెల్లో, కొండల్లో
పల్లెల్లో, ఎల్లల్లో
విప్లవాగ్ని రగిలించుము
విద్యార్థీ ! ఓహో ! విద్యార్థీ !

పనికిమాలి పనికిరాని
చదువులన్ని కట్టిపెట్టు
కార్మికులతో కర్షకులతో
చెట్టాపట్టాల్ పట్టు
నవభారత అవతరణకు
జీవితాన్ని పణంపెట్టు
వీరుడవై, రణధీరుడవై
ఆయుధాన్ని చేతపట్టు
విద్యార్థీ ! ఓహో విద్యార్థీ !

మృతవీరుల రక్తంలో
ఎఱ్ఱదనం మరచిపోకు
అప్పారావు దుష్యంతుల
అమరగాథ మరచిపోకు
నక్సల్‌బరి, శ్రీకాకుళం
పోరాటం మరచిపోకు
ప్రపంచ విప్లవ యుగమిది
ఎన్నటికీ మరచిపోకు
వీరుడవై, రణధీరుడవై
వీరుడవై, ధీరుడవై
విముక్తికై పోరాడుము
విముక్తికే జీవించుము
విద్యార్థీ! ఓహో! విద్యార్థీ!

నిప్పు

ప్రేమసాగర్

చెక్క నుండి
ఉక్కుముక్క నుండి
అగ్ని హసిస్తుంది

స్పర్థ నుండి
సంఘర్షణ నుండి
నవత్వం వికసిస్తుంది

కార్మికవాడల నుండి
గిరిజనగూడెం నుండి
"తిరుగుబాటు" రగుల్తోంటుంది

వర్గపోరాటం నుండి
వేడి నెత్తుటి నుండి
"మరో ప్రపంచం" జనిస్తుంది

సమానత్వం నుండి
సామ్యవాదం నుండి
"నూతన మానవుడు" ద్భవిస్తాడు.

సమీక్షలు :

కె వి ఆర్ ఎఱ్ఱ పిడికిలి

సాంఘిక చైతన్యానికి ప్రతిబింబంమాత్రమే కవిత్వమని భావించే సాహిత్య విమర్శకులు మరోపాతికేళ్లు బతికుంటే ఆఖరికి షెల్లీకూడ టెన్నిసన్‌కి పెద్దన్నయ్య అయి ఉండేవాడని ఊహాగానం చేస్తారు. కాని "పురుషులందు పుణ్యపురుషులు వేఱయా" అన్నట్లు కవులందరిపట్లా యీ సూత్రం వర్తించడానికి స్పష్టమైన నిదర్శనం మిత్రులు రమణారెడ్డిగారి 'ఎఱ్ఱపిడికిలి'. పీఠికలో పేర్కొన్నట్లు "ఈరోజున యువకవిగా నవకవిగా కనిపిస్తున్న రమణారెడ్డి ఎప్పుడూ నవకవే యువకవే". ఆంధ్రసాహిత్యరంగంలో రమణారెడ్డి విశిష్టతను యీ విధంగా గుర్తించిన త్రిపురనేనివారి పరిచయ వాక్యాలు మావంటి చిరకాల మిత్రులు ఒకమాదిరి శల్యసారథ్యంగానే భావిస్తారు. 'శిల్పవ్యామోహం, భాషాభేషజం పండితుల్ని మెప్పించాలనే పరోక్షవాంఛ' రమణారెడ్డికి ఆపాదించడంకన్న కొందరి దృష్టిలో బలహీనతలైన 'సమాస తత్పరత', 'అన్వయకాఠిన్యం' యిదివరకటి రోజుల్లోకూడ కేవలం తానెన్నుకున్న కవనరీతికి ప్రకృతిగుణాలనిగుర్తిస్తే చాలును. నిజానికి లెనిన్ ఒకసారి ప్రస్తావించినట్లు సామ్యవాదుల లక్ష్యం 'ప్రతి విప్లవకారుడు కవి. ప్రతి కవి విప్లవకారుడు' అయినవాడు మొట్టమొదట పేర్కొనవలసింది రమణారెడ్డిని మాత్రమే. విప్లవ కవిగానేకాదు ఆధునిక యుగంలో ఏవిధమైన కవిత్వానికైనా విలువ, ప్రయోజనం కవి నిజాయితీ ఒక్కటే నిర్ణయిస్తుంది. అమెరికన్ యువకవి Corso మాటల్లో It is the poet now and not the poem that must become a work of Art .. The time demands that the poet be as true as a poem. నిరంతరమైన ఆదర్శదీక్ష, భావుకవిత్వం– ఈ రెంటి సమ్మేళనమే శ్రీ కె వి. రమణారెడ్డి సాహిత్య జీవితమని అందరు ఎఱిగిన విషయం కనుక యీ నూతన సంకలనాన్ని సాహితీప్రియులందరు తప్పకుండా ఆదరిస్తారు.

విప్లవ కవిత్వ ఉద్యమాన్ని బలపరుస్తున్నా విశేషణానికిగల ప్రాముఖ్యత విశేష్యంలోకూడ చూపవలసి ఉంటుందని భావించే నావంటి సాహిత్యాభిలాషులకు సహితం రమణారెడ్డి కవితాసంకలనం ఉత్తమస్థాయికి చెందిన కవిత్వాన్ని అందజేస్తోంది ఇంతకీ నావంటి అల్పజ్ఞులు, సాహిత్యాభిరుచిలో అమాయకులు కోరేదల్లా చేతనాత్మకమైన కవిత్వంలో భావనాపటిమ, ధ్వని, నిజమైన అనుభూతివంటి మూలద్రవ్యాలు కనిపించాలనే.

రాజకీయ సిద్ధాంతాల విషయం ఎంతటి దృఢవిశ్వాసం ఉన్నా కవిత్వరూపంలో వెలువడి నప్పుడే ఏవిధమైన ప్రబోధమైనా పాఠకుల హృదయాలకు హత్తుకోవడంగాని కవి సందేశాన్ని గూర్చి ఆలోచించడంగాని సాధ్యపడుతుంది. ఉదాహరణకు 'రక్తసంబంధం తప్పదు లాగుంది'లోని పాదాలు

'ప్రకృతిలాగే ప్రజ
పాటు పోట్లలా పోరాటాలు
అల సాగుతుంది చరిత్ర
ఆరంభం ఉంది అంతులేదు [పే. 16]

మార్క్సిజానికి ప్రధాన సూత్రమైన వర్గపోరాటం ఆవశ్యకతను తెలుపుతుంది.

'చల్లని వెన్నెల చిలకబోయే
చందమామ గూడా
నెత్తుటి గుడ్డుగానే
పుడుతున్నాడు' [అదే పేజీలో]

అవడంలో కవి చెప్పదలచుకున్నదేమిటో అక్షరాలా విశదీకరించవక్కరలేదు. Revolution is the midwife of Society అన్నాడు మార్క్స్. కేవలం ఆత్మఘోష, పేలవమైన వినాదాలు ఉద్ఘాటనలకు బదులు ధ్వన్యాత్మమైన సందేశాన్ని యువతరానికి అందించడంలో రమణారెడ్డి కృతకృత్యుడయినట్లు యింకొక నిదర్శనంగా యీ క్రింది పాదాలు పరిశీలించవచ్చు.

"ఈ ఉదయిస్తున్న సూర్యుడున్నాడే ఇతగాడు
ఇంకోచోట ఇంకా తూర్పున ఇప్పటికే ఉదయించినవాడు"

[తొలిప్రొద్దు-3 ఖండిక]

ఇదే కవితలోని ఆఖరిపాదం 'కాంతుల కత్తులతో ప్రజాదళాలకు ఆసరా చేకూరుస్తాడు' ఉత్తమ కోవకు చెందిన కవిత్వం.

ఈమాదిరి ధ్వని, వక్రోక్తి, సింబాలిజంవంటి లోతైన కవిత్వపు విలువలు నేటి అత్యవసరపరిస్థితులలో ప్రజాబాహుళ్యాన్ని ఉత్తేజపరచడానికి అప్రస్తుతమనీ తేలికైన మార్గాలన్వేషించదలచినప్పుడు భావోద్వేగం, అనుభూతికో నిండిన కవిత్వం అవసర మనుకుంటే రమణారెడ్డి కవితలో అటువంటి భాగాలుకూడ యెత్తిచూపవచ్చు. వాటిని ఉదహరించేముందు ముఖ్యవిషయం ఒకదానిని గమనించవలసి ఉంటుంది. ఉత్తమకవిత్వం నిజమైన అనుభూతినుండే జనిస్తుందన్నప్పుడు యీనాటి కవులలో నిజాయితీ లోపించిందనికాని లేక హృదయస్పందన లేనిదే కవిత్వం రాస్తున్నారనికాని అపార్థం

చేసుకోవడం పొరపాటు. సాంఘిక దృక్పథం, భావుకత్వం నిస్వార్థత లోపించిన కవులు విప్లవ కవిత్వం జోలికిపోరు. ఎటొచ్చీ కవితారంగంలో ఎంతకరకు ఉత్సాహ పూరితులైన యువకవులు సఫలత సాధించేరని ప్రశ్నించినప్పుడు ఆత్మానుభూతి కవిత్వంలో ఎంతవరకు ప్రస్ఫుటమవుతోందని పరిశీలించవలసి ఉంటుంది. మేద్యూ ఆర్నాల్డ్ 'Come, dear children, let us away' అన్నా షేక్స్పియర్ 'Oh ! Mighty Caesar !' అన్నా పఠితహృదయం ద్రవిస్తుంది.

'రక్తం మడుగులో తేలుతున్న శవాలనుచూసి
రగులుతుంది నాలో రాజ్యమంటేనే రక్కసి కసి' [పే. 29]

వంటి కవిత్వానికి హృదయాన్ని కదిలించగల శక్తి ఉంది. 'రాజ్యం'పై కవితతోపాటు విరికల్‌గుణం ఉట్టిపడుతున్న గేయాలు రమణారెడ్డి కవిత్వంలో విరివిగా ఉన్నాయి.

కలలు కంటూ కవితరాస్తూ
కలను మెలకువతో పెనేస్తూ
అడవి పిట్టకు బదులు చెబుతూ
పాడుతూ పోరాడుతుంటివిగా [ఎర్రపిడికిలి 19]

అందుకు మంచి ఉదాహరణ బంగ్లాదేష్ ఉద్యమాన్ని గూర్చి వెలువడిన గేయం ఉత్తమమైనది.

'మతం పాతరలోంచి
జాతి జాతరలోకి
గలగలా కదిలి సాగుతుంది
పద్మ' [పే 25]

'రక్తం'[పే. 42]. 'రానున్నది'[పే. 21]. 'వురికంబం విపేదిక'[17] 'మార్పు' [43] 'యౌవనగీతం' [పే. 50] వీటన్నిటిలో నిజమైన అనుభూతి కనుపడుతుంది.

పై ఉదాహరణలనుండి ఆత్మాశ్రియ కవిత్వం తప్పితే సాంఘిక విమర్శ ప్రధాన లక్ష్యంగా ఉద్దేశించబడిన వస్తాశ్రియ కవిత్వం నిరుపయోగమని నావంటి విమర్శకులు భావించడంలేదు. నిజానికి వస్తాశ్రియ కవిత్వంద్వారా నలుగుర్నీ మెప్పించడం కాని సాంఘిక చైతన్యానికి తోడ్పడడంకాని తేలికైన విషయం కాదు. అందువల్లనే వ్యంగ్యాత్మక కవితలు యీ సంకలనంలో సగానికిపైగా చోటుచేసుకున్నా సాధారణస్థాయిని మించినవి- 'అవాచ్యుడు' (పే. 52) 'అచ్చు! స్వేచ్ఛాజీవి' (పే. 73) 'ఆత్మ చిత్రిం' (పే. 62) అచలం (పే. 64) వంటివి- శక్తివంతమైనవి కొద్దిసంఖ్యలోనే ఉన్నాయి. ఇతర పాఠకులు మరోలా భావించవచ్చు. ఎవరి అభిరుచులు వారికుంటాయి. కాని

మనందరం ఆశించేది రమణారెడ్డి మాటల్లో నేటి సాంఘిక పరిస్థితుల నర్థంచేసుకొని 'సంసారం కోసం నువుపడే తాపత్రియముంది చూడూ, అది వరపకు సంతలో చేసే సావిరికం'(పే. 62) అని వీలయినంత త్వరలో గ్రహించడం.

'ఏటి నీటిలో ఈదే చేపలు
ఎగిరే వన్నెల చిన్నెల పిట్టలు
గాలీ కాంతీ కాలం స్థలమూ
గొంతు చించుకొని ఘోషిస్తూంటే
ప్రజాతంత్ర రక్షకులకు చెముడా ?' (పే. 42)

అని ప్రశ్నిస్తున్నాడు నిజమైన కవిగా శ్రీరమణారెడ్డి.

ఎస్. వి. ఎస్. రావు

[కె.వి. రమణారెడ్డి ఎర్రపిడికిలి కవితా సంకలనం వెల: 3 రూ. వి. ర. సం. తిరుపతిశాఖ ప్రచురణ.
ప్రతులకు : 1. శ్రీ బాలాజీ పబ్లిషర్స్. 81 బజార్ స్ట్రీట్, తిరుపతి.
2. సృజన, హనుమకొండ, వరంగల్ 506001.]

నగ్నముని తూర్పుగాలి

తూర్పు, పశ్చిమాల సంగతి అలా వుంచి నగ్నముని ఎప్పుడూ కొత్తగాలే. కవిగా, నగ్నముని నిన్నటితోనూ, ఇవ్వాళతోనూ సంతృప్తిపడే వ్యక్తి కాదు. అటు కళారంగంలోనూ, ఇటు సంఘరంగంలోనూ పూర్తి మార్పుకోసం తపనపడటం నగ్నముని వ్యక్తిత్వం. ఆ మార్పు సమాజానికి మంచి చేస్తుందా, కళారంగంలో ఆరోగ్యకరమైన ధోరణా, కాదా అనేది వేరే విషయం. ముందు మారాలి. ఉన్న స్థితిని భరించటం సాధ్యంకాదు. తన చుట్టూ వాకధోరణిలో స్థిరపడిపోయి పేరుతెచ్చుకున్న కవులూ వున్నారు. కొత్త అంటే ముఖం చిట్లించుకునేవాళ్లూ వున్నారు. నలుగురూ నడిచే దారిలోనే నడవటం అంటే నగ్నమునికి మహాచిరాకు. మర్యాదగా చెపితే వినరనుకుంటే వినేట్టు చెప్పటానికి పూనుకోవాలిగదా— స్తబ్దత అంటే ఇతడికి చావుకంటే భయంకరంగా కనిపిస్తుంది. మధ్యతరగతి బొద్దింకల్ని చూస్తే నగ్నమునికి మహాకసి.

తెలుగుదేశం ఈమధ్య తెలివిమీరి పోయింది. 'జీవితం అంటే నటించటం' అనే సూత్రంమీద జనం బతికేస్తున్నారు. చదివి డిగ్రీ సంపాదించు కోవాల్సిన అవసరం లేదు. డిగ్రీ కొట్టేస్తే చాలు. ఎవడినయినా ఆశ్రయించి కులంపేరు చెప్పో, డబ్బుపేరు చెప్పోఎవడూ చూడకుండా కాళ్లపట్టుకునో ఆ వోటమిని గుండెల్లో భరిస్తూనే పైకి పెద్దనవ్వు నవ్వుతూ కనిపించటం- అంతా నకిలీ సరుకే. తన వ్యక్తిగత సమస్యల్ని చీకట్లోనో, గుడ్డివెలుతురులోనో ఏదో వొక మార్గంలో ఎంత నికృష్టమైనా సరే పరిష్కరించుకోవటం, సమాజ దృష్టిని పూర్తిగా కోల్పోయి, తిరుగుబాటుఅనేది వ్యక్తిగతంగాకూడా మరిచిపోయి జనం బురదలో పురుగుల్లా బతుకుతున్నారు. కానీ తాము చాలా గౌరవంగా బతుకుతున్నట్టు ఇతరులను నమ్మించటానికి ప్రయత్నించటం, తాము కూడా నమ్మటం జరుగుతోంది. ఇదంతా ఎక్కువగా మధ్యతరగతి జీవితంలో కనిపిస్తోంది. మనిషి ముఖానికి తగిలించుకున్న ముసుగు (Persona) మనిషిని తోసివేసి ఆ స్థానాన్ని ఆక్రమించుకొంది. తనను గూర్చి తాను కష్టపడి లోకంముందు వుంచిన 'అబద్ధం' నిజం గొంతును నులిమేసింది. వ్యక్తుల్లో పెరుగుతున్న ఈ వక్రసంస్కారం సమాజానికి కుష్ఠురోగం తెచ్చేంత ప్రమాదస్థితికి చేరుకుంది. సమాజవాదం పూర్తిగా మరుగునపడిపోయి జనంలో సంఘస్పృహ పూర్తిగా చచ్చిపోయింది. ఎవడికివాడు అందినంత అవకాశమున్న మార్గంలో నమిలి మింగటమే లక్ష్యంగా చేసుకున్నాడు. ప్రజాస్వామ్యం అనేది సమాజపరంగా వోడిపోయి, సర్వమానవ విలువల్ని నాశనం చేసే వొక జడతరాన్ని వుత్పత్తి చేసింది ఆలోచించటం, పోరాటం చేయటం, పురోగమించటం అనేవి దేనికీ కొరగానివిగా మారిపోయాయి.

స్వాతంత్ర్యం సంపాదించామని వొక వర్గం చాలా జాగ్రత్తగా స్వతంత్రాన్ని తనకే పరిమితం చేసుకుంది. పార్లమెంటు అనీ, అసెంబ్లీ అనీ, రాజ్యాంగం అనీ, కోర్టులనీ, విద్యాలయాలనీ, ప్రాజెక్టులనీ, సర్వోదయం అనీ, ప్రజాస్వామ్య సోషలిజం అనీ, దేశభక్తి, సైన్యం అనీ అన్నిటినీ తమ స్వాతంత్ర్యాన్ని గట్టిగా పదిలపరచుకోటానికి వీలుగా తీర్చి దిద్దుకొంది. మేం అభివృద్ధి సాధిస్తాం- మేం అనుభవిస్తాం-- మేం జైళ్ళలోవుండి స్వతంత్రం తెచ్చాం— అది మా హక్కు— దాన్ని మరొకడు కావాలంటే జైల్లోవేస్తాం అని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బల్లగుద్దిచెప్పింది. వీళ్ళలోనే కొంతమంది దూరదృష్టి కలవాళ్లు ప్రభుభక్తి పరాయణులై 'జస్టీస్' లేబిల్ మీద ఐ.సీ.యస్. సీతాకోక చిలుకలుగా, సైన్యంలో కమాండర్లుగా వుండిపోయారు. రావు బహద్దూర్ తలపాగా తగిలించుకొని బుర్రమీసాల, కిర్రుచెప్పుల సంస్కృతిని కాపాడారు స్వాతంత్ర్యం వచ్చింతర్వాత వీళ్లంతా తమవర్గమే అయిన పాలకపక్షంలోకలిసి

పోయి పాలక యంత్రాంగంలో కీలక స్థానాల్ని ఆక్రమించుకొన్నారు. ఈ విధంగా 'ఖద్దరుతరం' చాలా జాగ్రత్తగా దేశస్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని హస్తభుక్తం చేసుకుంది.

ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక దేశాల్లో లేచిన స్వాతంత్ర్య వుద్యమానికి నాయకత్వం వహించిన మహాత్ముల తరాలు గత దశాబ్దంలో చిక్కుల్లో చిక్కుకున్నాయి. ఈ వృద్ధతరంమీద ఏదోవిధంగా యువతరం తిరుగుబాటుచేయటం ప్రపంచ ధోరణిగా పరిణమించింది. ఆ తిరుగుబాట్లు అన్నిచోట్లా బలమైన నిరసనోద్యమాలుగా రూపొందాయి. పాలక పక్ష స్వభావాన్నిబట్టి యువతరానికి దొరికిన నాయకత్వాన్నిబట్టి యివి అనేక రూపాల్ని తీసుకున్నాయి. పాశ్చాత్య దేశాల్లో హిప్పీ, కృష్ణభజన సంఘాలుగా యింకా అనేక విధాలయిన అరాచక వలయాల్లో చిక్కుకుపోయాయి New-left, pop-h roism, dropping-out గాను తయారై యువక నిరసనోద్యమాలు తప్పుదోవన పడ్డాయి. జనచైనాలో పెకింగ్ యూనివర్సిటీ మీద విద్యార్థులదాడితో ఆరంభమైన నిరసనోద్యమం సాంస్కృతిక విప్లవ మహాశయ పంథా స్వీకరించింద. చైర్మన్ మావో నిర్దేశించిన విప్లవ కార్యక్రమం ఆచరణలో సాధించిన 'రెడ్ గార్డ్‌దళం' ప్రపంచ యువకోద్యమాలకి మార్గదర్శకం అయింది. దేశదేశాల యువత కార్మిక రైతాంగంతో సమైక్యమై దీర్ఘకాలిక పోరాటపంథా స్వీకరించి విప్లవ చైతన్యంతో వర్గరహిత మహాసమాజం కోసం విప్లవించింది.

మరి, మన దేశంలోనూ యువతరానికి వృద్ధతరంమీద నమ్మకం పోయింది. విద్యావిధానం పాలకపక్షాన్ని సమర్థించేది కావటంచేత, కాలదోషంపట్టిన పాఠ్యాంశాల్తో కొత్త సమస్యలకి అనుగుణంగా మారలేదు. నిరుద్యోగం, జడజీవితం- అన్నిరంగాల్లోనూ వృద్ధతరం నాయకత్వం యువతరంలో సంక్షోభానికి కారణమయ్యాయి. సమ్మెల రూపంలోనో, మరోరూపంలోనో యూనివర్సిటీలమీద, కళాశాలలమీద, విద్యావిధానాన్ని పాలకపక్షానికి తారుస్తున్న నాసిరకం మేధావులమీద యువత తిరుగుబాట్లు చేయటం ఆరంభించింది. భవిష్యత్తుమీద ఏమాత్రం ఆశనూ కలిగించలేని వృద్ధతరంమీద ఏ చిన్న కారణం కనిపించినా యువతరం నిరసన తెలియచేస్తోంది. నిర్జీవ విద్యావిధానం, జీవితాన్ని పేలవం చేస్తున్న యథాతథవాదం కారణంగా యువతరంలో సిద్ధాంత దారిద్ర్యం, రాజకీయ విముఖత్వం, నైతిక సంక్షోభం కరుడుగట్టుకు పోయాయి. ఈ అరాచకం నుంచీ, స్తబ్దతనుంచీ బాధ్యతాయుత యువత చైతన్యతరమై సుదీర్ఘ సాయుధ పోరాటపంథా చేపట్టింది. ఈ దేశంలోని యువతకు అరుణారుణ దిక్సూచిని ప్రదర్శించింది.

ఈ పరిస్థితుల్ని పట్టించుకోక పోతే దిగంబర కవిగా, విప్లవ కవిగా నగ్నమునిని అర్థం చేసుకోవటం సాధ్యంకాదు. తూర్పుగాలిలో నగ్నముని 'దిక్కు'ల్ని కూడా చేర్చాడు. కాబట్టి దిగంబర కవిగా కూడా పరిశీలించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ 'దిక్'లను చేర్చటంతో నగ్నమునిదృష్టి కొంత అస్పష్టమైంది. దిగంబరకవిత్వం విప్లవ కవిత్వం కాదని చెప్పలేకుండానే తీర్మానించవచ్చు. విప్లవకవిగా మారినతర్వాత దిగంబర కవిత్వాన్ని వదులుకోవలసిందే. నగ్నముని తన రచనలన్నింటిని సంకలనంగా వేయదల్చుకుంటే అది వేరేవిషయం. చిన్నప్పటినుంచీ రాసినవన్నీ ఇప్పుడు 'విప్లవ కవుల' ప్రచురించుకోవడంలో చాలా చిక్కులున్నాయి. విప్లవకవిత్వంపేరుతో చిన్ననాటి రచనల్నికూడా ప్రజల్లోకి వదలటం కవి ఋజుత్వలోపమే. తాను విబద్ధుడు కాకముందు, మార్క్సిస్టు విప్లవమే సమాజ పరిష్కారమార్గంగా గ్రహించక ముందు చేసిన రచనలన్నీ విప్లవకవి ప్రచురించటం మంచిపనికాదనే నా అభిప్రాయం. (ఏదో షష్టిపూర్తి అయింతర్వాత చేయాల్సిన పనులన్నీ ఇప్పుడే చేయాలా !)

వి.ర.సం. ఆశయాల్ని అంగీకరించి విప్లవ ప్రజాపోరాటాల్ని సమర్థిస్తూ చేసిన రచనల్తో బాటు నగ్నముని దిగంబర కవితల్నికూడా చేర్చటం విషయంలో నాకు చాలా అభ్యంతరం వుంది. ఇది పాఠకుల్ని, విప్లవ కవిత్వ అభిమానుల్ని గందరగోళపరిచే వ్యవహారం. పోనీ ఇతని దిక్కులు వెలుగు చూడకపోతే కొంత లిబరల్‌గా చూడవచ్చు. రెండు సార్లు యిప్పటికే ప్రచురింపబడిన వాటిని మళ్ళీ యిందులో చేర్చటం అంటే ఎలా అర్థంచేసుకోవాలి? తూర్పుగాలిలో దిగంబర కవిగా, విప్లవ కవిగా పరిశీలించవలసిన పరిస్థితిని నగ్నమునే తెచ్చిపెట్టుకున్నాడు. ఇంతకే విప్లవకవిగా పూర్తిగా పరిణామం చెందాడా లేదా అనికూడా ఆలోచించాలి.

దిగంబర కవిత్వాన్నిగూర్చి చర్చించేటప్పుడు '65 నాటి ఆంధ్రదేశాన్ని, అందులోనూ ముఖ్యంగా ఆంధ్ర సాంస్కృతిక రంగాన్ని బాగా దృష్టిలో వుంచుకోవాలి. ఇప్పటి వ్యవస్థలో మెచ్చుకోదగిందేమీలేదు. ఆర్థిక విధానం, రాజకీయాలు, మతం, సాహిత్యం, వ్యక్తుల సంస్కృతి ఆరోగ్యకరంగాలేవు. సామ్రాజ్యవాదుల గుప్పెట్లో ఆర్థికం విలవిలలాడుతోంది. రాజకీయ నాయకులకు పదవులుతప్ప యింకేం అవసరం లేదు. మత ప్రతినిధులు, ఆచార్యులు, మిషనరీలు, ఆశ్రమాలు, బాబాలు, యోగులు కాలదోషం పట్టిన ప్రజావ్యతిరేక అజ్ఞానంతో పెద్ద భోగంతో బతికేస్తున్నారు. విద్యావంతులు, మేధావులు భట్టీయం పండితులై వ్యక్తిగత స్వార్థమే లక్ష్యంగా వాళ్లనీ, వీళ్లనీ కాకాపట్టి భజనచేసి బతుకుతున్నారు. యూనివర్సిటీలు నిరసజాతిని తయారు

చేసే కర్మాగారాలుగా తయారయ్యాయి. కాంట్రాక్టర్లు, బ్లాక్ మార్కెట్ దారులు, స్మగ్లర్స్ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. నిన్నటివరకూ వున్నచరిత్ర అది ఎంత గొప్పదైనా ఈనాటి సమస్యల పరిష్కారానికి పనికిరావడంలేదు. వర్తమానం ఎంత సంక్షోభంలోవున్నా భవిష్యత్తుకోసం యువతరం బాధ్యత తీసుకునేస్థితిలోలేదు. కవులు పేదలకోసం రాయటం, ప్రజలపక్షాన నిలబడటం out of date అని సినిమా కవిత్వం రాసుకుంటున్నారు. సాహిత్యాన్ని వుద్ధరిస్తాం అని ఎకాడమీలు పాత సాహిత్యాన్ని ప్రచురించడంలోను, పలుకుబడివున్న పసికిమాలిన కవులకు పండితులకు ఆర్థిక సహాయం చేయటంలోనూ మునిగిపోయాయి. కార్మిక పక్షాలు ప్రజలకు దూరమయి, చీలిపోయి తమలో తామే కొట్లాడుకుంటున్నాయి. చుట్టూ జాగ్రత్తగా చూస్తే ఎంత ఆశాజీవికైనా సంఘజీవితం ఆశావహంగా కనపడలేదు. ఈ దశలో లేచింది దిగంబర కవుల నిరసనోద్యమం. ఈ కవుల తీవ్ర నిరసనకు గురికానిది, వీళ్ళ సూక్ష్మదృష్టిని తప్పించుకు పోయింది ఒక్కటికూడా లేదు. భాష, భావప్రతిమలు కూడా నిరసనకు తగినవిధంగా కొరడారూపాన్ని దాల్చాయి. నిహిలిజం, శాడిజం— అని ఏ ఇజాన్ని తీసుకొచ్చి తూచడానికి ప్రయత్నించినా దండగే. నానా రకాల విమర్శకులు దిగంబర కవుల్ని ఖండిస్తున్నారంటే వాళ్లూ వీళ్ళ నిరసనకు గురైన పరిధిలో వాళ్లే. అలాంటి విమర్శలవల్ల ఏమీ ప్రయోజనం లేదు. దిగంబర కవులమీద నిజమైన విమర్శ ఎలా వుండాలంటే, వాళ్ళముందు సక్రమమైన, శాస్త్రీయమైన, ఆచరణ సాధ్యమైన ఆశామార్గాన్ని ప్రదర్శించగలగాలి. అలా సమాజానికి పట్టిన రోగాలకు శస్త్రచికిత్స చేయటానికి సిద్ధమైన ప్రజా విప్లవ వీరుల పిలుపుతో దిగంబరకవులు నిరసనను విసర్జించి నిర్మాణాత్మక మార్గాన్ని చేపట్టారు. కనిపించిన నక్షత్రాల వెలుగులోకి ఆశయంనిండిన గుండెలతో ప్రవేశించారు. వాస్తవానికి దిగంబర కవులమీద దిగంబర కవులే మంచి విమర్శకులు. సంప్రదాయపు పాత గొంగళీలు కప్పుకొని కుండలాలు కదిలేటట్టు పండితులు పళ్లుకొరికినా, శ్రోత్రియ కమ్యూనిస్టులు కొందరు కోపారుణ నేత్రాల్తో శాపనార్థాలు పెట్టినా తామూ నిరసనకు గురికావటమే కారణం. ఆత్మవిమర్శ చేతకాని ఆడంబరవాదులు ఆర్భాటం చేశారు. ఈ దృష్టితోనే తెలుగు కవిత్వంలో దిగంబర కవిత్వం నిస్సందేహంగా చారిత్రిక సంఘటన. నిర్జీవ స్తబ్దతలో కూరుకుపోయిన కవిత్వాన్ని కొరడాదెబ్బలు కొట్టి ముందుకు నడిపించారు. దిగంబర కవిత్వ పరిధిలో ఈ కవులకు పూర్తి లైసెన్సు వుంది. బూతులు తిట్టారని మనం తిరిగితిట్టడం, కుసంస్కారులనటం, ఆంధ్రసాహిత్య చరిత్రలో యింతటి కుసంస్కారులు లేరనటం లుంపెన్ ప్రోలిటేరియట్ అనటం— అన్నీ దిగంబర కవిత్వానికి ప్రేరణ యిచ్చిన

శక్తుల్ని అర్థంచేసుకోలేకపోవటమే కారణం. కూచిమంచి జగ్గకవితోనూ, కవిచౌడప్ప తోనూ పోల్చటం అసందర్భ ప్రలాపాలు. ఈ నిరసనను ప్రవచించటంలో నగ్నమునిది బలమైన కంఠం.

'రాజకీయాల రోగాలు తగలని కోళ్లు
నీ అమ్మెటలోకి ఆరోగ్యవంతమైన గుడ్లు ఆనందంగా పెట్టాలి'
(తొడవిరిగిన తరం)

అంటే దిగంబర కవిత్వంగా అభ్యంతరం లేదుకాని, విప్లవ కవిత్వంలో రాజకీయ విముఖత్వం ఏ విధంగా సమర్థనీయం? విప్లవ దృక్పథంతో చూస్తే 'తొడవిరిగిన తరం' తల విరిగిన రచన. వేణులాటి వాళ్ళను పోరాటంలోకి ఆహ్వానించటం మరీ అమాయకత్వం. పాలక వ్యవస్థకు దళారీ అయినవాడిని గూర్చి ఈ ప్రార్థన ఏమిటి?

"సీసాల్లో స్నానమాడించి
సిల్కు చీరల లంగాల్లో నిన్ను పాతేశారు"

ఈ మాత్రానికే పాలకుల పాదరక్షఅయిన బలహీనుడు ప్రజల్లోకి వచ్చి ఏంచేస్తాడు? అందుకని యీ రచనని దిగంబరకవితగా అంగీకరించగలను కానీ విప్లవ కవితగా మాత్రం చాలా అసహ్యకరమైన రచన. తొడవిరిగిన తరాన్ని చూసి జాలిపడటం కాదు. దుర్యోధనుడులాంటి వ్యవస్థ తొడ విరగ్గొట్టే తరాన్ని అనుసరించటం అవసరం. 'బుద్ధక్షమ'— గాడిద లక్షణమైన సహనాన్ని బుద్ధుడికి అంటగట్టడం చాలా ఆశ్చర్యకరం. బౌద్ధమతం ఈనాటి సమస్యలకి దేనికీ కొరగాని మాట నిజమే కాని వైదిక మతాచారాలమీద అతడు చేసిన తిరుగుబాటును విప్లవకవి గుర్తించవద్దా? "ప్రశ్నించటం చేతకాని అస్తిత్వాన్ని నేను క్షమించలేను" (బుద్ధక్షమ). నిజమే మరి బుద్ధుడు వేదాధికారాన్ని ప్రశ్నించాడు. అసలు దేవుని వునికినే ప్రశ్నించాడు కదా? దిగంబరకవిగా 'బుద్ధక్షమ'ని నిరసించటాన్ని క్షమించవచ్చునేమోకానీ హేతు దృష్ట్యా అసహ్యమైన ఈ క్షమను బుద్ధుడికి అంటగట్టడం న్యాయంకాదు. బుద్ధుడు దారి తప్పిన విషయాలు వేరే చాలా వున్నాయి. నగ్నముని ఈ రచననుకూడా ఇందులో చేర్చటం సమంజసం కాదు.

'నాయకులు ప్రజల ముఖాలపై పోస్తున్న ఉచ్చని
కరుణరస గంగాజలంగా గతుకుతున్న యువతరాన్ని'—

యువతరంమీద ఈ విప్లవకవి అవగాహన యింత ఘోరంగా వుందా?, నగ్న శిశువు కాస్మిక్ జాతికోసం, కుష్టురోగి— ఈ 'దిక్' లన్ని విప్లవ కవిత్వరేఖలుకూడా లేనివి.

ఈ విధంగా 15 'దిక్'లను 'తూర్పుగాలి' పేరుపెట్టిన కవితా సంకలనంలో చేర్చారు. ఈ దిక్కులు విప్లవ కవిత్వంగా అంగీకరించటానికి ఏ మాత్రం అవకాశంలేదు. మరి ఎందుకు నగ్నముని చేర్చినట్టు? విప్లవ కవిత్వం 'లేబిల్'మీద చలామణి చేయటానికా? అదే వుద్దేశ్యమైతే యితడి చిత్తశుద్ధిని శంకించవలసిందే. ఈ దిక్కుల్నికూడా విప్లవ కవిత్వమే అని నగ్నముని భావిస్తే అది అవివేకం. ఇలాంటి పనులవలన అశ్రద్ధగా వుండేవాళ్లు, శత్రువులు, విరసం మీద మసిపూయటానికి పూనుకునేవాళ్లు దిగంబర కవిత్వాన్ని, విప్లవ కవిత్వాన్ని వొకేగాటలోపెట్టి ఖండిస్తున్నారు. అలాగే చిత్తశుద్ధితో విప్లవ రచన చేయాలనుకునే వుత్సాహవంతులైన యువకవులు దిగంబరశైలిలో రాస్తున్నారు. ఇన్ని అవాంఛనీయ పరిస్థితులకు దారితీసే ఈ 'దిక్కు'ల్ని యిందులో చేర్చటం ఏమాత్రం న్యాయంకాదు.

'దిక్కులు'కాకుండా తూర్పుగాలిలో వున్న తక్కిన రచనలన్నీ విప్లవ కవిత్వమనే దృష్టితోనే పరిశీలించాలి. కనీసం ఈ అభిప్రాయం నగ్నమునికి వుంది. "వర్గ చైతన్యంతో మనం ముందుకు వెడదాం 'ఉషస్' "వర్గచైతన్యంతో ముందుకువెళ్లు" అరణ్యం. విప్లవ కవిత్వానికి వర్గచైతన్యమే పునాది. చారిత్రిక సంబంధాల శాస్త్రీయమైన అవగాహన వర్గచైతన్యానికి మూలం, వుత్పత్తి శక్తులు, సాంఘిక విధానం, చైతన్యం చరిత్రకి ముఖ్యమైన శక్తులు. మానవ భౌతిక అవసరాలు వుత్పత్తి శక్తులకు మూలం. ఈ శక్తులనుంచీ ఏర్పడిన వుత్పత్తి సంబంధాలే సాంఘిక విధానం. ఈ సాంఘిక విధానం నుంచీ చైతన్యం ఏర్పడుతుంది. తనచుట్టూ వుండే పరిసరాలతో తనకుండే సంబంధాలే చైతన్యం. ఏ చారిత్రిక క్షణంలో అయినా ఈ మూడూ వుంటాయి. ఆలోచనాశక్తే మనిషిని పశువునుంచీ వేరుచేస్తోందనుకోవటం తప్పు. భౌతిక జీవితాన్ని వుత్పత్తిచేయగలగటమే మనిషిని పశువునుంచీ వేరుచేస్తోంది. ఉత్పత్తి సంబంధాలు పశువులకు వుండవు. మనిషికుండే ఈ సంబంధాలే చైతన్యం. ఉత్పత్తి సాధనాల్ని హస్తగతం చేసుకొన్నవాళ్లు వొక వర్గంగా, వుత్పత్తిలో శ్రమనివెచ్చించి ప్రత్యక్షంగా పాల్గొనేవాళ్లు మరొకవర్గంగా విడిపోతారు. దీంతో సాంఘిక సంబంధాలన్నీ మారిపోతాయి. పీడకవర్గంలో పోటీ, స్వార్థం ఎక్కువగా వుండటంతో వాళ్ళలో సంబంధాలు నామమాత్రంగా, బలహీనంగా వుంటాయి. తిరోగామివర్గం కాబట్టి దీనికి చైతన్యం వుండదు. ఉత్పత్తిచేసే వర్గం పీడితవర్గం కాబట్టి వర్గరహిత ధ్యేయంతో పురోగమించేది కాబట్టి ఆ వర్గానికే చైతన్యం వుంటుంది. వర్గచైతన్యం అన్నప్పుడు ఈ మొత్తం భౌతిక సూత్రాల పరిజ్ఞానమేకాక పీడితవర్గ పక్షపాతం వహించటంకూడా అవుతుంది. శ్రామిక వర్గంలో వర్గపరివర్తన సాధిస్తూ కవి తనశక్తిని ఆ వర్గానికీ అంకితంచేయడమే

వర్గచైతన్యం ఈ చైతన్యంలో భాష ప్రధానాంగం. భాష చైతన్యానికి పునాది. చైతన్యం భాషకు భవనం. చైతన్యంవలెనే భాషకూడ అవసరంనుంచి పుడుతుంది. ఇతరులతో సంబంధాల అవసరం నుంచి పుడుతుంది. "Language, like consciousness, only arises from the need, the necessity, of intercourse with other men." (Marx) భాష (practical consciousness) ఆచరణాత్మక చైతన్యం. వర్గచైతన్యానికి, భాషకి చాలా శాస్త్రీయమైన సమీప సంబంధంవుంది. 'వర్గ భాష'అనటం అతిశయోక్తే కానీ, మధ్యతరగతి మేధావి వర్గానికి, కార్మిక-రైతాంగానికి విద్యాప్రమాణాలు కారణంగా భాషా ధోరణిలో కొంత తేడా వుంది. అదీ పదాల్లోనే కాని వాక్యనిర్మాణంలో అంతగా వుండదు. వర్గ చైతన్యంతో ప్రజాకవిత్వం రాసేవాడు ప్రజావ్యవహారంలో సజీవంగావున్న మాటల్ని నేర్చుకోవాలి. దీనికి అనుభవం, పరిశీలన కావాలి. ప్రజలతో కలిసి జీవించటం- వొక్కటే సరైన మార్గం. కార్మిక రైతాంగం, వర్గపరివర్తనంతో విప్లవాచరణలో నిమగ్నమైన మధ్యతరగతి వాళ్లు విప్లవ వర్గం. ఈ విప్లవ వర్గంతో మమేకమై కవిత్వం సాధనంగా సాంస్కృతిక పోరాటం చేయటం విప్లవ చైతన్యం. సోషలిస్టు విప్లవం వెలుగులో సకల జీవితరంగాలనూ వ్యాఖ్యానిస్తూ విప్లవాభిముఖం చేయటం విప్లవకర వర్గచైతన్యం. సాయుధ పోరాట రూపంలో విప్లవ భావాన్ని సజీవంగావుంచుతూ, ఆ మార్గంలోకి శ్రామికవర్గం ప్రవహింపచేస్తుచేసే 'విప్లవ ఆచరణ' విప్లవకవి విప్లవ సిద్ధాంతం. ఈ సిద్ధాంతంతో ముందుకు పోతున్న ప్రజాపోరాట పంథాకి అనుగుణ్యంగా జీవితాన్ని విప్లవీకరించటం విప్లవ వర్గ చైతన్యం. ఫ్యూడల్, దళారీ బూర్జువాల ప్రజావ్యతిరేక స్వభావాన్ని శాస్త్రీయంగా చిత్రించగలగాలి. ఏ రూపంలోవున్నా సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా ఖండించాలి, శ్రామిక అంతర్జాతీయత, విప్లవ ప్రపంచ వాస్తవికత విప్లవకవి సంస్కారంలో లీనం కావాలి. సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విప్లవాగ్నితో మండే జీవితం విప్లవ కవి వస్తువు కావాలి.

నగ్నమునికి ఈ విధమైన విప్లవవర్గ చైతన్యంలేదు. వాళ్లు అమ్మ బతికేస్త్రీలు, వాళ్ళ పిల్లలు, పెంటకుప్పలమీద ఎంగిలాకులకోసం కుస్తీ పట్టేవాళ్లు, అర్ధరాత్రి పేవ్‌మెంట్ పక్కనే దుమ్ములో, వుమ్ములో పేదపురుగుల్లా ఎదుగుతున్న ఆడపిల్లలు, రోడ్డుమీద ఒకరిమీద ఒకరు పడుకొని న్యూసెన్స్‌చేసే ఆడ, మగా, దాఫర్లు, జేబు దొంగలు, గుమస్తా చీమలు— ఈ రకం నిర్భాగ్యుల్నే నగ్నముని ఎక్కువగా 'వర్గం'గా స్వీకరించాడు. వీళ్ళంతా బాధితులే, సంఘంచేత విసరివేయబడ్డవాళ్లే, కానీ శ్రామికులు కారు. ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధంలేని, సిద్ధాంత ప్రభావితులు కావటానికి

మేధలేని యీ రకం 'అలగాజనం' విప్లవవర్గం కాదు. విప్లవ పరిణతదశలో విప్లవ సైన్యాన్ని అనుసరించగలరేమో కానీ విప్లవాన్ని నడిపించగల పోరాట శక్తి, యుక్తి వీళ్ళకు వుండవు. ఈ రకం జనాన్ని చూసి స్పందించకుండా వుండేవాడు కళాకారుడే కాదు. కాని వర్గచైతన్యం వున్న కవి ఈ జనాన్ని ఆసరాగా చేసుకొని విప్లవాచరణ బోధించటం శాస్త్రీయం కాదు. అలాగే వర్గ శత్రు స్వభావాన్ని, వర్గ శత్రు సంస్కృతి నాగరికతల్నికూడా విప్లవకవి సరిగా అవగాహన చేసుకోవాలి. భూస్వాములు, దళారీబూర్జువాలు ఇవ్వాళ పాలకవర్గం. కారులో నోట్లకట్టల్తో వుబ్బిన జేబుల్తో బార్లను వెతుక్కుంటూపోయేవాళ్లూ, రాజకీయ పరిజ్ఞానంలేని నిషానాయకులు, నానారకాలచిల్లర వ్యాపారులు, వడ్డీ బొజ్జలవాళ్లు, లాడ్జింగ్ ఓనర్లు, కంట్రాక్టర్లు, కమీషన్ వ్యాపారస్తులూ సంఘ వ్యతిరేకశక్తులేకాని కార్మిక వర్గానికి బలమైన శత్రువులు కారు. ఈ రకం పురుగుల్ని ఏరిపారేయడానికీ గూండాలు, లాడ్జింగ్ అమ్మాయిలుచాలు. వర్గ శత్రువుని ఆశ్రయించుకొని బతికే వికారమైన నీడల్ని నగ్నముని వర్గ శత్రువు అనుకుంటున్నాడు. భూస్వాములు, బూర్జువాలు వుత్పత్తి సాధనాల్ని తమ కైవసం చేసుకొని పీడితుల శ్రమను తమ సంపదగా మార్చుకుంటారు. నగ్నముని సాధారణంగా నిరసించే వర్గ శత్రువులకు వుత్పత్తి సాధనాలమీద అధికారం వుండదు. స్థూలంగా వర్గ శత్రువును గుర్తుపట్టినా, శాస్త్రీయంగా వర్గశత్రు స్వభావాన్ని, నైతిక విలువల్ని, బుద్ధిపాటవాన్ని, సాంఘిక పాత్రని నగ్నముని అర్థంచేసుకోలేకపోయాడు. విప్లవకవికి ముఖ్యంగా వుండవలసిన వర్గచైతన్యాన్ని సక్రమంగా పెంచుకోవాల్సిన సాంఘిక బాధ్యతని నగ్నముని గ్రహించాలి.

నగ్నముని చైతన్యానికి తగినట్టే భాషకూడా వుంది. భాష–చైతన్యం ఈ రెండింటినీ విడదీయలేం. ఆరంభదశలో తేడావున్నా క్రమంగా చైతన్యాన్ని భాష, భాష చైతన్యాన్ని అనుసరిస్తాయి. విప్లవకవిగా నగ్నముని 'సెక్స్ ఇమేజరీ' ద్వారా సమాజాన్ని ఖండించే వలయం నుంచీ బయటపడాలి. ఈ రకం ఇమేజరీ శక్తివంతమైన భావాల్నికూడా హాస్యాస్పదంగా చేస్తుంది. స్త్రీ పురుష సంబంధాలు, కుటుంబవ్యవస్థ అత్యంత ప్రధానమైన సహజ చారిత్రిక సంబంధంగా నగ్నముని గుర్తించవలసి వుంది. ఈ విషయంలో దిగంబర ధోరణి విప్లవభావ ధోరణికి పూర్తిగా విరుద్ధమైంది; దీన్ని నగ్నమునేకాక యువ విప్లవకవులంతా శ్రద్ధగా గమనించాలి. 'దిక్కులు'కాకుండా మిగిలిన కవితల్లోకూడా చాలావరకు దిగంబరధోరణే వుంది. "మనం నిజంగా జనంగా సాయుధంగా లేచినప్పుడే తూర్పు ఎర్రబడి ఉదయమవుతుంద"ని గుర్తించటమేచాలదు ఆ ఆశయంవైపు శాస్త్రీయంగా జీవితచిత్రణ జరగాలి. చివరిదాకా దిగంబరధోరణిలో

రాసుకుంటూపోయి చివర నాలుగు వాక్యాల్లో అరణ్యాల్లోనూ, కొండల్లోనూ వెలుగుతున్న కాగడాలను చూపినంత మాత్రాన విప్లవ కవిత్వం అవుతుందా? నగ్నముని దిగంబర కవిత్వంనుంచీ విప్లవ కవిత్వానికి గుణాత్మకంగా మారలేదు. అలాంటప్పుడు "తూర్పుగాలి" పేరుపెట్టి, "నరుడు--శివుడికి" అంకితంచేస్తూ, విరసంలో సభ్యుడుగా వుంటూ యిలాంటి రచనలను ప్రజముందు పెట్టటం న్యాయంకాదు. నగ్నమునికి ఆదర్శప్రాయంగా వుండదగిన కవిత్వం 'తూర్పుగాలి'లోనే వుంది. కవీ, తూర్పు, యోధుడులాంటి కొద్ది గేయాల్లో బలమైన విప్లవ రచనారీతులు వున్నాయి. జనాన్ని గందరగోళ పరచటం మాని, పూర్వాశ్రమాన్ని నామరూపాల్లేకుండా త్యజించి నగ్నముని విప్లవకవిగా గొంతెత్తి యువతరానికి మార్గదర్శికావాలి.

'ఉదయించని ఉదయాలు' ముందు మాటలో అరుద్ర తిరుగుబాటుదారులమీద కూడా తిరుగుబాటు ఒకప్పుడు అవసరం అన్నాడు. అయితే కేశవరావుగా నగ్నముని చేసింది తిరోగమనబాటే. కానీ నగ్నమునిగా అరుద్రాదులమీద తిరుగుబాటు చేశాడు. ఇక నగ్నముని తనమీదే తాను తిరుగుబాటు చేసుకోవాలి.

— త్రిపురనేని మధుసూదనరావు.

[నగ్నముని తూర్పుగాలి వెల: మూడురూపాయలు విముక్తిప్రచురణ ప్రతులకు: 'సెంట్రల్ పాయింట్' 510, ట్రూప్‌బజార్, హైదరాబాద్-1. సజ్జన, హనుమకొండ, వరంగల్ 506001.]

విముక్తి ప్రచురణ 2 నగ్నమునికథలు మూడురూపాయలు.
ప్రతులకు: యం. యస్. 86 మలక్‌పేటకాలనీ, హైదరాబాదు 500036.

చైతన్యతరం పిలుస్తోంది

ఆంధ్రదేశంలోనేకాదు, యావద్భారతంలో ఈరోజు ప్రతి పీడితప్రజల్లో విప్లవాగ్ని, పెనుమంటలుగా, ప్రాణమున్నపాటలుగా రగిలిరగిలి, రాజీలేని పోరాటమార్గంలో, వర్గరహిత సమాజంకోసం ఏ క్షణానికాక్షణం దీక్షవహిస్తూ ఉద్యమిస్తుంది.

వర్గ పోరాటాల అవసరాన్ని గుర్తించిన యువతరం జీవితంలోని అన్నిరంగాలలో, దోపిడీరూపాల్ని నేలమట్టం చేయడానికి సంఘర్షణను అనివార్యంగా అహ్వానిస్తూంది.

సాహిత్యకంగా ఉవ్వెత్తున లేచిన కవితోద్యమం సమాజవిప్లవ పరిణామఫలితంగా నిరాఘాటంగా, నిష్కర్షగా, ప్రజాపోరాటాలతో స్పందిస్తూ, సాయుధమై, వర్గకసితో, సముద్రఘోషతో కరడుగట్టిన హృదయాల్నిసైతం కుదిపేస్తూ పాలకవర్గం రొమ్ములు దాదుకునేలా, సమ్మెటపోట్లతో సజావుగా సాగిపోతూవుంది.

కొందరికిది నేలవిడిచిన సాములా కనిపించవచ్చు. మరికొందరికి వొట్టి అరుపులుగానే వినిపించవచ్చు. కానీ వర్తమాన భారతదేశ స్థితిగతుల్ని హేతుబద్ధంగా తర్కించేవాడికి అదే ఈనాటి సత్యమని సులభంగా తెలిసిపోతుంది.

సాహిత్యానికీ రాజకీయాలకూవున్న అవినాభావ సంబంధం యెటువంటిదోకూడా అర్థమవుతుంది.

వేర్లు తెలిసినతరువాత చెట్టును నేలగూల్చడం కష్టమేమీగాదు. తెలుగుదేశంలో ముందుచూపువున్న కొందరు సాహిత్యోపజీవులు ఈ వర్గసమాజ విషవృక్షాన్ని భూస్థాపితం చేయడానికి తమ రంగంలో కలాల్ని కత్తులుగా మార్చి బద్ధకంకణులై ఉద్యమిస్తున్నారు.

ఆ ఉద్యమ ప్రతిరూపాలు జిల్లాస్థాయి నుండి, పల్లె యువజన సంఘం వరకు ప్రతిఫలిస్తున్నాయి. అయితే ఈ విషవృక్షాన్ని నేలగూల్చడంవరకే విప్లవసాహిత్యం పరిమితం కాగూడదు. భవిష్యత్సమాజ రూపురేఖల్నికూడా పొందుపరిచి సొంతం చేసుకోవాలి. రచయిత అస్పృహ కలిగివుండాలి.

నక్సల్‌బరీ సంతాళ రక్తతర్పణంతో ఆరంభమయిన సాయుధ పోరాటం యీ అయిదారేళ్ళకాలంలో అటు ప్రభుత్వాన్నీ, ఇటు బుద్ధి జీవులను ఒక్క వూపువూపి

దేశంలోని వివిధ ప్రాంతాల్లో పోరాట స్థావరాల్ని సృష్టించుకుంటుంది. మహత్తర ప్రేరణాశక్తిగా విలద్రొక్కుకుంది. వర్గవిభజనకు మార్గాలు వేసింది. పాలకవర్గం గుండెల్లో డైనమెట్లు పేల్చుతుంది. ఎన్నికల మాయజూదంలో ప్రజలు పావులుకాగూడదని స్పష్టం చేసింది.

అంతో ఇంతో ఆలోచనాపరులైన 'ముందుచూపు' కలిగిన సాహితీవేత్తలు నోట్ల మూసుకు కూర్చోవడమా? విప్లవశక్తులకు స్వాగతం చెప్పడమా? అనే ప్రశ్నలకు ఇవ్వాళ జవాబు సిద్ధంగావుంది.

వందలాదిగా వస్తున్న కవితా కథా సంకలనాలు, పత్రికలు అందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు.

ఆ సామాజిక నైతికబాధ్యతను గుర్తించిన తిరుపతి 'విప్లవసాహితి' ప్రచురించిన కవితాసంకలనం 'విప్లవం వర్ధిల్లాలి' ఇప్పుడు మన ముందు వుంది.

లోగడ పీరు'లే' కవితాసంకలనం ప్రచురించడం ప్రభుత్వం దాన్ని నిషేధించడం కోర్టు ఎత్తివేయడం, అది పునర్ముద్రణ కావడంకూడా జరిగింది.

శ్రీశ్రీతో కలిపి అందులోవున్న కవులు ఇందులోనూ వున్నారు.

'విప్లవం వర్ధిల్లాలి' ఒక నినాదం. దాన్ని మించిన నినాదం మరొకటి లేదు. దేశంలో విప్లవపోరాటాలు లేనప్పుడు ఈ నినాదం నినాదంగానే గాలిలో తేలిపోతుంది. ఇంట్లో అన్నంలేనపుడు వడ్డిస్తాననడం ఎంత వెర్రితనమో అదీ అలాంటిదే. కాని "ఈ స్థితి ఇలాగే కొనసాగితే, దేశంలో రక్తపాత విప్లవం తప్పదని"మూటా ముల్లె సర్దుకుంటున్న ప్రభుత్వమే, విప్లవ పరిస్థితులు, విప్లవపోరాటాలు సజీవంగా వున్నాయంటూంది. మనమంటే దేశద్రోహం. వాళ్లంటే దేశభక్తి. కాబట్టే విప్లవం వర్ధిల్లాలి వొట్టి నినాదంగాగాక, ప్రజల ప్రాణవాయువుగా నిలిచివుంది. దైనందిన జీవితంలో దానికి భాగస్వామ్యం వుంది.

ఈ సంకలనానికి పీఠికరాసిన శ్రీశ్రీ "ఏదీ! పోలీసుబలంలేకుండా ఒక్కపూట పరిపాలించమనండి ఈ ప్రభుత్వాన్ని."అని సవాలు చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యం కాదు పోలీసురాజ్యం అనే వారిధ్వని.

విప్లవకారులమాటెందుకు, పోలీసులకే ఈ కోర్టులమీద నమ్మకంలేదు. కాబట్టే దొరికినవారిని దొరికినట్టుగా కాల్చి చంపుతున్నారు. "తలనొప్పి"తో పోలీసులు కోర్టు

లను కాదంటుంటే, అసలు తలలేలేని కోర్టులు మాకు వద్దంటూ బహిష్కరిస్తున్నారు విప్లవకారులు.

శ్రీశ్రీగారు చెప్పినట్లు నేడు కవిత్వం రాయాలంటే ఉత్సాహం మాత్రమేచాలదు విప్లవ చైతన్యంకూడా కావాలి. మార్క్సిస్టు దృక్పథంతో జీవితాన్ని విశ్లేషించి రాసి నప్పుడు సంపూర్ణ కరుణాపేశిమలతో, కళావిలువలతో మహోన్నత శిఖరాల్ని అందు కుంటుంది.

విరసం ఏర్పడినప్పటినుండి వెలువడిన విప్లవ రచయితల పుస్తకాలను వరసగా బెట్టి పరిశీలిస్తే, ముఖచిత్ర రచనలో చంద్రి సృష్టించిన విప్లవ సంప్రదాయం కొట్టొచ్చి కనబడుతుంది. ఆయనే విప్లవం వర్ధిల్లాలికి బిగిపిడికిలితో చక్కటి ముఖచిత్రంవేసారు, కవితలు, కథలు పాఠకుల గుండెల్ని ఆక్రమించినట్టే, చంద్రవేసిన ముఖచిత్రాలుకళ్లల్లో ఎప్పుడూ మెదలుతూవుంటాయి.

"విప్లవకవిత్వం-వాస్తవికత" పేరుతో యీ సంపుటికి ముందుమాట రాసారు శ్రీ త్రిపురనేని మధుసూదనరావుగారు. ఏది వాస్తవికతో, ఏది ఆధునికతో ఎవరు ఎట్లా కలగాపులగం చేస్తున్నారో వారు వివరంగా చర్చించారు.

మొత్తం సంకలనంలోవున్న వచనకవితలు ముప్పైఎనిమిది. 'విప్లవం వర్ధిల్లాలి' శీర్షికతో రెండు, 'ఉదయం' శీర్షికతో రెండు కవితలున్నాయి. ఎడిటింగ్ లోపంవల్ల కవులకు తమ కవిత ఇది అని మొదటి చరణాలుచదివి చెప్పుకోవలసినస్థితి ఏర్పడింది.

ఆద్యంతాల్లోవున్న శ్రీశ్రీ రెండుకవితలు రెండు ప్రయోగాలు. తన'విప్లవం' గీతంలో 'ఝంప, శంప' ఇత్యాది పదప్రయోగాలు చేర్చి నిఘంటువుమీద ఆధారపడ మంటున్నారు శ్రీశ్రీ.

ఆదే కవితలో—

"అరుస్తున్నారు—కవులు
మెరుస్తున్నారు—రవులు"

అంటారు. కవులు కవిత్వం రాయడాన్ని అరుపులకింద జమకట్టడం ఎట్లాగో! అం దునా 'అరుపు' అర్థరాహిత్యానికి సంకేతం. విప్లవకవులు అరవడం మొదలుపెడితే, విప్లవవిరోధకులకే లాభం.

మిగిలిన ఒక్కొక్క కవిగురించి కొంత కొంత ముచ్చటిస్తాను,

త్రిపురనేని మధుసూదనరావు–(3):– 'ఉదయం' కవితలో "అతని చావుకు ముందు రాత్రి జీవితంలో కల్లా చిన్న రాత్రి' అంటున్నారు. 'చిన్న రాత్రి' దేనికి సంకేతమో తెలియదు. ఆరాత్రి విప్లవకారుడికి చరమరాత్రిఅయితే, ఉదయం అతని కోసం ఉదయించింది అనడంలో అర్థంలేదు. పైగా రాబోయే భయంకర క్షణాన్ని చిరునవ్వుతో (అహ్వానిస్తున్నాడు)ప్రిదర్శిస్తున్నాడు అని వర్తమానంలో చెప్పుతున్నారు. ఇక్కడ అతను చావలేదనే భావం వస్తుంది. కాని అతనిచావుకు ముందు రాత్రి అని మొదలవుతుంది కవిత.

అన్ని ఆశలూ అడుగంటి చావు ఖాయంఅనే భావానికి సంకేతమయితే విప్లవకారుడికి ఉరిశిక్ష పడివుండాలి. అట్లా అర్థం చెప్పుకోవడానికి కవితలో ఎక్కడా" " కామాలు లేవు. కాబట్టి పాఠకుడు కొంత తికమకపడే అవకాశంవుంది.

త్రిపురనేని మరోకవిత "పీడు". అహంభావి అభివృద్ధి నిరోధకుడూ అయిన, మధ్యతరగతి విద్యావంతుని గురించి రాసింది. పరోక్షంగా, ప్రిజావ్యతిరేకవిధానానికి పాల్పడే 'పీడు'లాంటి బుద్ధిమంతులు మనకు అడుగడుగునా తారసపడుతుంటారు. అడ్డుపుల్లలు వేస్తుంటారు. కాని ప్రిజల పక్షంలో చేరరు. దోపిడీవర్గం వీరిని ఎప్పటికీ క్షమించదని అంత తొందరగా తెలుసుకోలేరు.

"ఆశయ పోరాటంలో రాలిపోయినా
వృథాకాదు జీవితం
విప్లవ బాధ్యతతో కరిగిపోవటం
చావు అనిపించుకోదు–"
"ఒంటినిండా అగ్ని పూసుకు చెపుతున్నా
ఈ యుగం సాయుధరూపంలోనే విప్లవిస్తుంది"

ఈ నమ్మిక, ఈ విశ్వాసం, ఈ సత్యం జీవితాన్ని విస్తరింపజేస్తుంది. త్యాగాలకు సిద్ధం చేస్తుంది. త్రిపురనేని ఈ బలమైన పాదాలు నిజంగా మార్గదర్శకమైనవి."

కె. రాజారెడ్డి–(2):– 'ప్రిభాతకిరణాల్లో' "ప్రిజలు పార్టీకోసం కాని, పార్టీ ప్రిజలకోసం కాద"నే ధోరణిలో వ్యవహరిస్తున్న బోర్డు కమ్యూనిస్టు పార్టీల రాజకీయ పతనాన్ని చెప్పుతున్నారు. అతని "సాయుధ చైతన్య తుఫాను" మరోకవిత, భావస్ఫూర్తితో కళావిలువలు సంతరించుకుంది, తెలిసీ తెలియని, సాహసంలేని అజ్ఞానపు తాళ్లు ఆచరణలో తెగుతున్నాయంటున్నారు. "కాలం కాలిన భోగవాసనలు"భావుకతకు చక్కటి ఉదాహరణ.

అతనే చెప్పినట్లు సామరస్యవాదులకు పూటగడవటమే కావాలి. భవిష్యత్తుమీద నమ్మకం తక్కువ. కాబట్టే "విప్లవ సూర్యోదయ ప్రభాతకిరణాలు వారికికనిపించవు"

రాంచందర్–(4):–

"కవి కలం నుండి జారిన ప్రతి అక్షరమూ
ప్రగతివీరుని తనువునుండి కారిన ప్రతి నెత్తురుబొట్టు
విప్లవ మహోద్యమ విద్యుత్తును
జాతి నరనరాల్లో నింపుతాయి"
"మాపై గురిపెట్టబడిన ప్రతి తుపాకీ
ఎదురు తిరిగి
నీపై బుల్లెట్ల వర్షాన్ని కురిపిస్తుంది"

'రక్తాక్షరాలు'లో రాంచందర్. విప్లవ పోరాటాల్లో ఏం జరుగుతుందో పై పాదాలు హెచ్చరిస్తున్నాయి. శ్రామికులమీద దోపిడీవర్గం అన్నిరకాల నిర్బంధాల్ని ప్రయోగిస్తుంది. తన అస్తిత్వం కోసం జరిపే ప్రతి హింసాత్మకచర్య. ప్రతిహింసకు ప్రజల్ని పురికొల్పుతుంది. వర్గపోరాటం అక్కడే కొత్తమలుపు తీసుకుంటుంది. చారిత్రిక యథార్థాన్ని స్పష్టంచేస్తూ 'నీతోనేను' అంటున్నాడు రాంచందర్.

హనీఫ్–(4):–

సిద్ధాంత పరిజ్ఞానమే చాలదు. జీవితం తెలిసివుండాలి. పుస్తకాల్లోంచి మాట్లాడ్డంకాదు. జీవితంలోంచి మాట్లాడాలి. కొట్టు, నరుకు, చంపు. తిట్టు, ఉరుకు, రక్తం. విప్లవం ఇవేవీ రాకుండా రాయడమే కష్టం. కలం పట్టుకుంటే చాల మంది అలాగే రాస్తున్నారు. అంతర్లీనంగా ఆ ధ్వని విద్యుత్తులా కొనసాగాలి. వ్యాఖ్యానాలు చేసి, చారిత్రిక సత్యాలు అప్పజెప్పడంకాదు. వర్తమాన సామాజిక జీవితాన్ని కళ్లకు కట్టినట్లు కళాత్మకంగా చిత్రించాలి. జీవితానికి దూరంగావుండే రచన పొడిపొడిమాటల్తోనూ, కాకుంటే శబ్దాడంబరంతోనూ తేలిపోతూ వుంటుంది. తడిలేని రచన గులకరాళ్ళమీది బండి ప్రయాణం లాంటిదే

హనీఫ్ కవితల్లో మనం జీవితాన్ని చూస్తాం. "స్తంభానికి అనుకుని ముఖాన్ని చేతుల్లో దించుకుని ఏడుస్తున్న మనుషుల్ని" చూస్తాం. ముళ్ళతుప్పల్ని నరికినగొడ్డలిని, పంటచేలనుకోసే కొడవలిని ఆయుధాలు చేసుకొని పోరాటం సాగిస్తున్న విప్లవకారుల్ని చూస్తాం. సందేహంలేదు–

"కదిలిన నీ కాళ్ళకు తోడుగా
కోట్లాది కాళ్లు కదిలొస్తాయి

పిలిచిన నీ పిలుపుకు బదులుగా
కోట్లాది కంఠాలు కలిసొస్తాయి"

సంవర్త-(4):- 'మానవత'లో సంవర్త తక్షణకర్తవ్యం సూచిస్తున్నారు.

"మన ఓర్పే మన శత్రివు
మన సహనమే మనపాలిట శత్రివు
బరితెగించి తిరగబడితే తప్ప
బతుకు మార్గంలేదు బతుకు లేదు
మీ నాగళ్లు దున్నాల్సింది బంజరు భూముల్నికాదు
ప్రజా వంచకుల వర్గాల్ని
మీ కొడవళ్లు కోయాల్సింది పైరుపచ్చల్ని కాదు
ప్రజా శత్రివుల కుత్తుకల్ని
మీ గొడ్డళ్లు నరకాల్సింది చేవపట్టిన కర్రల్ని కాదు
స్వార్థమెక్కిన తలల్ని
మీ సుత్తెలు కొట్టాల్సింది బండరాళ్ళని కాదు
కామందుల కోరల్ని—

సాయుధ కవిత్వానికి ఇది మచ్చుతునక. ఇతని నాలుగు కవితల్లో 'మానవత' మెరుగు ఈమధ్య వస్తున్న కవిత్వం అంతా ఒక మూసలో పోసినట్టుగా వుంటుందని గ్రహిస్తే, మిగిలిన మూడు కవితలు అందుకు భిన్నమైనవేమీగావు. విప్లవకవులు ఈ గానుగెద్దు గాడినుండి బయటపడటం చాల అవసరం.

భూమన్-(4):-

"అపజయం విజయానికి తల్లి
మొండిగ ముందుకు పోవటంకన్నా
అవగాహన అనుసంధానించుకోవటం మిన్న"

అంటూ కుహనా రాజకీయ వాదులపైన, ప్రజా నాయకులుగా చెలామణి అవుతున్న దొంగలపైన, దోపిడీ వర్గంపైన సాయుధ కవితాధ్వజం ఎత్తుతూ గుండెల్లో డైనమైట్లు పేలాలి అని రెడ్ డేగీతం వినిపిస్తున్నాడు భూమన్.

కాని "సమ్మెలు-హర్తాళ్లు, ధరణాలు- ఉక్కుటోపీలు- అల్లర్లు-కర్ఫ్యూలు- అలజడి- ఆందోళన- గందరగోళం- దారంతా నెత్తురు పరుగులు. అణచేశాం- అధికారం వెర్రితలలు"

ఇదంతా ఏమిటో. ఎవరు ఎవర్ని అణచేశారో స్పష్టంగా లేదు. విప్లవ పోరాటాల్లో ముందువరసన వించునే(కార్మికులు–కర్షకులు)వారిని దృష్టిలో పెట్టుకొని రాస్తే మరింత సులభగ్రాహ్యంగా, మరోలా వుంటుంది కవిత.

జ్యోతి –(3) :– అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమంలో పీడిత జనతా నేత్రింగా జనచైనా విప్లవ కేంద్రంగావుంది. అయితే విప్లవం ఎగుమతిచేసే పదార్థం కాదు. ఏదేశానికాదేశమే సుదీర్ఘసాయుధ పోరాటాల ద్వారా విముక్తమవుతుంది. ఆయాదేశాల్లోని ప్రజలు తమ సమస్త శక్తుల్ని తమ పోరాటాలకు ధారపోస్తారు. త్యాగాలు చేస్తారు. అంతిమ విజయం సిద్ధించేవరకు విశ్రమించరు.

జ్యోతి రాసిన 'విప్లవ కేంద్రం' లో ఇలావుంది.

"ప్రగతి వీరులు
కత్తులూ
కలాలూ
సమస్త ఆయుధాలూ
విప్లవానికి అంకితం చేశారు"

బాగానేవుంది. కానీ, అదే వరసలో–

"ప్రపంచ విప్లవ కేంద్రానికి
సమస్త శక్తిని త్యాగంచేసి
రేవటి సమతకు
ఇవ్వాల్టి యువతరం
విప్లవ ద్వారం తెరిచింది"

అన్నప్పుడు కవిభావమేమిటో బోధపడదు. ప్రపంచ విప్లవ కేంద్రానికి సమస్త శక్తిని త్యాగం చేయడం అనే అవగాహన అసంబద్ధంగానూ అర్థ రహితంగానూ వుంది. కవి 'విప్లవ కేంద్రంగా' దేన్ని వూహించారో తెలియరాస్తే బావుండేది.

కాపలా గూర్ఖా, కార్ఖానా పనిమనిషి తమ కష్టాలకు కారణాలు కనుక్కోక పోవడం వారి తప్పుకాదు. ఆ చైతన్యం ఇవ్వని నాయకులది, పార్టీలది. ఇపుడిపుడే మేల్కొంటున్న ప్రజ–

జ్యోతి అంటున్నట్లు
"నా జాతి అగ్ని అలల్లా లేస్తోంది"

అత్తలూరి నరసింహారావు– (3) :– ప్రపంచ వ్యాప్తంగా అణచబడ్డ శక్తి ఆయుధాల

రెక్కలు ధరించి, ఉక్కు ముసుగుల్ని చీలుస్తూ, దోపిడి గుండెల్ని పేలుస్తూ, విప్లవ శక్తుల్ని పిలుస్తూ, ముందుకు మును ముందుకు లావాలా విద్యుత్తులా సూర్యకిరణంలా ప్రపంచంలోకి ప్రవహిస్తుందంటున్నారు.

నరసింహారావు కదులుతున్న విప్లవాన్ని చూస్తున్నారు. సుదీర్ఘ పోరాటంలో బాట పీడేది లేదని సమసంఘం వచ్చేవరకు విల్లు ఎక్కు పెడతూనే వుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నారు.

ప్రజల ప్రతిజ్ఞే కవి ప్రతిజ్ఞ.

టి. సుభాష్– (4) :– ఇతను సంకలనకర్త. "నక్షత్రాలు"లో వీరు 'రాలుతున్న ఆకులు కొమ్మలను వదులుతున్న చప్పుడు" వింటున్నారు. నక్షత్రాలు చరిత్రను అనాదిగా వీక్షిస్తున్నాయి. వాటి పని అంతవరకే.

"అభిసారిక ఆలింగనం కోసం
పరిపరి విధాల పరితపిస్తున్న
పెట్టుబడిదారీ విటుడు
విరహాగ్నిని సహించలేక
ఆలస్య నరకాన్ని భరించలేక
నీలాల నింగిలోకి చూస్తే
భయపెడుతూ కనిపించేవి
ఈ నక్షత్రాలే—" అంటున్నారు'

నక్షత్రాల నమ్మకాల్ని, దేవుని భావనను, కర్మ సిద్ధాంతాన్ని వర్గ ప్రయోజనాలకు కవచంగా వాడుకునేది దోపిడీవర్గం. వారు ఆ భావాల పోషకులు. మతం పిచ్చి, దైవ భక్తి టన్నుల కొద్ది వుండేది వారిలోనే.

పై పాదాలు నీలాల నింగిలోకి చూసే ఆలస్య నరకాన్ని భరించలేని విరహ జీవికి మద్ధతునిస్తున్నాయి. నక్షత్రాలు వారిని భయపెడతాయనడం భావ కవిత్వపు వెర్రి ఆలోచనలు. విప్లవ కవితా సంకలనాన్ని కించపరిచే అవగాహన. నక్షత్రాలకే (వారు నమ్మేవాటికయినా) భయపడే నిజాయతే ఆ వర్గంలోవుంటే చరిత్ర మరోలా వుండేది.

కవి విటుల్ని వర్గీకరించడం ఆశ్చర్యంగా వుంది. పెట్టుబడిదారు విటుడట. అంటే వర్గ రహిత సమాజంలోకూడా వ్యభిచారులూ, విటులూ వుంటారన్నమాట. దోపిడి, లంచం, నిరుద్యోగం, దారిద్ర్యం, విశృంఖలత్వం, అరాచకత్వం, హత్యలు వ్యభిచారం, విటులు, తార్పుడాలు, తాగితూలడాలు, మనుషుల్ని అమ్మడాలు,

భోగలాలసత్వం అన్నీను బూర్జువా సమాజపు అవలక్షణాలుగా గుర్తించినంత మాత్రాన సరిపోదు. వర్గ దృక్పథం విడవకుండా కవితల్లో చూపించాలి.

మౌనంగా మింట మెరుస్తూ, ఎవరినో భయపెడతాయనుకునే నక్షత్రాలుగాదు, సమాజాన్ని మార్చే మానవ నక్షత్రాలు కావాలి. నేలవిడిచినసాము చేయడం పలాయన వాదమే.

అనంత – (2) :– తనకు ఎదురొచ్చిన విప్లవ వీరుల్ని ఎవరు "మీరు" అని ప్రశ్నిస్తూ శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలు అర్పించిన విప్లవ కారుల్ని కీర్తిస్తూ మీరు వారి వారసులా అంటున్నాడు అనంత.

పోరాటంలో వందలాది వేలాది కామ్రేడ్స్ రక్త తర్పణం చేస్తారు. కొందరే చరిత్రకెక్కుతారు. కవి వీరకీర్తనకు కలం ఎత్తాడంటే మిగిలిన వారికి ప్రేరణశక్తిని అందివ్వడమే. ఈ కవితలో అది లోపించింది. 'రండి నాపూరింటికి. కలోగంజో తాగి వెళ్లండి' అనే ధోరణిలో ఆహ్వానించడమో ఏకత్వాన్ని వ్యక్తీకరించడమో చేస్తే ఆ కవితకు పరిపూర్ణత్వం చేకూరేది.

జైరామ్–(3):– నేటి చైతన్యం సాయుధపోరాటం. యువతరం ఆ భారాన్ని చిరునవ్వుల్తో మోస్తూ కొండల్లో కోనల్లో జ్వలిస్తూంది. ఆశయం ఆహారంగా, పోరాటం ఆనందంగా ఆక్రాంతితరం మహాసముద్ర తరంగఘోషతో విప్లవిస్తుంది. మన స్ఫూర్తిగా ప్రజాపోరాటాల్ని బలపరుస్తూ 'రండి' చైతన్యతరం పిలుస్తోంది అంటున్నాడు జైరాం.

జలపాత వేగంతో, గుండెల్ని చీల్చుకొని కరుణరసాత్మకంగా సాగిన కవిత 'జోహారు కామ్రేడ్స్' చాల చక్కటి గేయం.

స్థూలంగా కొన్ని కవితల్ని చూసాం.

'విప్లవం వర్ధిల్లాలి' చదివితే రెండు విషయాలు స్పష్టమవుతాయి.

1. కవులందరికీ మార్క్సిస్టు సిద్ధాంత పరిజ్ఞానం వుంది. సామాజికస్పృహతో పాటు లక్ష్యంపట్ల గురివుంది.

2. ఏడెనిమిది కవితలు తప్పిస్తే, అన్నికవితలూ ఒక్కలాగేవున్నాయి వైవిధ్యం కొరవడింది. పదాలపులుముడునుంచి, సాగదీసేతనం నుంచి బయటపడాలి. ఇవ్వాల్టి కవిత్వం యీ తీరులో కొనసాగితే వెగటుపుట్టించే ప్రమాదం వుంది. నాకు చాలా కవితల్లో జీవం కనిపించలేదు. లోపం లోతైన పోరాటానుభవం, గాఢమైన తపన, స్పందన, అభివ్యక్తి లేకపోవడంలోవుంది.

"విప్లవ కవిత్వం ఎలావుండాలి" అని 'లే'కి కూడా ముందుమాట రాసిన త్రిపుర నేని కొన్ని మాటల్ని యిక్కడ ఉదాహరించడం అసమంజసం కాదనుకుంటాను. "ఎవరిని గురించి రాస్తున్నామో తెలియక, ఎవరు చదువుతారో వాళ్ళను గురించి తెలియకచేసే రచన నేలవిడిచినసాము అవుతుంది. ప్రజా జీవనానికి దూరంగా వుండడం వల్ల రచయితలకు ప్రజలభాష రావటం లేదు. వ్యవహార పదబంధాలకి దూరమైన శబ్దాల పటాటోపం బూర్జువా రచనే అవుతుంది"

మనలో ఎంతమంది పై వ్యాఖ్యానానికి జవాబుగా నిలబడగలమో, గుండెల మీద చేయివేసుకొని ఆలోచించాలి.

నాకింకో విషయంకూడా గుర్తుకు వస్తూంది. అది చెప్పి సమీక్షను ముగిస్తాను.

అప్పటికి విప్లవరచయితల సంఘం ఏర్పడలేదు. సృజన త్రైమాసిక పత్రికగా వుంది. విప్లవ సాహితీ శక్తుల సమన్వయం కోసం తీవ్రమైన కృషి జరుగుతోంది. మే 70 సృజన(15)సంచికలో "తిరుగబడుకవుల్ని" సమీక్షిస్తూ శ్రీ కె. కృష్ణమూర్తి ఈ క్రింది విధంగా రాసారు.

"పీడిత ప్రజలకొరకు వ్రాయబడిన ఈ కవితలు ఈవర్గాలకు చేరతాయా? అన్న అంశాన్ని లోతుగా పరిశీలించాల్సివుంది. ఈ పరిశీలన వీరికి మాత్రమే పరిమితంకాదు. విప్లవ పోరాటాలను, భావాలను బలపరుస్తూ నేడు వస్తున్న కవితలన్నింటిలోనూ ఒక లక్షణం కనిపిస్తున్నది. అది యీ కవితలు ప్రధానంగా పీడితవర్గాల గురించి వ్రాయబడ్డాయి. సరిగ్గా యీ వర్గాలకే కవితలు చేరవు. కనీసం సాధారణ రాజకీయ కార్యకర్తలకైనా అవి చేరవు. ఈ కవితలను ప్రజలకు ఎవరో చదివిపెట్టినప్పటికీ, ఆ కవితల్లోని భావాల నర్థంచేసుకొనడానికి ప్రజల సాధారణభాషా పరిజ్ఞానం చాలదు. అందితే అవి ప్రజలకు ఆకర్షణీయమైన రూపంలో (Form) వుండవు. ఇది నేడు విప్లవ సాహిత్యానికి-- ప్రజలకూ మధ్యనున్న ప్రధాన వైరుధ్యం. ఈ అంశాన్ని ఆత్మ పరిశీలనా దృక్పథంతో పరిశీలించడం విప్లవకవుల కర్తవ్యం."

— చెరబండరాజు

విప్లవం వర్ధిల్లాలి — కవితా సంకలనం
సంకలనకర్త — శ్రీ టి. సుభాష్

ప్రచురణ — విప్లవ సాహితి, తిరుపతి
వెల — రూ. 1—50
ప్రతులకు — శ్రీ బాలాజీ పబ్లిషర్స్, 81, బాజార్ స్ట్రీట్, తిరుపతి.

(గత సంచిక తరువాయి)



ఇంతవరకు జరిగినకథ

'యువాన్‌మావో'అనే గ్రామానికి భూసంస్కరణ కార్యకర్తలు పదిహేనుమంది వచ్చేరు. వాళ్ళ నాయకుడు సియావో. వాళ్లువచ్చేరని-లేనివాళ్లు పండుగ చేసుకుంటే ఉన్నవాళ్ళు వాళ్లనెలా మట్టుపెట్టాలాఅని మంతనాలు జరిపేరు. ఇళ్లల్లోని డబ్బు, నగలు, సామాను, పట్నం తరలించేరు.

ఆ గ్రామంలో ఏ కార్యక్రమం మొదట చేపట్టాలె అనే సమస్య వచ్చి బహిరంగసభ పెట్టాలనుకున్నారు. సభ నిరర్థకం. పేదప్రజల దగ్గరికి వెళ్ళి, వాళ్ళలో చురుకైనవాళ్ళను కనిపెట్టి ఫిర్యాదులతోగట్టా సేకరించడం సరియైన పద్ధతి అని సభ విఫలం అవడంవల్ల అర్థంచేసుకున్నారు.

నిర్ణయంమేరకు సెక్షన్‌లీడర్ వాంగ్ వూళ్ళోకి బయల్దేరాడు. 'మొండి మొల లిన్'గా పిలువబడే చావో యు-లిన్‌ను కలిసాడు. లిన్ హాన్ అనే భూస్వామి చేతుల్లో యమయాతనలు అనుభవించిన నిరుపేద. హాన్ దౌర్జన్యాలగురించి లిన్‌నుంచి చాల వివరాలు రాబట్టాడు వాంగ్. వాని నోటితోనే ముందుగా పని పట్టవలసిన బుగతవాడేనని అనిపించాడు. నిరుపేదల విముక్తికి-పోరాటం తప్ప మరోమార్గం ఎందుకులేదో వివరంగా చెప్పాడు. ఆ యిద్దరూ కలిపి తెల్లవారి మరికొంతమందిని కలవడానికి వెళ్ళారు.

ఇంతవరకు వచ్చిన పాత్రల పరిచయము

"తెల్లమేక"— హాన్ ఏజెంటు

'చావో'— పూర్తిపేరు చావో యు-లిన్. పేద రైతు. పూర్వం ఇతన్ని 'మొండి మొల లిన్' అనేవారు.

లీ చింగ్-షాన్ — హాన్‌గారి అంగరక్షకుడు,

5

ఊళ్ళో బీదా బిక్కీని కలుసుకోడానికని స్కూలునించి బయల్దేరేడు సియావో. నాలుగడుగులు వేసేడోలేదో రోడ్డుపక్క నూతిగట్టుమీద నీళ్ల తోడుతూ నడివయస్కుడొకడు కనిపించేడు. సియావోని చూసి చిన్న నవ్వు నవ్వేడతను. సియవోకూడా నవ్వుతూ అతన్ని పలకరించేడు.

ఆ గ్రామీణుణ్ణి కొంచెం తేరిపారచూసేడు సియావో. అతని వంటిమీది చొక్కా బాగా చిరిగి పోయింది. చొక్కా చిరుగుల్లోంచి అతని భుజాలూ, చేతులూ కనిపిస్తున్నాయి. ఉక్కు కమ్మీల్లాంటి అతని చేతులూ, కండలు తిరిగిన అతని దండలూ చూడగానే— ఇతను కష్టజీవి— అనిపిస్తుంది ఎవరికైనా. సియావోకి కూడా అదే అనిపించింది. అలా అనుకొంటూనే అతనివైపు నడిచేడు.

"నీ పేరేంటయ్యా?" అడిగేడు సియావో.

"నా పేరు లియూ[1] బాబూ!" అని, మళ్ళీ చిన్ననవ్వు నవ్వేడతను. "మాయింటికోసారి వొస్తారా, బాబూ!" అని సియావోని అడిగేడు. నీళ్ళు తోడుకోడం అయిపోయేక, కావడి భుజంమీద వేసుకొని బయల్దేరేడతను. అతని వెనకే సియావో నడవసాగేడు.

"కామ్రేడ్ బాబూ, నాకు 'కామ్రేడ్' అని పిలిపించుకునీవోళ్లంటె శానా యిష్టం బాబూ!" అన్నాడు లియూ. భుజంమీద కావడి బరువుతోనే, గబగబ అడుగులు వేస్తున్నాడతను. "బందిపోటోళ్ళని తరింపీడానికి మన సైన్యం[2] అమద్దిని వొచ్చింది గదా బాబూ! అళ్ళలో కొందరు మాయింటికాడే వుండీవోరు. ప్రతిరోజూ మావకుగాల్సిన నీళ్లూ గీళ్లూ మోసీవోరు. పొయ్యిలోకి కర్రిలూ గిర్రిలూ కొట్టీవోరు. ఈధి వోకిలీ పెరడూ అంతా శక్కగా తుడిసి సుబ్రం సేసేవోరు..... నిన్న బలే తమాసా జరిగింది బాబూ! నిన్న మీరంతా వూర్లోకి వొచ్చినారుగదా! ఆ సంగతి యిని, మా పొరుగింటావిడ అళ్ళకోడిపెట్టని తీసికెళ్ళి పెట్టిలో పెట్టి దాశేసింది. అదేం కర్మంవో, పెట్టిలోనే గుడ్డెట్టేసిందాపెట్ట! గుడ్డెట్టి వల్లకుందా? పదిమందికీ తెలిసీలాగ గోల గోల సేసీసింది! దాంతో మా పొరుగమ్మకి ఒగటే గాబరా! అప్పుడు నానన్నానూ,

---

1. ఇతని పూర్తి పేరు లియూ తె-షాన్. భూసంస్కరణ కార్యకర్తలలో మరో లియూ వున్నాడు. అతను వేరు, ఇతను వేరు. (అను)
2. Third Bataltion of the United Democratic Army.

"ఒక్క నిమిషం వుండమ్మా తల్లీ. నాను బయటికెళ్లి అసలు సంగతేటో, సందర్భం వేటో కనుక్కునొస్తానూ"అని ఈధిలోకి పరిగెత్తెళ్ళి మళ్లీ ఎంటనే తిరిగొచ్చి. "దీలమ్మో! బేగి నంపీ తల్లో! నీ కోడి పెట్టని బేగి నంపీసి. బేది తిని తల్లో। సిపాయీలు వొస్తన్నారు. లాక్కుపోతారు తల్లో!!"అని అరిసినాను. పాపం, ఎర్రిముండ కూతురు నా మాట నమ్మీసింది. నమ్మీసి ఎంటనే పెట్టని నంపనందుకి కత్తె తీసింద. అప్పుడు మళ్లీ సెప్పేను: "ఎర్రిదానా! వుత్తినే పరాశికాని కలాగన్నానూ. ఇప్పుడొచ్చిన సిపాయీలు శాంగ్ కే-షేక్ గాడి మనుసులుకారూ. ఈళ్లు కిమ్యూనిష్టులూ. శాలా మంచోళ్ళు. నీ కోడిపెట్టనేం ఎత్తుకపోర్నే"అని సెప్పేను."

లియూ చెప్తున్నదంతా శ్రద్ధగా వింటున్నాడు సియావో. 'ఇతను మంచివాడి లాగే కనిపిస్తున్నాడు. కాని ఇంకా మరికొన్ని విషయాలు తెలుసుకోవాలి'అనుకొన్నాడు.

మాటల్లోనే అతని ఇంటికి చేరేరిద్దరూ. లియూది పెంకుటిల్లు నాలుగయిదు గదులున్నట్టున్నాయి. గుర్రాల కోసం ప్రత్యేకంగా కట్టించిన సాలవుంది. దాన్లో బాగా బలసిన గుర్రాలు మూడున్నాయి. ఇల్లు ఇంకా పెంచుతున్నట్టున్నారు: ఉత్తర భాగమంతా కొత్తగా కట్టినట్టు కనిపిస్తోంది. తూర్పు భాగంలో కిటికీలకి అద్దాలతలుపు లున్నాయి.

అదంతా చూసేక, అతను మధ్యతరగతి రైతయి వుంటాడనిపించిందిసియావోకి ఇప్పుడు ఈ ఇంట్లోకి వెళ్ళాలా, వద్దా అన్న సందేహం వచ్చింది.... తను పేద రైతుల్తోనూ, రైతుకూలీల్తోనూ పరిచయం చేసుకోడానికని బయల్దేరేడు. ఇతను చూస్తే కొంచెం కలిగిన వాడిలాగ కనిపిస్తున్నాడు. కాని తీరా ఇక్కడిదాకావచ్చేక వెళ్ళిపోతే బాగుండదు. అయినా ఇతన్తో కొంత సేపు మాటాడితే వచ్చేనష్టం ఏమీలేదు. ఆమాట కొస్తే సమాజంలోని అన్ని తరగతుల మనుషుల్ని గురించీ మనం తెలుసుకోవాలి ...

అలా అనుకున్నాక లియూ ఇంట్లోకి వెళ్ళేడు సియావో. కాంగుమీదకూచుని, ఓ సిగరెట్టు వెలిగించేడు. లియూ లోపలికివెళ్ళి, వేడివేడి టీ, ఇన్ని రేగుపళ్ళు పట్టుకొచ్చి సియావోని తీసుకోమన్నాడు. సియావోకన్న ముందు అతనే మాటాడసాగేడు. ఎదుటి మనిషి ముఖప్రీతి కోసం మాటాడుతున్నాడతను. మాటాడుతూ మాటాడుతూ సియావో కళ్ళలోకి చూస్తాడు. కొంచెం ఇబ్బందిగా వున్నట్టు ముఖం కనిపిస్తే, వెంటనే మాట మారుస్తాడు. సియావో మాటాడుతున్నంతసేపూ "అవును బాబూ! అంతే! అవునవును, అలాగే। ఆ సంగతి ఏరే శెప్పాలా?"అంటూ తందాన తాన పాడతాడే తప్ప మరొకమాట మాటాడడు.

ఖాలంపనులేవైనా అవలీలగా చెయ్యగలడు లియూ. మొదట్లో అతనూ పేదవాడే. కాని జపాన్‌వాళ్లు లొంగిపోయేక, వాళ్లు వదిలిపోయిన సరుకూ సప్పరా తెచ్చుకుందికి గుర్రాలూ, బళ్ళూ వున్నవాళ్ళంతా వెళ్లేరు. లియూ కూడా తన బండిమీద అక్కడికి వెళ్ళేడు. అతని అదృష్టం బావుంది బట్టలు, ధాన్యం, గిన్నెలు, కంచాలు చాలా సామాన్లు దొరికేయి. అంత దూరంనించీ* వాటిని జాగ్రత్తగా ఇంటికి తెచ్చుకొన్నాడతను. సామాన్లు వున్నచోటే ఓ డజను తుపాకులుకూడా అతనికి కనిపించేయి. కాని వాటిని తీసుకోడానికతనికి ధైర్యం చాలలేదు.

అయితే లియూకి ఆ అదృష్టం ఎన్నాళ్లో నిలవలేదు మరికొన్ని రోజుల్లోనే హాన్‌గారి కన్ను అతనిమీద పడింది 'జపాన్‌వాళ్ళ తుపాకులు నీ దగ్గిర వున్నాయి'- అన్న మిషపెట్టి, అతను తెచ్చుకొన్న సరుకులన్నీ లాక్కున్నాడు హాన్. ఆఖరికి ఒక్కటంటే ఒక్క కోటుమాత్రం మిగిలింది లియూకి. అసలు అది కూడా మిగలకపోను. కాని అప్పటికే ఆ కోటు రంగూ సైజూ మార్చుకున్నాడతను. మొత్తానికి హాన్ మీద పీకల్దాకా వుంది లియూకి. పైకి మాత్రం ఏమీ అనలేదు. ఎటుతిరిగి ఎటువస్తే ఏమవుతుందోనన్న భయం అతనికి ఎక్కువగా వుంది.

భూసంస్కరణ కార్యకర్తలు ఆవూరికి వచ్చినందుకు అతనికి సంతోషంగానే వుంది. ఈ దెబ్బతో హాన్‌గాడి పని అయిపోతుందనుకొన్నాడతను. దెబ్బతినేది మరొకడయితే ఫరవాలేదు. కాని మరి తనకీ కొద్దో గొప్పో ఆస్తి వుందికదా? వీళ్ళు అసలే కమ్యూనిస్టులు. తనకివున్న మూడు గుర్రాల్నీ, ఎనిమిదెకరాల్నీ లాక్కుంటారో ఏంవిటో? ఏమో, చెప్పలేం. లాక్కోకపోవచ్చు. వీళ్ళ అసలు శత్రువు హానేకదా! తనలాంటి చిన్న బుగతల్ని ఏమీ చెయ్యకపోవచ్చు. అదీ కచ్చితంగా చెప్పలేం. ఏంవైనా చేసినా చెయ్యొచ్చు.... అలా ఆలోచించి ఆలోచించి తెల్లవార్లూ మేలుకొని, అఖరికి ఒక నిర్ణయానికి వచ్చేడు లియూ. 'నొప్పింపక తానొవ్వక తప్పించుకుతిరగ'డమే మంచిదనిపించిందతనికి ... చూద్దాం. గాలివాటం ఎటుంటుందో! దాన్ని బట్టి మనం ఎటువేపు వుండాలన్నది అప్పుడే నిశ్చయించుకోవచ్చు.

లియూతో మాటాడ్డంవల్ల పెద్దగా ప్రయోజనం ఏదీ లేదనిపించింది సియాహోకి. మధ్యాహ్నానికల్లా స్కూలుకి తిరిగి వచ్చేసేడు. అప్పటికింకా ఎవ్వరూ రాలేదు. జేబులోంచి ఓ చిన్న పుస్తకం తీసుకొని అందులో ఇలా రాసుకొన్నాడతను:

---

* Japanese reclamation area నించి

"లియూ తె–షాన్ : మధ్యవయస్కుడు. కాస్త కలిగిన కుటుంబం. మధ్య తరగతి రైతు. మనిషిలో కొంత వూగిసలాట వుంది. కాని ఫరవాలేదు"

ఇలా ఇంకా రాయడం పూర్తిచేసి, పుస్తకాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడో లేదో– ఎవరో కొత్తమనిషి అక్కడ హఠాత్తుగా ప్రత్యక్షమయేడు. సియావోనిచూడ గానే, కొంచెం ముందుకివంగి,

"సియావోగోరున్నారా?" అని అడిగేడు.

అతన్ని తీక్షణంగా చూసేడు సియావో. ఆ మనిషి బలంగా ఎత్తుగావున్నాడు. మధ్యపాపిడ తీసి దువ్విన అతని తల వికృతంగా కనిపిస్తోంది. కనుబొమలు దుబ్బుల్లాగ పెరిగిపోయి. గొంగళి పురుగులు తగిలించుకున్నట్టుంది. అతను వేసుకొన్న తెల్లకోటు అకస్దిలా లేదు.

"అవును. నేనే. ఏంకావాలి?" అన్నాడు సియావో.

అతను మరోసారి ముందుకి వంగి చేతిలోవున్న ఓ ఎర్రి కవరు సియావోకి అతదించేడు.

"నాపేరు లీ చింగ్-షాన్ బాబూ; మా బాబుగోరు తఁవకిది ఇమ్మన్నారు. రాత్రి భోజనానికి తఁవర్ని తప్పకండా దయశేయమన్నారు" అన్నాడతను.

ఆ కవరు అందుకొని అటూ ఇటూ తిప్పి చూసేడు సియావో. దానిమీద తన చిరునామా జపాన్‌వాళ్ళ పద్ధతిలో రాసివుంది. కవరులోపల ఎర్రిటి కాయితం వుంది. అది తీసి చదివేడు.

"తమ గౌరవార్ధము మా శక్తికొలది ఒక విందును ఏర్పాటు చేసితిమి. ఈదినం సాయంకాలము ఆరుగంటలకు తాము తప్పక విచ్చేయ వలసిందిగా ప్రార్థించుచున్నాను.

ఇట్లు,

హా న్"

ఒక మూలగా చిన్న అక్షరాలతో "స్థలం– నా పర్ణశాల" అనికూడా వుంది.

కవరుమీద వున్న చిరునామా మరోసారి చూసేడు సియావో. వెటకారంగా ఒక నవ్వు నవ్వి,

"ఆఖరికి మీ పిలుపులుకూడా జపాన్ పద్ధతే! సరేగాని ఇంకా ఎవరెవర్ని పిలుస్తున్నారు, మీ బాబుగారు?" అని అడిగేడు.

"మరెవుర్నీ లేదు బాబూ! ఒక్క సియావో బాబునే" అన్నాడు 'లీ', వేళ్ళతో కోటుబొత్తాం తిప్పుకుంటూ.

"ఓహో, అలాగా? పిండివంటలు ఏఁవిఁటేఁవిటి చేయిస్తున్నారుట?"

"తఁవలాంటోరు మావూరొచ్చినందుకు ఏదో కంటాలుపడి చేయిస్తాంగాని ఇలాంటి పల్లెటూళ్లో మంచి పిండివంటలు కావాలంటె మాతరిం దొరుకుతాయా బాబూ"!

"ఏఁవిటి నువ్వనేది?"

"అవును బాబూ, మా వూరి జనాల మేలుకోరి తఁవరిక్కరికొచ్చినారు. అందు గురించే మా బాబుగారు మాంచి సారా తఁవకిప్పిద్దాఁవనుకుంటున్నారు."

"మీ బాబుగారి దగ్గిర నువ్వు ఏం పని చేస్తూవుంటావు?"

"పనంటె బాబూ, ఏదో గొప్పులు తవ్వడం, పొలాలు దున్నడం– ఇయ్యే నా పన్లు."

ఛస్. ఎవణ్ణిరా మోసం చేద్దామనుకుంటున్నావ్? గొప్పులు తవ్వుకొనేవాడు– నీలాగ నలగనికోట్లు వేసుకుంటాడా, నీలాగ నంగనాచి మాటలు మాటాడతాడా?".... సియావోకి చాలా కోపం వచ్చింది చేతిలో కార్డుని ముక్కలు ముక్కలుగా చింపేసి, 'లీ'ముఖంమీద విసిరి కొట్టేడు. ఓముక్క అతని కంటిమీద తగిలినట్టుంది. ముఖ మంతా కందగడ్డలా చేసుకొన్నాడు 'లీ'. రెండడుగులు వెనక్కి వేసి, పిడికిళ్లు బిగించి సియావోతో యుద్ధానికి సిద్ధమయేడు.

అంతలో– "ఏరా, ఒళ్ళెలాగుంది? తన్నులు కావాలా?" అంటూ వచ్చేడు వాన్* ఓ చేతిలో తుపాకి పట్టుకొని మరోచెయ్యి 'లీ' గుండెలమీద పెట్టి, "పోరా, పో అవతలికి" అంటూ తోసేసేడు

'వాన్'ని చూసి జడుసుకొన్నాడు 'లీ'. "సరే, నేనెళ్తాను" అంటూ వెనక్కి తిరిగి దడదడ అడుగులు వేసుకొంటూ పోయేడు. వాణ్ణి గేటుదాకా సాగనంపి, "తొత్తు కొడకా! దమ్ములుంటే మళ్ళీరారా చెప్తాను నీపని" అన్నాడు 'వాన్'

సరిగ్గా అదేసమయానికి గుర్రాన్ని తీసుకొని నూతికి వెళ్తున్నాడు ఒల్డ్‌సన్.

"ఏటి బాబూ, ఎవరిమీదేటి అలాగగ్గిబుగ్గయి పోతన్నావు?" అన్నాడు వాన్‌తో. గబగబా వెళ్ళిపోతున్న 'లీ'ని చూపించి జరిగిన సంగతంతా చెప్పేడు 'వాన్'.తో

"ఏటీ, 'ఇందు'కి పిలిస్తే, రాఁవనీసినారా? అదేగాని నన్ను పిలిచుంటేనా, సంకలు గుద్దుకోని ఎలిపోదును" అన్నాడు బండివాడు.

---

* వాన్–సియావో అంగరక్షకుడు.

"వెళ్తావు. వెళ్ళవామరి. ఆ తిండితిన్నాక నీ నోరుమాత్రం బందయిపోతుంది" అన్నాడు వాన్.

"ఒల్లకోబాబూ, ఎందుకు బందయిపోద్ది? నీ నోరునీదే. కావాలంటె ఇప్పు కుంటావు; కాకపోతె మూసుకుంటాను. నన్నెవుడైన పిలిస్తే, నాను తప్పకండ ఎల్తాను. తిండి తిన్నాక మూతి తుడిసీసుకుని ఆళ్ళసంగతే మర్సిపోతాను."

"అలాగయితేసరే. ఈసారి ఎవడైనా మోతుబరి మా సియావోని భోజనానికి పిలిస్తే నిన్ను పంపమని చెప్తాన్లే. ఏమంటావు?"

"సరె సర్లేవయ్యా!"అంటూ కొంచెం దగ్గిరగావచ్చి, గొంతు తగ్గించి, "అంత కన్న ముందు సియావో బాబుతో సెప్తావూ, నిన్న రేతిరి వూరవతల గేటుకాడకుక్కలు మొరిగినాయీ, అంటే వూల్లో సరుకు ఎవరో అవతల సేరేస్తున్నారన్నమాటా– అని సెప్పు" అన్నాడు ఓల్సన్–

"ఎవరంటావు?"అన్నాడు 'వాన్'

"మరెవురు!" అంటూ హాన్ భవంతి బురుజుల వైపు చూపించి, మరో నిమిషానికల్లా గురాయిల్సి తోలుకొంటూ నూతివైపు వెళ్ళిపోయేడతను. (సశేషం)

Statement about ownership and other particulars about newspaper

SRJANA

1.	Place of publication	Warangal - 1
2.	Periodicity of its publication ...	Monthly
3.	Printer's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	Hanamkonda, Warangal - 2
4.	Publisher's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	(As above)
5.	Editor's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	(As above)
6.	Names and addresses of individuals who own the newspaper add partners or shareholders holding more than one percent of the total capital.	

I, Varavara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- *Varavara Rao,*
Publisher.

తెలంగాణ సాయుధపోరాట వాస్తవ గాధలు :

అగ్నికణం

రచయిత: పోటు సూర్యం

నిరంకుశ నైజాంకు, దేశముఖులకు, జోతేదార్లకు వారి వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ అంతటా విప్లవజ్వాలలు మిన్నుముట్టిన రోజులవి. అందులో నల్గొండజిల్లా విప్లవ కేంద్రము అనేక మంది విప్లవకారులు పోరాటంలో కురికింది ఈ జిల్లాలోనే. వందలమంది తమ ప్రాణాలను బలియిచ్చారు.

అట్టి విప్లవ సాంప్రదాయం గలదే వెలిదండ గ్రామం, యిది నల్గొండ జిల్లా, హుజూర్ నగర్ తాలూకాలోని ఒక పెద్దగ్రామం. రజాకార్లు, నైజాంపోలీసు, వారితో కుమ్మక్కైన యూనియన్ పోలీసు, జోతేదార్ల కిరాయి మూకలు గ్రామాన్ని రకరకాల చిత్రహింసల పాల్జేస్తున్నారు సామూహికంగా ప్రజలనరెస్టుచేసి 'సూర్యాపేట'జైలుకు తరలించారు.

తన గ్రామవాసుల్నందర్నీ అరెస్టుచేసి చిత్రహింసల పాల్జేయడం కళ్ళారా చూశాడొక కుర్రవాడు. తనప్పుడు అదేపట్టణంలో 'ఆరవ'తరగతి చదువుతున్నాడు. స్థానిక విద్యార్థులేర్పరచిన విప్లవ సంఘంలో తానొక సభ్యుడు. ప్రజలు తననిజూసి యేడ్వగా "ఈ దుర్మార్గపు చర్యలకు అంతం ఒకటుందని, అదే యిప్పుడు 'సంఘం' చేస్తున్నదనీ, ప్రజలు ధైర్యంగా ఉంటే యిట్టి క్రూరచర్యలను తిప్పికొట్ట వచ్చనీ, యిది వారికి క్రొత్తేమీకాదని" ఓదార్చాడు. తనకు ప్రజాశక్తిపై అంతులేని విశ్వాసముంది. అరెస్టులను సాగించి ప్రజాశక్తి నడ్డుకొనేశక్తి ప్రపంచంలో దేనికీలేదనే ప్రపంచచరిత్ర ఋజువుచేస్తుందని విన్నాడు. ఇంకేం, తానింకా జాగరణ చేయరాదు. ఈ దుర్మార్గపు చర్యలను ప్రతిఘటించి తీరాలి అంటే తానూ సంఘంలో జేరాలి, యువకిశోరం అంతటితో తన చదువుకు స్వస్తి చెప్పింది. వెంటనే గ్రామం వెళ్ళాడు. ప్రజలందరూ సంఘంలో చేరాలని, సంఘశక్తికి సాటియేమిటనిపాటాడు. తాను సంఘంలో చేరాడనే వార్త పోలీసు క్యాంపులకు వెళ్ళింది. వెంటనే యములవాళ్ళు తననరెస్టు చేశారు. ప్రజలంటే వారికిగల భయం వాళ్లను పిచ్చెత్తేటట్లు చేసింది. పిచ్చెక్కిన కోతి చేసే వెఱ్ఱిపనే యిది. పదిహేనేండ్ల కుర్రకుంక నరెస్టుచేశారంటే వాళ్ళ నేమనాలి. 'కాగితపు పులులనాలా ?'

అతడే సూర్యం. తండ్రి నరసయ్యగారు 100 ఎకరాల భూమిగల పెద్ద ఆసామి. కొడుకు నరెస్టుచేయగానే పోలీసు క్యాంపుకెళ్లాడు. వంద రూపాయిలిస్తా కొడుకు నొదిలిపెట్టమన్నాడు. కొడుకేమో తనకేమీ భయంలేదు. తన నొదిలించడానికి యెట్టి ప్రియత్నమూ చేయనవసరం లేదన్నాడు. చివరకాతండ్రి అన్నంతపనీ చేశాడు. కొడుకుని వదిలించుకున్నాడు.

బయట పడ్డదేతడవుగా సూర్యం దళంలో ప్రవేశించాడు. దళనాయకుడు, సభ్యులూ తననొద్దంటున్నారు. మాతో తిరుగలేవంటున్నారు. అయినా ఆ 'అగ్నికణం' వినలేదు. దళసభ్యుల నుద్దేశించి ఇలాఅన్నాడు "ఒకవంక ప్రిజల్నందర్నీ క్యాంపుల్లో పెట్టి కొడ్తుంటే చూసి యూరుకునే గాడిద సాహసం నావద్ద లేదు. నేను వహితం ప్రిపంచాగ్నికి సమిధనొక్కటినై పోదల్చాను. నా ప్రాణాలపై నాకు భయం లేదు. పోరాటంలోకి పోతే పోయేదేముంది. ప్రాణాలు తప్ప. అందుకే నేవెళ్లను."క్షమించి తనవింకా యేమనవద్దన్నాడు. దీంతో దళసభ్యులకూ ఉత్సాహం యినుమడించింది. దళంలోకి తీసుకున్నారు.

సూర్యునికి నల్గురక్కచెల్లెళ్లూ, నల్గురన్నదమ్ములూ ఉన్నారు. అమ్మా నాన్న అమ్మమ్మ వీరుగాక కుటుంబ సభ్యులు. సూర్యం దళంలోకి వెళ్ళాడని క్యాంపుకు తెల్సింది. యములవాళ్లూ వచ్చారు. తల్లిని బండబూతులు తిట్టారు. కొట్టారు. ఆ యమ్మ స్మృతితప్పి పడిపోయింది. సూర్యం తండ్రి నరసయ్యగార్కి మెడకురిటో శారు. ఇంక లాగటమే తరువరి 80 ఏండ్ల సూర్యం అమ్మమ్మ పోలీసు వాళ్ళ ప్రాధేయపడ్డది. "నా మనుమడెటుపోయాడో నా అల్లునికి ఎలా తెలుస్తుంది. దయచేసి ఉరితీయకండి. మీ కాళ్లు పట్టుకుంటా"అన్నది. అయినా పోలీసువాళ్ళకూ దయా దాక్షిణ్యాలకు అగర్భవైరం ప్రయోజనంశూన్యం. పైగా ముసలమ్మను తుపాకి మడమలతో బాదారు. పాపం ముసలి ప్రాణం నెత్తురుగక్కింది. కోపంతో "లంజకొడుకుల్లారా! మీరుచేసే దౌర్జన్యాలకు నా మనుమడు తగుసమాధానం చెబుతాడ్రా! మీరు ఏనాడో ఒక నాడు సర్వనాశనం అవుతార్రా!! అంటూ తాను స్పృహతప్పపడిపోయింది. "సూర్యాన్ని పట్టివ్వకపోతే మీ కుటుంబాన్ని పొంతం తుడిచిపేస్తాను. లంజాకొడుకా! కొడుకున్ని కంటం తెలుసుగానీ, బుద్ధి చెప్పడం దెలియాదారా!! వాన్నీ పట్టీయియ్యరా. గాడ్దీ! పీకేకష్టాల్ తప్పుతాయ్ ఇకిలించాడు పోలీసు సూపరింటెండెంటు తన మకిలపళ్ళ సందు లోంచి. ఎట్టకేలకు 1000 రూకలు తీసుకొని నరసయ్యగారి ఉరి తప్పించారు. ఇంట్లోయున్న సర్వసామాగ్రినీ చేతబావిలో వేసారు.

ఈ సంఘటన పిదప కుటుంబం యావత్తూ రహస్యంగా బతుకుతోంది. కొడుకుని పట్టివ్వలేదని నరసయ్యపై మరోసారి దాడిచేశారు యమదూతలు. గాంధీశిష్యులు ఈతూరి పోలీసువాండ్ల ననుసరించారు. నరసయ్యగుండెకు తుపాకీలు బారుచేయబడ్డాయి. మరుక్షణంలో గుండు వదలబడుతుంది. సూర్యం తమ్ముడు రామారావు పరుగెత్తుకొచ్చాడు ఆ సంఘటన జరుగు స్థలంలోకి. కాంగ్రెస్‌వాళ్ళ కాళ్లావేళ్లా బడ్డాడు. వారు బండబూతులు తిడ్తూ ఐదురోజుల్లోగా సూర్యాన్ని పట్టివ్వకపోతే మీ అయ్యప్రాణం రా! అన్నారు నరసయ్యను వదిలేశారు.

సూర్యం కొరకే తిరుగుతున్నాడు నర్సయ్య. ఎక్కడుంటాడు? యేమో? యెవరు చెబుతారు. అయినా తిరుగుతున్నాడు. ఎట్టకేలకు బోనకల్ స్టేషనులో కొడుకుని కల్సుకున్నాడు. ఏడ్చాడు. అయినా లాభం శూన్యం. "నేను కమ్యూనిష్టు పార్టీ అని యిలాకాలు పెట్టాను. మళ్ళి వెనుకకు తీయలేనాకాలును. ఎఱ్ఱ జెండాను ఎత్తి వేయలేను". అన్నాడు సూర్యం, తనదింకా మొండిపట్టు. తన నిర్ణయానికి తిరుగులేదు. తండ్రిని నిరాశలలుముకున్నాయి. తనింకా యేంజేయాలి? యేంజేస్తాడు? ప్రజలందరిమాదిరే తనూ-వెనుదిరిగాడు ఒంటరిగా.

తామిప్పుడు భద్రాచలం ఏరియాలో తిరుగుతున్నారు. కోయల ఇండ్లలో భోజనం. అదే ఏరియాలోని నెల్లిపాక గ్రామంలో సూర్యం అక్కయ్య ఉంటుంది. సూర్యం, దళం చురుకుగా తిరుగుతున్నారు. పోలీసుల గాలింపూ అధికమయింది. ఓ పొద్దు సూర్యం పోలీసు గాలింపులలో పట్టుబడ్డాడు. రెండేండ్లు కఠిన కారాగార శిక్ష విధించారు. సూర్యం అక్కయ్యను పోలీసులు నిర్బంధించి రహస్యాలు చెప్పవల్సిందిగా చిత్రహింసల పాల్జేశారు. అయినా ఆవిడ చలించలేదు ఒక్క ముక్కయినా చెప్పను పొమ్మన్నది. ఆ తరువాయి యేం జరుగుతుందో యెవరికి తెలియదు.

రోజులు గడుస్తున్నాయి. పోరాటం వివిధ ఏరియాలకు వ్యాపించింది, రోజురోజుకూ అలలలలుగా పోరాటం విజృంభిస్తోంది. తానేమో అరెస్టయ్యాడు. కాలం ఆగుతుందా మరి! రెండేళ్ళు గడిశాయి. సూర్యం వదిలిపెట్టబడ్డాడు. తాను కలలుగన్న సమతా సమాజం కోసం వెలిదండ ఏరియాలో తిరిగి ప్రచారాన్ని ప్రారంభించాడు. వెంటనే పోలీసులు వెంబడించగా అక్కడనుండి మాయమయ్యాడు.

పార్టీ కార్యక్రమం మీద 'రాయినిగూడెం' (అదే తాలూకా) వెళ్ళాడు. ప్రజాద్రోహులెక్కడయినా ఉంటారు. తాను ఆ గ్రామంలో ఉన్న సంగతి పోలీసులకు

తెలియజేశాడో ద్రోహి! ఇంకేముంది. పోలీసులు గ్రామాన్ని ముట్టడించారు. గ్రామం పక్కగల 'కంది' చేనులో సూర్యం పట్టుబడ్డాడు.

సూర్యం గుండెకు తుపాకులు గురిచేయబడ్డాయి. డిఎస్పీ సూర్యాన్నుద్దేశించి యిలా అన్నాడు. "సూర్యం! నీవింకా చిన్నవాడివి. నీవింకా అభివృద్ధికి రావల్సిన వాడవు. మీకు 100 ఎకరాలభూముంది. హాయిగా అనుభవించక యీ మురికి పెధవలకోసం, పేదోళ్ల పార్టీలో చేరావెందుకు. నీది అవర్గమేనా? అందుకే మనవర్గంలో చేరు. రహస్యాలు చెప్పేయ్".

మరోక్షణంలో డిఎస్పీ ముఖం ఉమ్మితో నిండింది.

థూ! నీచుడా!! పరమదుర్మార్గపు చర్యలనన్నింటిని అమలుపరచి వందలాది సంవత్సరాలు పేదవర్గాలను వెట్టిచాకిరీ చేయించుకొని, జలగల్లాగా ప్రజారక్తాన్ని సారాయిలా మార్చి పీల్చి మదించిన పెధవలకు గులాం చాకిరీచేస్తూ నన్నేనా ప్రశ్నిస్తున్నావు నా పార్టీని వల్లెత్తు మాటంటావికయినా నీకు హక్కులేదు" సూర్యం నోటినుంచి అగ్నికణాలు కురిశాయి.

ఇంకేముంది డిఎస్పీ ఆగ్రహోదగ్రుడయినాడు. కళ్లు చింతనిప్పుల్లా మెరవగా "నెంబర్ త్రినాట్ త్రి!" డిఎస్పీ పిల్చాడు.

"యస్. సార్!!"

"ఫైర్ హిమ్!" డిఎస్పీ ఆజ్ఞ జారీచేశాడు.

"నో! సర్!"

ఈసారి డిఎస్పీ రైఫిలు నుంచి గుండు వెల్వడ్డది. ఈలోగా "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్ – ఎ-ర్ర-జెం-డా వ-ర్ధి-ల్లా-లి" అనే పలుకులు సూర్యం నోటినుండి గాలిలో కలిశాయి.

ఒక అగ్నికణం రాలింది. ప్రజాసేవకుడొకడు రాలిపోయాడు. ఎందుకో ఓ కానిస్టేబుల్ కళ్లనుండి నీటి బిందువులు రాల్తున్నాయి. మిగతా కానిస్టేబుల్స్ అందరూ మౌనంగా, అదోరకం మొగాలతో డిఎస్పీ ననుసరించారు....

సూర్యం ప్రతి ఒక్క రక్తపుబొట్టునుంచీ వేల సూర్యాలు పుడ్తారు. సూర్యం ఎర్రనైన రక్తం నల్లగొండలో ఆక్రోశిస్తుంది. అతని భౌతిక శరీరంపై గాయాలు మిర్రెం తల్లా భగ్గుమన్నాయి. సూర్యానికి కమ్యూనిస్టునని చెప్పుకునేందుకు సిగ్గులేదు. కమ్యూ

నిప్పుపార్టీలో ప్రజల్లో నీటిలో చేపలాగా మెలిగి అమరుడైన పసిబాలుడు సూర్యాన్ని ఎన్నటికైనా మర్చిపోరు.

సూర్యాన్ని చంపవచ్చు. అలాంటి విప్లవవీరులను ఎంత మందిని చంపినా పోరాటం ఆగదనేది నగ్న సత్యం. ఎక్కడపడితే అక్కడ విప్లవ వీరుల్ని కాల్చి చంపమనే ముండమోపి నాయాళ్ల బుర్రలు యిప్పుడో యెప్పుడో 'రాంకీర్తన' పాడక తప్పదు.

బానిస బంధాలలో మ్రగ్గుతున్న భారతావని విముక్తికి నీవు విడిచి పోయిన జెండాను, తుపాకిని మేం పట్టాం। ఆ వారసత్వాన్నందు కుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం। సమసమాజ నిర్మాణానికి తుపాకిపట్టి రాజీలేని వర్గపోరాటంద్వారా మాత్రమే— పీడిత జనాన్ని దోచుకుని అంతస్తులపై కులుకుతూ, ఆడుతూ పాడుతూ కులుకుతున్నవారిని, క్రొవ్వుపట్టి పందుల్లా బలసిన భూస్వాముల నొక్కొక్కరినే— ఖతం చేయడ మొక్కటే ఏకైక మార్గం. విప్లవానికి దయాదాక్షిణ్యాలు లేవు.

కసితో స్వార్థం శిరస్సు గండ్రగొడ్డలితో
నరక గల్గిన వాడే నేటి హీరో।

హింస ఈ వ్యవస్థ యొక్క వికృత శిశువు.
ప్రతిహింస చేయనివాడు వట్టి పశువు...
అన్న విప్లవ కవులతో మేము సంపూర్ణంగా యేకీభవిస్తున్నాం

సూర్యం చావు హిమాలయ పర్వతంకంటె బరువైనది...
విప్లవం వర్థిల్లాలి॥

సూర్యం అనే అగ్నికణం రాజేసిన నిప్పు యింతింతై కొండంతలై యీ దోపిడీ వ్యవస్థను సమూలంగా దహించి వేయాలని ఆశిద్దాం...

ఎర్రజెండా వర్థిల్లాలి...

అమరజీవి పక్కపంతుల సూర్యంకి జోహార్లు

[24-3-73న కామ్రేడ్ సూర్యం స్మారకసభ వెలిదండ గ్రామంలో జరుపుకున్నరు]

లూసున్

అక్టోబర్ 19 న (1936) చనిపోయాడు లూసున్. 1881 లో పుట్టిన లూసున్ విద్యార్థి దశనుండికూడా ఆనాటి అర్ధవలస వెనకబడిన దేశమైన చైనా ప్రజల విమోచనకొరకు కృషిచేశాడు.

చైనా ప్రజల్లో అతివాద సోషలిస్టుభావాల ప్రచారంలో మొదటివారిలో ఒకడుగా రచయితల్లో ప్రప్రథముడుగా పనిచేశాడు. సోషలిస్టుభావాలుగల రచయితలసంఘాన్ని చైనాలో స్థాపించినవారిలో ముఖ్యుడు నాయకుడు. వైద్యశాస్త్రంలో టోక్యోలో ఉన్నత విద్యకై తనకు వచ్చిన అవకాశాన్ని వదులుకున్నాడు. టోక్యోకు ప్రయాణమైనవాడే చైనాప్రజల విమోచన కార్యక్రమమే, అందుకొరకు తను రచయితగా పాటుబడడమే ముఖ్యమనీ తన వ్యక్తిగతజీవితోన్నతికంటే ప్రజలకొరకు పనిచేయటమే అత్యవసరమైన కర్తవ్యంగా ఆలోచించి, ఆ ప్రయాణాన్ని ఆ విద్యను విరమించుకున్నాడు. పరిపాలకుల చేతులలో చాలా నిర్బంధాలకు గురయాడు.

కమ్యూనిస్టుల లాంగ్‌మార్చ్ గమ్యమైన షెన్సీచేరుకొన్నాక సంతోషాతిశయంతో వారికి యిలా సందేశం పంపాడు. "యావత్ చైనాప్రజల ఆశలూ మీమీదనేవున్నయ్"

ఆయన కార్మికవర్గ మిత్రుడు. కార్మికునికంటె రచయితను ఎక్కువవానిగా ఎన్నడు తలచలేదు ఆయన. కార్మికుడు తన పరికరంతో శ్రమిస్తాడు. రచయిత తన కలంతో రాస్తాడు. రచయిత కార్మికుణ్ణి, విప్లవ అగ్రగామిఅయిన కార్మికుణ్ణి అనుసరిస్తాడు. రచయిత స్వయంగా నాయకుడు కాలేడు. ఆ పాత్ర ఎప్పుడూ శ్రమజీవులదే. విప్లవ యంత్రంలో రచయిత ఒక మర, ఒక చక్రం. యంత్రం యొక్క ఇంజను అతనుకాదు. ఇంజను కార్మికవర్గమే.

లూసున్ చనిపోయినపుడు యింకా ఛంగ్‌కైషేక్ నిరంకుశపాలన జరుగుతున్న రోజుల్లోనే అన్నివర్గాలకుచెందిన 10 వేలమంది ప్రజలు ఊరేగింపులో పాల్గొన్నారు.

చైనాప్రజలకు, విముక్తి పొందాల్సిన సర్వ ప్రపంచ ప్రజలకూ చిరస్మరణీయుడు, రచయితల నిరంతర మార్గదర్శకుడు లూసున్.

వ్యంగ్యం

లూసన్

అపోహలు, అకారణ ఇష్టాయిష్టాలు వదిలించుకోవడం చాలాకష్టం. వ్యంగ్య రచన నిజమైన సాహిత్యంగా గుర్తించలేం. మొదట్నించీ, వ్యంగ్యం మంచిదికాదనే నమ్మకం మనలో బలపడిపోవడమే యిందుక్కారణం. కాని వ్యంగ్యరచనల్లో ఉండే సంఘటనలు సంభాషణలూ జీవితంలో నిత్యం మనకి ఎదురయేవే తప్ప కావాలని ఎక్కడనుంచో సృష్టించేవికావు.

నలుగురూ కలిసేచోట ఇటువంటి సంఘటనలు తటస్థపడడం అబ్బురం కాదు. ఇద్దరు పెద్దలు కలిసినప్పుడు చిరునవ్వుల్తో ముఖాలు వెలిగించుకుని, ముకుళితహస్తాలతో (అనాయాసంగానే తమ స్థూలకాయాలు వంగగలుగుతున్నట్టు నటించడానికి తాపత్రియ పడుతూనే)అతిప్రయాసగా వంగివంగి పరస్పరం అతివినమ్రంగా పలకరించుకుంటారు.

"తమ పవిత్ర నామధేయం...."అని ఒకరడిగితే,

"పెద్దలు.... ఫలానా.... అంటార్లెండి"అని ఇంకొకరు చెప్తారు,

"ఆహా ! తమరేనా ? తమ దర్శనం కలిగినందుకు చాలా సంతోషం. మహ ద్భాగ్యం. ఇంతకీ తమ ఘనమైన వ్యాసంగం ఏమిటో తెలుసుకోవచ్చా ?"

"తమ దయవల్ల .... బడిపంతులుగా ఉంటున్నాను. ఏదో సామాన్యులం."

"ఎంతమాట ! దివ్యంగావుంది. పదిమందికింత విద్యాభిక్ష పెడుతున్నారు, తమ న్వస్థలం ?"

"పట్నం."

"ఇంకేం బహుదొడ్డనగరం కదండీ అదీ...."

ఇలా సాగుతుంది వారి సంభాషణ. ఒకరినొకరు ఘనంగా పొగుడుకుంటారు. వాళ్ళకది ఎబ్బెట్టుగా తోచదు. చూసేవాళ్ళూ పట్టించుకోరు. కాని ఇదంతా ఇలాగే ఏదైనా కథలో జొప్పించితే విపరీతార్థం స్ఫురిస్తుంది. వ్యంగ్యం అనేస్తారు.

అందుకే నూటికి నూరుపాళ్ల అచ్చంగా నిజాలురాసేవాళ్లు "వ్యంగ్యరచయితలు" అని పేరుపడిపోతున్నారు. ఇది మెచ్చుకోలా, నిందా: ఇలా ప్రసిద్ధికెక్కడంవాళ్లకి కీర్తా అపకీర్తా అంటే చెప్పలేం. 'చిన్‌పింగ్‌మి', 'స్కాలర్స్'అనే చైనీస్ నవలల్లో సంఘటనలు వర్ణనలు రోజూ మనం చూసేవే. రష్యన్ రచయిత గోగోల్ కథలు

'ఓవర్‌కోట్', 'ది నోస్'లో పాత్రలు నిజజీవితంలో మనకి పరిచయమైనవే. అయినా మనం వీటన్నిటినీ వ్యంగ్యరచనలు అంటాం.

చాలామంది కీర్తికోసం విపరీతంగా దేవులాడతారు. బతికుండగా వాళ్ల ఆత్మకథలు రాసుకుంటారు. చనిపోయాక ఇతరులు వాళ్ళ జీవితచరిత్రలు స్మృతికావ్యాలూ రాయాలని ఆశిస్తారు. 'జాతీయ చరిత్ర పరిశోధనా విభాగం'వారి జీవితసంగ్రహం సంకలనంచేసి వదిలపరుస్తే బావుండుననుకుంటారు తమలోపాలు తమకి తెలియనంత గుడ్డివాళ్లేంకారుగాని, సరిదిద్దుకోవాలనే ధ్యాసే ఉండదు వీళ్ళకి ఏమీ సిగ్గుపడకుండా ఆలోచనా పాలోచనా లేకుండా అసందర్భంగా ప్రవర్తిస్తారు; అబద్ధాలాడేస్తారు ఐతే అవన్నీ అందరూ తొందరగా మరిచిపోతారనుకుంటారేమో! వాళ్ళ తప్పులూ లోపాలూ మాసిపోయి, వాళ్ల మంచితనం గొప్పతనం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలనుకుంటారు. కాని వారిలోపాల్ని ఎవరైనా భద్రంగా గ్రంధస్తంచేసి వెలుగులోకీడిస్తే కంగారుపడిపోయి వాటిని యెలాగైనా కప్పెట్టెయ్యాలనే ఆతృతతో, ఆ రాతలన్నీ వ్యంగ్యం అనేస్తారు. 'మంచి వ్యంగ్య రచయిత' అంటూ మెచ్చుకుంటున్నట్టే ఆ రాసినవాడిమీద బురద చిమ్ముతారు. దీని నిజానిజాలేంవిటని ఆలోచించకుండా ఆ కబురు మనం నమ్మేస్తాం. మోసపోతాం.

అలాగే, నిందించడం గురించికూడా ఒకావిడ బజారునపడి విటుల్ని వలవెయ్యడానికి తంటాలుపడుతూందనుకుందాం. "ఈ భోగంది వీధిలో నిలబడి బేరాలకి దేవులాడుతూంది", అంటే మనం ఆవిడ్ని దూషించడం అవుతుంది. దూషించడం చాలా చెడ్డపని. మరి మనం చేసినపని చెడ్డదైతే, అవతలవాళ్ళు చేసింది మంచిదన్నమాటే కద। మనం చూసింది నిజమే అయినా నోరుమెదపకూడదు. చెప్పేది వాస్తవమే అయినా అలా బండగా చెప్పకూడదు. ఒకవేళ చెప్పాలంటే "ఆ ఆడమనిషి తన వ్యాపారం అతిశ్రద్ధగా కొనసాగిస్తూంది"అనాలి. అలాగే మన'పెద్దమనుషుల'గురించి "వారు కడుమర్యాదస్తులు, పెద్దలు. అయినా నిగర్వులు కనుక అతి ఆప్యాయంగా పరస్పర యోగక్షేమాలు విచారించుకుంటున్నారు" అని మెలకువగా వర్ణించాలి. అలాగైతే మనం ఎవర్నీ నిందించినట్టుకాదు. అప్పుడది వ్యంగ్యం కాకుండా 'వాస్తవం'గా రాసినట్టవుతుంది।

మంచి వ్యంగ్య రచనలన్నీ, నిజానికి వాస్తవాల గురించి రాసినవే. అయితే వాస్తవాన్ని సమర్థవంతంగా కళాత్మకంగా రాయకపోతే వ్యంగ్యంకాదు. వాస్తవంకాని వ్యంగ్యం అంటూ ఏదైనా ఉంటే అది అపవాదో దూషణో అవుతుంది తప్ప వ్యంగ్యం కాదు

కొందరిని గురించి కొన్ని కరుకు నిజాలు చెప్పడానికి ఒక రచయిత కొంత అతిశయోక్తి ఉపయోగించడమో, జరిగినదాన్ని కాస్త కళాత్మకంగా చెప్పడమో చేస్తే అది ఎవరిగురించి రాసేరో వాళ్లు దాన్ని వ్యంగ్యం అనేస్తారు. వ్యంగ్య రచనకి వాస్తవికతే ప్రాణం. అలాగని అన్నీ నిజంగా జరిగిన సంఘటనలే కానఖ్ఖరలేదు. వాస్తవంగా అలా జరిగే అవకాశంఉన్నా చాలు. వ్యంగ్యం అంటే కట్టుకథలు, అపవాదులు—దూషణలు, రహస్యాలు బయట పెట్టడము, సంచలనాత్మకంగా వార్తలు చెప్పడం, విచిత్ర విషయాలగురించి రాయడమూ కాదు. వ్యంగ్యరచనల్లో తరచు వర్ణించే సంఘటనలు సాధారణంగా నిజజీవితంలో మన కళ్ళముందు జరిగేవే. అయితే, అవి బతుకులో సర్వసాధారణమైపోయి; ఇవన్నీ సహజమూ సమంజసమూ అనుకునేటంతగా వాటికి అలవాటుపడిపోయి ఎవరూ వాటిని పట్టించుకోరు. ఇవి ఎంత అసందర్భంగా, అసహజంగా, అసహ్యంగా, అవాంఛనీయంగా వున్నా అది నిత్యం మన కళ్ళముందే బాహాటంగా జరుగుతున్నా అలవాటువల్ల మనకు ఆశ్చర్యం కలగదు, ఎబ్బెట్టుగా అనిపించదు. కాని, ఎవరైనా వాటిని ప్రత్యేకించి చూపితేమట్టుకు పెద్ద సంచలనమే రేగుతుంది. ఉదాహరణకి, సూటూ బూటూ వేసుకున్నవ్యక్తి గుడిముందు ఆగి దేవుడికి దణ్ణంపెట్టి లెంపలు వేసుకోవడం సాధారణ దృశ్యమే. అలాగే, నిత్యమూ శాంతిపథం గురించి వివరించే సన్యాసి ఒక్కోసారి విపరీతంగా ఆగ్రహించడమూ అరుదేంకాదు. ఇవి క్షణంలో సగంలో జరిగిపోయి మళ్ళీ కనుమరుగైపోతాయి. కాని ఆక్షణంలో వాటిని టక్కున పట్టి ఫొటోతీసి ప్రదర్శిస్తే యెంతో హాస్యం పుట్టుకొస్తుంది ఆ ఫోటోలు ప్రచారంలోకివస్తే వారివారి శాస్త్రీయ దృక్పథానికీ ధర్మప్రబోధానికీ దెబ్బతగుల్తుంది. ఇవి చూసేవాళ్ళకేకాక ఆ అసలు వ్యక్తులకికూడా వ్యగ్రతగా ఉంటాయి. ఇవి అబద్ధాలు కావని అందరికీ తెలుసు. కాని అందుకు సంబంధించినవాళ్లు మాత్రం అవి నిజంఅని ఒప్పుకోలేరు. ఒప్పుకుంటే వాళ్ళపరువు పోతుంది. అందుకని వ్యంగ్యం హాస్యం అంటూ తెలివిగా దాటవేస్తారు. అంటే అవి ఏదోకావాలని కల్పించినవి మాత్రమేనని అందర్నీ నమ్మమంటారు,

అయితే, వ్యంగ్యరచనలో 'కళ'అంతా కావాలని రాయడంలోనేవుంది. కొద్దిగా అతిశయోక్తికి పాల్పడి అయినాసరే చెప్పదల్చుకున్న విషయంలోని సారాంశం చదివేవాడి మెదడుమీద అచ్చువేసేలా చెప్పడమే వ్యంగ్యరచనలో గొప్పదనం. అదే సంఘటనని అశ్రద్ధగా అజాగ్రత్తగా కళావిహీనంగా మొరటుగా చెప్పేస్తే అది ఎన్నటికీ వ్యంగ్యంకాలేదు. దాన్ని ఎవరూ పట్టించుకోరు. ఉదాహరణకి ఈమధ్య వార్తా పత్రి

కలు ప్రచురించిన రెండు విశేషాలు చూడండి. ఒకటి, ఒక యువకుడు సైనికోద్యోగిలా నటించి అందర్నీ మోసం చేసేడు. తీరా పట్టుబడ్డాక, పొట్టగడవక అలా చేసేనని వాఙ్మూలం రాసిచ్చేడు. రెండోది: ఒక దొంగ ఓవూళ్లో పిల్లలందర్నీ ఓచోట చేర్చి దొంగతనాలు ఎలా చెయ్యాలో బోధిస్తున్నాట్ట. తలిదండ్రులకి అదితెలిసి పిల్లల్ని ఇళ్ళల్లో కట్టిపడేసేరుట. అందుమీదట ఆ దొంగవాళ్ళందరితో పోట్లాడేట్ట. గమనించదగిన వార్తల గురించి పత్రికలు వ్యాఖ్యానం చేయడం కద్దు. కాని ఏ పత్రికా వీటి గురించి యిప్పటివరకూ ఎలాటి వ్యాఖ్యానమూ చేయలేదు. అంటే యివి సర్వసాధారణమైనవని పక్కకు నెట్టేసేయన్నమాట. స్విఫ్ట్, గోగోల్‌వంటి రచయితలచేతిలో పడితే ఈ సంఘటనలే ఎంతో రసవత్తరమైన వ్యంగ్యకథలుగా తయారయివుండును.

వ్యంగ్యరచయిత ఎవరిగురించి రాస్తాడో వాళ్లు అతన్ని అసహ్యించుకుంటారు. కాని ఆయన సదుద్దేశంతోనే రాస్తాడు. లోపాలు తొలగించుకుని వాళ్లు మంచికిమారాలనే రాస్తాడుతప్ప వాళ్ళని అపకీర్తిపాలు చెయ్యాలని రాయడు. కాని ఒక వ్యక్తి గురించో ఒక ముఠాగురించో వ్యంగ్య రచయిత రాయవలసిన స్థితి వచ్చిందీ అంటే అప్పటికే వాళ్ళ పతనం సిద్ధమయిందన్నమాట. రాతలవల్ల ఎవరూ పెద్దగామారిపోరు. బాగుపడరు. ఒకోసారి కొంత వ్యతిరేక ఫలితంకూడా వుండొచ్చు. రచయితకొందరి లోపాల్ని వ్యంగ్యంగా ఎత్తిచూపితే, వారి వ్యతిరేకులు వాటిని తమ ప్రయోజనాల సాధనకు వాడుకోవచ్చు. అయితే, అందరూ ఈ వ్యంగ్య రచనల్ని నిజాలు బయట పెట్టేవిగా మాత్రమే చూడాలి.

రచనలో వ్యంగ్యం ఉండి, సరియైన లక్ష్యమూ నిజాయితీ లోపిస్తే: అటువంటి రచనలవల్ల పాఠకుడికి యీ ప్రపంచంలో మంచి ఏమీలేదనే నమ్మకమూ, అందు గురించి మనం చేయగలిగిందేమీ లేదనే నిస్పృహా కలిగితే— ఆ రచన వ్యంగ్యంకాక, 'సినిసిజం', 'నిర్వేదం' అవుతుంది.

(స్వేచ్ఛానువాదం : ఐ.వి.)

[ON SATIRE (16-3-'35) WHAT IS SATIRE? (A Reply to the society of Literature) (3-5-1935)— అనే LuHsun రచనలకు స్వేచ్ఛానువాదం.]

SRJANA Telugu Monthly March/April '73 H-1088
Regd. No. with Registrar of News Papers of India 10953/67

వెలువడింది

శ్రీకాకుళ సత్యం

విరసం ప్రచురణ

వెంపటాపు సత్యం పాటలు

ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్ 506001

వెలువడింది

వి. ర. సం. లో మార్క్సిస్ట్ వ్యతిరేక ధోరణులను ప్రతిఘటించండి

విప్లవ రచయితలు

అరుణ సాహితి హైదరాబాదు

ప్రచురణ వెల: రూపాయిన్నర

ప్రతులకు : 1. సృజన, హనుమకొండ, వరంగల్ 506001

2. పిలుపు, 13-1-1/61, సీతారాంబాగ్, హైదరాబాదు 500001

80 Pages 1 Re.